PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 264 | విజయవాడ, సోమవారం 29 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 29 April 2024 | Rs

గాజాలో దారుణ మారణకాండపై

ఆరని ఆగ్రహ జ్వాలలు

- నిర్బంధాన్ని ఎదిరించి ముందుకు సాగుతున్న అమెరికాలోని యూనివర్సిటీ విద్యార్థులు

7

బ్రేకుల్లేని జాక్స్

- ఛేదనలో విల్ జాక్స్ అజేయ సెంచరీ
- విరాట్ కోహ్లి అర్ధ శతక జోరు
- గుజరాత్‌పై బెంగళూరు ఘన విజయం
- గుజరాత్ 200/3, బెంగళూర్ 206/1

8

బ్యాంకు ఖాతాల్లోకి

పింఛన్లు

ఈ నెలారంభంలో పింఛన్ కోసం సచివాలయం వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు (ఫైల్)

- ఖాతా లేని వారికి ఇంటి వద్దనే పంపిణీ
- మే 1న ఖాతాలో జమ
- 5వ తేదీ లోపు పంపిణీ పూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక భద్రత పింఛను పొందే లబ్ధిదారులు పింఛన్ కోసం మండుటెండలో సచివాలయాలకు వెళ్లి, అక్కడ పడిగాపులు పడాల్సిన పనిలేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే పింఛన్ నగదు జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మే, జూన్ నెలలకు సంబంధించిన పింఛన్‌ను ప్రభుత్వం ఈ డైరెక్టు బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) పద్ధతిలో పింఛనుదారులకు అందించబోతోంది. అలాగే ఎవరికైతే బ్యాంకు ఖాతాలు లేవో.. వారందరికీ ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. పింఛన్ల పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి, లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో, ఇంటి వద్దనే పింఛను అందించాలని ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని, పింఛను తీసుకోవటంలో వారు అసౌకర్యానికి గురి కాకూడదంటూ కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వం పింఛను పంపిణీలో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారులకు ఏప్రిల్ నెలకు సంబంధించిన పింఛను డబ్బులు మే 1వ తేదీనే వారి బ్యాంకు ఖాతాలో జమవుతాయని, అలాగే మే నెలకు సంబంధించిన పింఛను డబ్బులు జూన్ 1న జమవుతాయని ఆయన తెలిపారు. ఆధార్‌తో ఏ బ్యాంకు ఖాతా అయితే లింక్ అయి ఉందో, ఆ ఖాతాకు డబ్బులు జమవుతాయని.. ఎవరికైతే డిబిటి ద్వారా పింఛను డబ్బులు వస్తున్నాయో వారి వివరాలతో కూడిన జాబితా గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయని చెప్పారు.

48 లక్షల మందికి బ్యాంకు ఖాతాల్లో జమ

రాష్ట్రంలో ప్రస్తుతం 65,49,864 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరంతా మే నెలలో పింఛను తీసుకోబోతున్నవారే. అయితే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) లెక్కల ప్రకారం వీరిలో 48,92,503 మందికి మాత్రమే ఆధార్, బ్యాంకు ఖాతాతో మ్యాప్ అయి ఉంది. మే 1వ తేదీనే వీరికి డబ్బులు జమవనుండగా.. వారికి బ్యాంకు ఖాతాకు లింక్ అయిన ఫోన్ నెంబరుకు మెసెజ్ వస్తుంది. ఇక ఎవరికైతే బ్యాంకు ఖాతా లేదో/ లింక్ కాలేదో వారికి నేరుగా ఇంటికే వచ్చి పింఛను డబ్బులు అందజేస్తారు. అధికారిక డేటా ప్రకారం 16,57,361 (25.30 శాతం) మందికి ఆధార్, బ్యాంక్ ఖాతా మ్యాప్ కాలేదు. దీంతో వీరందరికీ ఇళ్ల దగ్గరే పింఛను అందించనున్నారు. మే 1న ఈ పంపిణీ కార్యక్రమం ప్రారంభమై.. మే 5వ తేదీ వరకు కొనసాగుతుంది. బ్యాంకు ఖాతాలు లేనివారి వివరాలు ఇప్పటికే సంబంధిత సచివాలయాల వద్ద/పింఛన్ పంపిణీ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

పథకాలు సరే..

భారాల సంగతి చెప్పండి

ప్రజలపై ధరలు, పన్నుల భారాలు మోపబోమని హామీ ఇవ్వాలి

ప్రెస్‌మీట్‌లో వి శ్రీనివాసరావు, వై వెంకటేశ్వరరావు

- రాజకీయాలను శాసిస్తున్న కార్పొరేట్లను సాగనంపండి
- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చే వాటిని వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి పోటీలు పడి ప్రకటిస్తున్నాయని, అవి కాకుండా ప్రజల నుంచి పన్నులు, ధరలు పెంచి ఎంత వసూలు చేస్తారో చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆ పార్టీలను ప్రశ్నించారు. ధరలు పెంచకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మ్యానిఫెస్టోల పేరుతో ప్రజలకు పంచే పథకాలు గురించే చెబుతున్నాయని, పన్నులు, భారాలు గురించి ప్రస్తావించడం లేదని తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావుతో కలిసి విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మూడు హామీలు ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆస్తి, జిఎస్‌టి తదితర పన్నులు విద్యుత్ ఛార్జీలు, ఇసుక, పెట్రోల్, గ్యాస్ సహా నిత్యావసర సరుకుల ధరలు పెంచబోమని, కొత్త భారాలు ప్రజలపై మోపబోమని, ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టబోమని హామీలు ఇవ్వాలని నిలదీశారు. భూమి, సాగు నీటి హక్కు రైతులకు, అడవులపై ఆదివాసీలకు హక్కులు ఉండాలని చెప్పారు. ఉపాధి హామీ వ్యవసాయ కార్మికుల, గ్రామీణ పేదల హక్కుగా, కనీస వేతనాలు పొందడం కార్మికుల హక్కుగా ఉండాలని చెప్పారు. ఈ హక్కులను కాపాడతాయో లేదో ఈ పార్టీలు చెప్పడం లేదన్నారు. రిజర్వేషన్లు ఎత్తేస్తామంటున్నా బిజెపి పల్లకిని మూడు పార్టీలు మోస్తున్నాయని ఎద్దేవా చేశారు. సిఎఎ గురించి, వైసిపి, టిడిపి మాట్లాడటం లేదని, విశాఖ ఉక్కు, పోలవరం నిర్వాసితులపై మౌనం పాటిస్తున్నాయని విమర్శించారు.

పదేళ్లలో అభివృద్ధి శూన్యం

గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి సాధించామని వైసిపి, టిడిపి డబ్బాలు కొట్టుకుంటున్నాయని, వాస్తవం మాత్రం శూన్యమని శ్రీనివాసరావు అన్నారు. పిల్లల చదువు, పౌష్టికాహారం వంటి 12 సూచికల్లో ఒక్కదానిలో కూడా రాష్ట్రం మొదటి స్థానం సాధించలేదని, కనీసం ఆ దరిదాపుల్లో కూడా లేదన్నారు. కేరళ రాష్ట్రం మాత్రం ఐదు అంశాల్లో తొలిచోటు దక్కించుకుందన్నారు. చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించకుండా, పిల్లలకు చదువు అందించకుండా ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తరువాత రైతులు 13 లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగుభూమిని కోల్పోయారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని, ఇది ఆందోళనకర అంశమని చెప్పారు. భూ కేంద్రీకరణ పెరిగిందని, చిన్న రైతుల వద్ద ఉండే భూమి శాతం కూడా తగ్గిందన్నారు. ఈ భూములు మొత్తం కార్పొరేట్, రియల్ ఎస్టేట్ చేతుల్లోకి వెళ్లిందన్నారు. కార్పొరేట్లకు అప్పగించిన కాకినాడ సెజ్, సౌత్, నార్త్, ఈస్ట్ వంటి కారిడార్లలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. ఈ భూముల్లో వ్యవసాయం చేసి పంటలు పండించినట్లయితే అభివృద్ధి చెందేదని చెప్పారు. సాగునీరు 40 వేల హెక్టార్లలో తగ్గిందని, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామని చెబుతున్న వైసిపి, టిడిపి దీనిపై సమాధానం చెప్పాలని నిలదీశారు. గత టిడిపి ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో 1,29,528 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, సూపర్ సిక్స్‌లో మాత్రం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. వీటిని ఎక్కడి నుంచి తేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ కల్పనపై వైసిపి మాట్లాడటం లేదన్నారు. ఆ పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఈ అంశంపై ప్రస్తావనే లేదని చెప్పారు.

సామాన్యులకు, సంపన్నుల మధ్య పోటీ

రానున్న ఎన్నికలు సామాన్యులకు సంపన్నులైన బడా కార్పొరేట్ల మధ్య జరుగుతున్న యుద్ధం అని చెప్పారు. అభ్యర్థుల 175 అసెంబ్లీ మిగతా 2లో

ప్రచండ భానుడు

- నంద్యాల, కడపలో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భానుడు భగభగ మండిపోతున్నాడు. మరో రెండు రోజుల్లో మే నెల సమీపిస్తుండటంతో సూర్యుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం నంద్యాల జిల్లా నందికొట్కూరు, కడప జిల్లా చాపాడులో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కర్నూలు జిల్లా గూడూరులో 45.5, విజయనగరం జిల్లా రామభద్రపురంలో 45.2, పార్వతీపురం మన్యం జిల్లా మక్కువలో 45.1, పల్నాడు జిల్లా నర్సారావుపేటలో 45 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీటితోపాటు శ్రీకాకుళం, తిరుపతి, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోనూ 44 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మరోవైపు రాష్ట్రంలోని 68 మండలాల్లో ఆదివారం తీవ్ర వడగాడ్పులు వీయగా.. 120 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంది. సోమవారం దాదాపు 200 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని ఆ సంస్థ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఓవైపు తీవ్ర ఉష్ణోగ్రతలకు తోడు, ఉక్కపోత కూడా తోడుకావటంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకే జనాలు జంకుతున్నారు. ఉదయం 10 తర్వాత ప్రజలు బయటకు వచ్చేందుకు సంకోచిస్తున్నారు. అలాగే సాయంత్రం 4 దాటితే గానీ బయటకు వచ్చే సాహసం చేయటం లేదు. మరోవైపు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెరుగుతుండటంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వలసలు పోకుండా చర్యలు

కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

- ఇంటింటికీ కుళాయి నీరు
- ప్రజాగళం సభల్లో చంద్రబాబు హామీలు

ప్రజాశక్తి - కర్నూలు, నెల్లూరు ప్రతినిధులు

కర్నూలు జిల్లా నుంచి ఎవ్వరూ వలసలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. టిడిపితోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం, కోడుమూరు నియోజకవర్గం గుడూరులో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభల్లో ఆయన ప్రసంగించారు. 99 శాతం హామీలను అమలు చేశామని సిఎం జగన్ చెబుతున్నారని, ప్రజల జీవితాల్లో ఏమైనా మార్పు వచ్చిందా? అని ప్రశ్నించారు. 102 ఇరిగేషన్ ప్రాజెక్టులను జగన్ రద్దు చేశారని విమర్శించారు. జగన్ ప్యాలెస్ కొల్లగొడితే పేదల పొట్ట నిండుతుందని అన్నారు. సామాజిక సమీకరణల ప్రకారం కర్నూలు జిల్లాలో టికెట్లు ఇచ్చామని తెలిపారు. తాగునీరు ఎక్కడ ఉంటే అక్కడి ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని, పక్కనే తుంగభద్ర నది ఉన్నా.. ఈ ప్రాంత ప్రజలకు తాగడానికి నీళ్లు లేవన్నారు. జగన్‌ను నమ్మి రాయలసీమ ప్రజలు మోసపోయారు. వైసిపిని చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు న్యాయం చేస్తామన్నారు. రహదారులను బాగు చేసే బాధ్యత తమదేనన్నారు. పేదలకు మూడు సెంట్ల ఇళ్ళ స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తామని, ఏప్రిల్ నుంచే పెంచిన పింఛన్లు ఇస్తామని చెప్పారు. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఇంటింటికి కుళాయి ద్వారా తాగు నీరు, డ్వాక్రా సంఘాలకు రూ.పది లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సోలార్ ద్వారా నాణ్యమైన విద్యుత్ ఇస్తామని, ఛార్జీలు పెరగకుండా ఆదుకుంటామని అన్నారు. సభలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి, టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, ఎంపి అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.

ముస్లిములకు టిడిపి హయంలోనే లబ్ధి

హజ్‌యాత్రికుల కోసం ఒక్కో ముస్లిం సోదరికి లక్ష రూపాయలు సాయం చేశామని చంద్రబాబు తెలిపారు. నెల్లూరులోని షాదీ మంజిల్‌లో జరిగిన ముస్లిం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెల్లూరులో జరిగే రొట్టెల పండుగను రాష్ట్ర పండుగా మార్చింది తమ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ముస్లింలు లేకపోతే అభివృద్ధి లేదని ప్రతి పట్టణంలోని ఆటోనగర్‌లో ముస్లింలే ఎక్కువ మంది పనిచేస్తున్నారని తెలిపారు.

మళ్లీ మోసగించడానికే...

టిడిపి, జనసేన, బిజెపిపై బహిరంగ సభల్లో సిఎం వైఎస్ జగన్ విమర్శ

అనంతపురం జిల్లా తాడిపత్రి సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- యంత్రాంగం

మళ్లీ ముగ్గురూ జతకట్టి ప్రజలను మోసం చేయడానికి ముందుకొస్తున్నారని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోడీని ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలకు మంచి జరగాలంటే బిజెపి, టిడిపి, జనసేన కూటమిని ఓడించాలని, వైసిపిని గెలిపించాలని కోరారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా వెంకటగిరి, నెల్లూరు జిల్లా కందుకూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. రైతుల, మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తామనే హామీతోపాటు అనేక హామీలను బిజెపి, జనసేన, టిడిపి కూటమి గతంలో ఇచ్చిందన్నారు. వాటిలో ఏ ఒక్క హామీనైనా ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పుడు ఇవే పార్టీలు కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ అనేక హామీలు ఇస్తూ ప్రజలను మళ్లీ మోసగించాలని చూస్తున్నాయని విమర్శించారు. తాము ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలు అమలు చేశామని,. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను చేర్చామని వివరించారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. సంక్షేమ పథకాలతో ఈ ఐదేళ్లలో రూ.2.70 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు నగదు బదిలీ రూపంలో అందజేశామని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ఉండాలన్నా, సచివాలయ వ్యవస్థ ఉండాలన్నా వైసిపిని మరోమారు గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. అవినీతి రహితంగా పరిపాలన సాగిందని పేర్కొన్నారు.

చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు దోచుకున్నాయని విమర్శించారు. చంద్రబాబు 14 ఏళ్ల పరిపాలనలో చెప్పుకోదగ్గ పథకం ఒక్కటైనా ఉందా? అని ప్రశ్నించారు. అమలుకు వీలుకాని హామీలతో చంద్రబాబు ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. చంద్రబాబుని అధికారంలోకి తీసుకురావడానికి కొన్ని శక్తులు పనిచేస్తున్నాయన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలు ఆ శక్తులకు నచ్చడం లేదని దుయ్యబట్టారు.

ఇసి నోటీసులిచ్చినా..

ఆగని విద్వేష జాఢ్యం

- తీరు మారని బిజెపి స్టార్ క్యాంపెయినర్లు
- నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, యోగి ప్రసంగాల్లో స్పష్టం

న్యూఢిల్లీ : విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలపై వివరణ కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులిచ్చినా.....బిజెపి నాయకుల నోటి దురుసు మాత్రం ఆగడం లేదు. మైనార్టీలతో పాటు సమాజంలో అణగారిన సామాజిక తరగుతలపైనా, వారికి రాజ్యాంగ కల్పించిన రిజర్వేషన్లపైనా కాషాయ నేతలు కుటిల వ్యాఖ్యలు చేస్తున్నారు. విద్వేష మోతాదు మరింతగా పెంచి ప్రజలను చీల్చే కుట్రలు సాగిస్తున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాతో సహా స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరింతగా విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలను దట్టిస్తున్నారు. ముస్లింలకు కాంగ్రెస్ సంపదను తిరిగి పంచుతుందని ఆరోపిస్తూ బిజెపి సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగంగా మత విద్వేష వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. వాస్తవానికి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఎక్కడా దేశంలో సంపద పునర్విభజన గురించి ప్రస్తావించలేదు. ఉద్యోగాలు, రిజర్వేషన్లు, సచార్ కమిటీ నివేదిక అమలు, ట్రిపుల్ తలాక్‌ను తిరిగి తీసుకురావటంలోనూ ముస్లింల గురించి ప్రత్యేకంగా మాట్లాడలేదు. కానీ 'ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల హక్కులను లాక్కొని ముస్లింలకు ఇవ్వాలని కాంగ్రెస్ కోరుకుంటున్నది' అని మోడీ మతపరమైన వ్యాఖ్యలు చేశారు. వీటిని ప్రతిధ్వనించేలా జెపి నడ్డా సైతం రెండ్రోజుల క్రితం మత విద్వేష జాఢ్యాన్ని వెల్లగక్కారు. 'ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల హక్కులను లాక్కొని ముస్లింలకు ఇవ్వటమే కాంగ్రెస్, ఇండియా బ్లాక్ రహస్య అజెండా. దేశంలోని వనరులపై తొలి హక్కు ముస్లింలకే ఉందని కాంగ్రెస్ చెప్తున్నది. అయితే వనరులపై మొదటి హక్కు ఈ దేశంలోని పేదలదేనని ప్రధాని మోడీ అన్నారు' అని ఆయన సెలవిచ్చారు. మోడీలాగే.. నడ్డా కూడా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రసంగాన్ని తప్పుదారి పట్టించారని రాజకీయ విశ్లేషకులు మిగతా 7లో

ఇండియా వేదికే ప్రత్యామ్నాయం

- వైసిపి, టిడిపిలతో రాష్ట్రానికి హోదా రాదు
- మోడీతో జగన్, బాబు ట్రయాంగిల్ లవ్ స్టోరీ
- న్యాయ్ యాత్ర సభల్లో వైఎస్.షర్మిల విమర్శ

విశాఖ సభలో మాట్లాడుతున్న షర్మిల, వేదికపై 'ఇండియా' అభ్యర్థులు రామారావు, సత్యారెడ్డి, జగ్గునాయుడు

ప్రజాశక్తి- యంత్రాంగం

దేశానికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి పనికిరాదని, ఇండియా వేదికనే సరైన ప్రత్యామ్నాయమని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. మోడీతో చంద్రబాబు పొత్తు, జగన్ తొత్తు అని... వీరు ముగ్గురిదీ ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపితో చంద్రబాబు ప్రత్యక్షంగా, జగన్ పరోక్షంగా జతకట్టి వారి స్వప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు, యువతకు ఉపాధి కల్పనకు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు ఇండియా వేదికలోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా విశాఖ జిల్లా అక్కయ్యపాలెంలోనూ, శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోనూ ఆదివారం జరిగిన బహిరంగ సభల్లో ఆమె మాట్లాడారు. జగన్ గత ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవేవీ అమలు చేయలేదన్నారు. 42 నీటి పారుదల ప్రాజెక్టులను నవరత్నాల్లో పెట్టి ఏ ఒక్కటీ అమలు చేయలేదని వివరించారు. మద్యనిషేధం హామీని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానులని చెప్పి విశాఖలో కూడా రాజధాని పెట్టలేకపోయారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనలో చంద్రబాబు, జగన్ ఇద్దరూ విఫలమయ్యారన్నారు. గంగవరం పోర్టును ప్రభుత్వంలో కలిసేలా వైఎస్.రాజశేఖరరెడ్డి అగ్రిమెంట్ చేస్తే, అయన కొడుకైన జగన్... అదానీకి అమ్మేయడం దారుణమన్నారు. విశాఖ ఎంపీగా 2019లో గెలిచిన వైసిపి వ్యక్తి భూకబ్జాలతో ఎంపీ పదవిని భ్రష్టు పట్టించారని విమర్శించారు. విశాఖ ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న సత్యారెడ్డిని గెలిపిస్తే ఇక్కడి ప్రజల తరుఫున పార్లమెంట్‌లో గళం వినిపిస్తారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ షర్మిల న్యాయ యాత్రతో కాంగ్రెస్‌కు రాష్ట్రంలో జవసత్వాలు వచ్చాయన్నారు. విశాఖకు రైల్వే జోన్ రాకపోయినా, స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో పడినా పాలకులకు పట్టడం లేదన్నారు. చంద్రబాబు, జగన్ మిగతా 2లో

ఆరోగ్య ప్రణాళిక పత్రాన్ని విడుదల చేస్తున్న ఐఎంఎ జాతీయ, రాష్ట్ర నాయకులు

అందరికీ ఆరోగ్య భద్రత

- ఐఎంఎ హాలు ప్రారంభంలో జాతీయ అధ్యక్షులు అశోకన్

మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మోడీ ప్రసంగాలు

- దేశాన్ని విధ్వంసం వైపు తీసుకెళ్తున్న బిజెపి
- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ఆందోళన

లోపలి పేజీల్లో..

ప్రశాంతంగా ఎపి సెట్

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఎపి సెట్ - 2024 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. 79.97 శాతం హాజరు నమోదయిందని ఎపిసెట్ సెక్రటరీ ఆచార్య జిఎంజె.రాజు తెలిపారు.

పరీక్షకు 38,078 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 30,451 మంది హాజరయ్యారు. 7627 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఆదివారం ఉదయం ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించడం పట్ల అధికారులను ఆయన అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది ప్రాంతీయ కేంద్రాల పరిధిలో 79 పరీక్షా కేంద్రాలలో 30 సబ్జెక్టులలో ఎపిసెట్ 2024ను నిర్వహించారు. విశాఖలో 79.25 మంది, రాజమండ్రిలో 79.57, గుంటూరులో 75.64, నెల్లూరులో 79.40, అనంతపురంలో 83.40, తిరుపతిలో 82.60, కడపలో 84.83, కర్నూలులో 81.69 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు.

'ఉక్కు' పరిరక్షణకు ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1172వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్యకర్తలు, కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు, హెచ్‌ఎంఎస్ నాయకులు గణపతిరెడ్డి, దొమ్మేటి అప్పారావు మాట్లాడారు. ఉక్కు కర్మాగారం పట్ల, అందులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్దయగా వ్యవహరిస్తున్నాయన్నారు. వేతన పెంపు విషయంలో తీవ్ర అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. మోడీ సర్కారు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేస్తామని ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సిఎస్‌ను, డిజిపిని బదిలీ చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేయాలని టిడిపి-జనసేన-బిజెపి కోరింది. కేంద్ర ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణాధికారి రామ్‌మోహన్ మిశ్రాను విజయవాడలో ఆదివారం కలిసి ఆయా పార్టీల నేతలు ఫిర్యాదు చేశారు. శాంతిభద్రతల వైఫల్యాలున్నాయని పుస్తకాన్ని మిశ్రాకు అందించారు. డిజిపి, సిఎస్ ఉంటే ఎన్నికలు సజావుగా సాగే పరిస్థితి లేదని తెలిపారు. డిజిపి ఆదేశాలతో పోలీసులు ఏకపక్షంగా అధికార పార్టీకి మొగ్గుచూపుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనరు రమేష్‌కుమార్ తన ప్రాణాల రక్షణ కోసం కేంద్ర బలగాల సహకారం కోరారని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఇంకా ఆర్‌ఒలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అధికార పార్టీ మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఐఎఎస్ అధికారి ధనంజయరెడ్డిని సస్పెండ్ చేయాలని, మ్యానిఫెస్టోపై స్పందించిన ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి టి శివశంకర్, టిడిపి నేతలు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోడూరి అఖిల్, వల్లూరి కిరణ్, బండారు వంశీ, బిజెపి నేత లంకా దినకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టేలా మోడీ ప్రసంగాలు

- దేశాన్ని విధ్వంసం వైపు తీసుకెళ్తున్న బిజెపి
- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ఆందోళన

మాట్లాడుతున్న ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆయన మంత్రి వర్గంలోని మంత్రులు మతవిద్వేషాలను రెచ్చగొట్టేవిధంగా ప్రసంగాలు చేస్తున్నారని, దీనిని ప్రజలు క్షమించరని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. భారతదేశం శతాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్యం ప్రస్తుతం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో 'నేటి భారతం- సవాళ్లు' అన్న అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సుకు డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు బి రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా పరకాల మాట్లాడుతూ గడిచిన పదేళ్లగా దేశ ఆర్థిక వ్యవస్థ, మన రాజ్యాంగ విలువలు, విధ్వంసానికి గురయ్యాయని, ప్రభుత్వం, అధికార పక్షం దేశాన్ని విధ్వంసంవైపు తీసుకెళ్తున్నాయని వివరించారు. మణిపూర్ ప్రాంతంలో విధ్వంసం జరిగితే మనకేంటి అనుకోవడం సరికాదన్నారు. అక్కడ జరుగుతున్న మారణకాండ, మారణహోమం మిగిలిన రాష్ట్రాలలో జరిగేటటువంటి అతిపెద్ద ప్రమాదం దేశంలో పొంచి ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం ప్రబలిపోయిందని, ధరలు అదుపులో లేవన్నారు. అధికార పార్టీకి ఓట్లు వేసి తిరిగి అధికారాన్ని కట్టబెడితే దేశం సంక్షోభంలో పడుతుందన్నారు. ప్రధాన మంత్రి బయట మాట్లాడటం కాదు.. ఆగస్టు 15న ఏకంగా ఎర్రకోట మీదకు ఎక్కి ఇటువంటి పిలుపునిచ్చే ప్రమాదం ఉందని పిలుపునిచ్చారు. దేశ రాజ్యాంగ విలువలను, ఆర్థిక వ్యవస్థను, సామాజిక వ్యవస్థను కాపాడుకోవాలంటే నేడు అధికారంలో ఉన్న పార్టీని, ప్రభుత్వాన్ని, నాయకత్వాన్ని ఇంటికి పంపించి తీరాల్సిందేనని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ట్రస్టు చైర్మన్ చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ ఏ దేశంలో లేనివిధంగా భారతదేశం పెనుప్రమాదంలో చిక్కుకు పోయిందన్నారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేసి చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.అంకయ్య పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు సుబ్బారావు కన్నుమూత

ప్రజాశక్తి - కొల్లూరు (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా కొల్లూరు మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు ధూళిపాళ్ల సుబ్బారావు (102) వయోభారంతో ఆదివారం తన స్వగృహంలో కన్నుమూశారు. సోమవారం ఆయన భౌతికకాయాన్ని విజయవాడలోని నిమ్రా కాలేజీకి దానం చేయనున్నారు. ఆయన మృతదేహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద రైతు కుటుంబంలో సుబ్బారావు జన్మించి, చివరి వరకూ పేదల కోసం, దళితుల కోసం, రైతాంగ సమస్యలపై పోరాటం చేశారని గుర్తుచేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అనంతవరం గ్రామంలో 32 రోజుల పాటు గ్రామాల స్థితిగతులపై సర్వే చేసిన సందర్భంలో సుబ్బారావు కీలక పాత్ర పోషించారన్నారు. 1978లో కూలి పోరాటం నిర్వహించి ఆ పోరాటం సందర్భంగా అప్పటి జిల్లా కలెక్టర్‌ను అనంతవరం రప్పించి.. ఈ ప్రాంతంలో ఉన్న చెరువులను పేదలకు ఇచ్చేలా చేశారని వివరించారు. ఇప్పటికీ ఆ చెరువులు పేదల ఆధీనంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పార్టీ ఆఫీసు నిర్మాణానికి తన వంతు కృషి చేశారని చెప్పారు. సిపిఎం అగ్ర నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, కొరటాల సత్యనారాయణతో సుబ్బారావుకు మంచి పరిచయాలున్నాయని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి ఫోన్‌చేసి సుబ్బారావు కుటుంబసభ్యులకు పరామర్శించారు. భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో ప్రజా వైద్యులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు టి కృష్ణమోహన్, ములకా శివసాంబిరెడ్డి తదితరులు ఉన్నారు.

అడ్డగోలుగా మైనింగ్ దోపిడీ

- పోలవరాన్ని నిర్లక్ష్యం చేసి రైతులకు అన్యాయం
- గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి
- ఏలేశ్వరం విజయభేరి సభలో పవన్ కల్యాణ్

ఏలేశ్వరం సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, ఏలేశ్వరం

అధికార పార్టీ అండదండలతో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడలో అక్రమ మైనింగ్ (లేటరైట్) దోపిడీ యథేచ్ఛగా సాగుతోందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. ఆదివారం రాత్రి ఆయన కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో వారాహి విజయభేరి సభలో ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంతాడలో అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. సహజ వనరులను అడ్డగోలుగా తవ్వుకుపోతే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అక్రమ మైనింగ్ వల్ల భూములు నష్టపోయిన రైతాంగానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గోదావరి జిల్లాల్లో సరైన నీటి ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికే తాను ఈ జిల్లా నుంచి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. జగన్ ప్రభుత్వం పోలవరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి రైతులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రత్తిపాడు మండలం లంపకలోవలో ద్వారంపూడికి చెందిన వీరభద్ర కంపెనీకి ఒక వంతెన నిర్మించుకున్నారని, కానీ ఇక్కడ రోడ్లు వేయలేకపోయారని వివరించారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ నిధులను జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను వారికే అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏలేరు ఆధునీకరణ చేపట్టి, పుష్కర, పోలవరం కాలువలపై ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తామన్నారు. రవాణా వ్యవస్థను మెరుగుపరచడమే కాకుండా గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను మెరుగుపరిచి, ఆధునిక ఆస్పత్రులను నిర్మించి నైపుణ్యం ఉన్న వైద్యులను నియమిస్తామన్నారు. పెదమల్లాపురాన్ని మండల కేంద్రంగా చేసి గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సుబ్బారెడ్డి, చంద్రబాబు సాగర్ ఆధునీకరణను చేపడతామన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు జిల్లాలోనే ఐటి కంపెనీలను తీసుకొచ్చి యువతకి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ, జనసేన కాకినాడ పార్లమెంటు అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లోగా .. 40 శాతం కోకింగ్ కోల్

- గంగవరం యాజమాన్యానికి విశాఖ కలెక్టర్ ప్రతిపాదన
- అంగీకారం తెలిపిన యాజమాన్య ప్రతినిధులు
- సమ్మెకు ముందుటి సాధారణ పరిస్థితి కోరిన పోర్టు కార్మిక నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అదానీ గంగవరం పోర్టులో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 2 లక్షల టన్నుల కోకింగ్ కోల్‌లో 40 శాతం అంటే సుమారు 70 వేల టన్నులను వారం రోజుల్లోగా ప్లాంట్‌కు చేరవేసేందుకు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం సాయంత్రం జరిపిన చర్చల్లో చేసిన ప్రతిపాదనకు యాజమాన్యం అంగీకరించింది. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10 నుంచి తలపెట్టిన సమ్మె, యాజమాన్యం మొండి వైఖరితో స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన 2 లక్షల టన్నుల కోకింగ్ కోల్ స్తంభించిపోయిన విషయం తెలిసిందే. విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌లో కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం గంగవరం పోర్టు హెచ్‌ఆర్ డిపార్టుమెంట్ హెడ్ సిఎస్.రాజు, సిఇఒ అమిత్ మాలిక్, పోర్టు కార్మికులు, నిర్వాసిత నాయకులతో చర్చలు జరిపారు. ఈ చర్చల సందర్భంగా కలెక్టర్ చేసిన ప్రతిపాదనపై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో కూడా చర్చలు జరగనున్నాయి. ప్రాథమికంగా పోలీసు కమిషనరేట్‌లో జరిగిన చర్చల్లో గంగవరం పోర్టులో నిలిచిపోయిన స్టీల్‌ప్లాంట్ కోకింగ్ కోల్‌లో 40 శాతాన్ని వారం రోజుల్లో విడుదల చేసేందుకు అంగీకారం కుదిరింది. కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ సమ్మెకు ముందుగల సాధారణ స్థితిని పోర్టులో పునరుద్ధరించాలని కలెక్టర్‌ను కోరారు. ముగ్గురు నాయకులను మూడు రాష్ట్రాలకు బదిలీ చేశారని, ఐదుగురిని సస్పెండ్ చేశారని, 11 కేసులు ఈ సమ్మె కాలంలో నిర్వాసితులపై పెట్టారని, వాటిని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లోగా కార్మిక సమస్యలు పరిష్కారం కాకపోతే తానే ప్రవేశించి పరిస్థితిని చక్కదిద్దుతానని హామీ ఇచ్చారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు పోరాటం

ప్రజాశక్తి - అనకాపల్లి


సందీప్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న చలసాని శ్రీనివాస్

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు పోరాడాల్సిన అవసరముందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన తుమ్మి సందీప్ విగ్రహానికి అనకాపల్లి మెయిన్ రోడ్డులో ఆయన పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రం కోసం పార్టీలన్నీ ఒక్కతాటిపై నిలిచి విభజన హామీల సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల వద్ద తాకట్టు పెట్టవద్దని నాడు తుమ్మి సందీప్, మునుకోటి వంటి ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని, వారి స్ఫూర్తితో పోరాడాలని కోరారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రత్యేక హోదా ఎంతో అవసరమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నీతి, నిజాయితీ, నిబద్ధత ఉన్నవారిని ఎన్నుకోవాలని,అందరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు పులిరాజు శివరావు, కనిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.

రేపు 'ఉమ్మడి' మేనిఫెస్టో

- పవన్, పురందేశ్వరితో కలిసి ఆవిష్కరించనున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి, బిజెపి, జనసేన కూటమి తరపున ఉమ్మడిగా ఈ నెల 30న మంగళవారం మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. ప్రస్తుత ఎన్నికల కోసం 'సూపర్ సిక్స్' పేరుతో టిడిపి ఇప్పటికే మిని మేనిఫెస్టో విడుదల చేసిన సంగతి తెలిసిందే. అధికార వైసిపి గత శనివారం మేనిఫెస్టోను విడుదల చేసిన నేపథ్యంలో బిజెపి, జనసేనతో కలిసి ఉమ్మడి మేనిఫెస్టోను టిడిపి రూపొందించినట్లు తెలిసింది. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు.. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి 30న మేనిఫెస్టోను ఆవిష్కరించనున్నారు.

అసెంబ్లీ పరిధిలోనే అరకు ప్రచార అనుమతులు

- ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణాధికారికి సిపిఎం వినతిపత్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అరకు పార్లమెంటు ఎన్నికల ప్రచార అనుమతులు ఆయా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఇప్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణాధికారి రామ్‌మోహన్ మిశ్రాను ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె జయరాం విజయవాడలో ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. అరకు(ఎస్టి) లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి తమ పార్టీ అభ్యర్థిగా పాచిపెంట అప్పలనర్స పోటీ చేస్తున్నారని తెలిపారు. లోకల్ మండలాల పరిధిల్లో ప్రచార వాహనాలు(జీపులు) అనుమతి కోసం అరకువేలి రిటర్నింగ్ అధికారికి, పాడేరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి ప్రచార వాహనాల కోసం సువిధ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని వివరించారు. ఎంపి అభ్యర్థి ప్రచార అనుమతులు పార్వతీపురంలోనే తీసుకోవాలని అరకువేలి రిటర్నింగ్ అధికారి చెప్పారని పేర్కొన్నారు. అరకువేలి, పాడేరు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రచార వాహనాలు ఇతర అనుమతుల కోసం పార్వతీపురం వెళ్లి అనుమతి తీసుకోవాలంటే సాధ్యం కాని పరిస్థితి అని వివరించారు. గిరిజన ప్రాంతంలో అంతదూరం వెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడిన సమస్య అని తెలిపారు. కావున పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ అనుమతులు ఆయా అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారులు ఇచ్చేలా తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎన్నికల కమిషన్ దృష్టికెళ్లిన విషయాలపై అధికారులు సానుకూలంగా స్పందించారని వై వెంకటేశ్వరరావు, జయరాం మీడియాతో తెలిపారు.

ప్రజల ఆస్తుల తాకట్టుకు జగన్ ఎత్తుగడ : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలివ్వకుండా జెరాక్స్ ప్రతులను ఇచ్చేలా సబ్ రిజిస్ట్రార్‌లకు జగన్ ప్రభుత్వం ఆదేశాలివ్వటం జనం నెత్తిన జగన్ శఠగోపం పెట్టడమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. వివాదాలు సృష్టించి లబ్ధిపొందటం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, జనం ఆస్తులపై జగన్ పెత్తనంపట్ల ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులు, గనులు, మద్యం ఆదాయం, వివిధ కార్పొరేషన్‌ల వాటాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆఖరుకు రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టి అప్పులు తెచ్చిన జగన్ కన్ను.. ఇప్పుడు ప్రజల ఆస్తులపై పడిందని అన్నారు. ఎన్నికల కోడ్ అమలవుతున్నా, గుట్టుచప్పుడు కాకుండా సబ్ రిజిస్ట్రార్లకు అటువంటి ఆదేశాలివ్వటం వైసిపి నిరంకుశ, దుర్మార్గ పాలనకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

చంద్రబాబును అనర్హుడిగా ప్రకటించాలి

- వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్‌పై దాడులు చేయాలని, జగన్‌ను చంపితే ఎవరు అడ్డువస్తారని మాట్లాడిన చంద్రబాబును ఎన్నికలకు అనర్హుడిగా ప్రకటించాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రాకు ఆదివారం వినతిపత్రం అందించిన అనంతరం ఆయన తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్ జిల్లాల పర్యటనలకు అనుమతివ్వొద్దని కోరామని తెలిపారు. నిమ్మగడ్డ నేరుగా పచ్చచొక్కా వేసుకుంటే మంచిదని అన్నారు. వైసిపి మ్యానిఫెస్టోపై విషప్రచారం తగదని వైసిపి గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమం కోసం జగన్ విడుదల చేసిన మ్యానిఫెస్టోను మాయా మ్యానిఫెస్టో అని చంద్రబాబు విమర్శించడం తగదని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి జగన్ గొప్ప రాజనీతజ్ఞుడుగా నిరూపించుకున్నారని వైసిపి అధికార ప్రతినిధి బ్రహ్మానందరెడ్డి అన్నారు.

ఫారం-12, ఫారం12-డి మార్పిడి

- అడిషనల్ సిఇఒ ఎంఎన్ హరీంద్రప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోస్టల్ బ్యాలెట్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం తొలి విడతలో ఫారం-12 80,111, ఫారం-12-డి 10,123 మార్పిడి చేసుకున్నట్లు అడిషనల్ సిఇఒ ఎంఎన్ హరీంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న రెగ్యులర్ (ఫారం-12), అత్యవసర సేవల (ఫారం-12డి) ఉద్యోగులకు పనిచేసే జిల్లాలోనే పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో సచివాలయంలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో జిల్లాలకు చెందిన నోడల్ ఆఫీసర్లు సేకరించిన ఫారం-12, ఫారం-12డిలను ఆయా జిల్లాల పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు అందజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దరఖాస్తులకు అనుగుణంగా ఆయా జిల్లాల పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారుల ఖాళీ పోస్టల్ బ్యాలెట్‌లతో మే 3న తిరిగి సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి హాజరై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులకు అందజేయనున్నారు. ఈ విధంగా అందిన ఖాళీ పోస్టల్ బ్యాలెట్‌లను సంబంధిత ఉద్యోగులకు అందజేయాలని, ఉద్యోగులు ఓటు వేసిన అనంతరం ఆ పోస్టల్ బ్యాలెట్లను మే 10న తిరిగి సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం ద్వారా ఆయా జిల్లాలకు పంపనున్నట్లు అడిషనల్ సిఇఒ పేర్కొన్నారు. అత్యధికంగా విశాఖ జిల్లా నుంచి 5,625 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా 969 దరఖాస్తులు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వచ్చాయి. ఫారం-12డిలకు సంబంధించి అత్యధిక మొత్తంలో 999 దరఖాస్తులు పల్నాడు జిల్లా నుంచి రాగా, అత్యల్పంగా 25 దరఖాస్తులు శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ సిఇఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఒ మల్లిబాబుతోపాటు అన్ని జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఆహార భద్రతకు ఎఫ్ఎస్ఎస్ఎఐతో ఒప్పందం

- ఫుడ్ సేఫ్టీ కమిషనరు వెంకటేశ్వర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆహార భద్రతను పెంచే లక్ష్యంతో ఢిల్లీలోని భారత ఆహార భద్రత, నియంత్రణ శాఖ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని ఫుడ్ సేఫ్టీ కమిషనరు సలిజామల వెంకటేశ్వర్ వెల్లడించారు. ఇప్పటికే దీనికి సంబంధించి రూ.80 కోట్లు సమకూరాయని, ఈ నిధులతో రాష్ట్రంలో ఫుడ్ ల్యాబ్‌లు, మొబైల్ ఫుడ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఫుడ్ ల్యాబ్‌లు, వాటర్ ల్యాబ్‌లు, ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది పనితీరు ఆదివారం సమీక్ష నిర్వహించిన ఆయన.. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్, వాటర్‌కు సంబంధించి నమూనాలను పరీక్షించాలని సూచించారు. ఏదైనా ఆహార పదార్థాల్లో నిషేధిత ఫుడ్ కలర్స్, సింథటిక్ ఫుడ్ కలర్స్ లేదా ఒకసారి ఉపయోగించిన వంట నూనెలనే మళ్లీ ఉపయోగిస్తున్నారని తెలిస్తే.. కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహారభద్రత చట్టంను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

పథకాలు సరే.. భారాల సంగతి చెప్పండి

మొదటిపేజీ తరువాయి

స్థానాల్లో టిడిపి, వైసిపి, బిజెపిల నుంచి అత్యంత సంపన్నులు పోటీలో ఉన్నారని వారి జాబితాను విడుదల చేశారు. ఒక్కొక్కరి వద్ద రూ.50 కోట్లు నుండి రూ.6 వేల కోట్లు వరకు ఉన్నాయని వివరించారు. 175 నియోజకవర్గాలకు గాను 124 (71 శాతం) మంది నయా ధనికులు ఉన్నారని చెప్పారు. పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐ, రియల్ ఎస్టేట్, విద్యాసంస్థలు, ఆస్పత్రులు వంటి వ్యాపారాల్లో ఉన్నారని వివరించారు. ప్రజ్యాస్వామ్యాన్ని హైజాక్ చేసి రాజకీయాలను శాసించే స్థాయికి కార్పొరేట్లు వచ్చారని చెప్పారు. రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టి రూ.1000 కోట్లు సంపాదిస్తూ లాభసాటిగా రాజకీయాలను మార్చేశారని తెలిపారు. దీనివల్ల సామాన్యులకు ఎలాంటి మేలు జరుగుతుందని ప్రశ్నించారు. పోటీలో ఉన్న సంపన్నులు, శతకోటీశ్వరులు ఒక్కపైసా కూడా ఓటర్లకు పంచకుండా గెలిస్తే ప్రజల విశ్వాసం ఉన్నట్లే అని చెప్పారు. సిపిఎం అభ్యర్థులు 8 అసెంబ్లీ, 1 పార్లమెంటు సీటులో పోటీలో ఉన్నారని, వీరి ఆస్తుల మొత్తం రూ.5.90 కోట్లు మాత్రమే అని చెప్పారు. మరో 8 చోట్ల పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థుల ఆస్తులు మొత్తం రూ.9.84 కోట్లు మాత్రమేనని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ బడా కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిందంటే అక్కడ సామాన్యుల గొంతు ఉండదన్నారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, దళిత, ఆదివాసీ, మహిళలు గురించి మాట్లాడే వామపక్షాలు పదేళ్ల నుంచి అసెంబ్లీలో లేరని తెలిపారు. అసెంబ్లీ మొత్తాన్ని బూతులు ప్రాంగణంగా మారుస్తూ మహిళలను అవమానిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికితోడు ప్రస్తుతం రాయి రాజకీయం తోడైందన్నారు. ప్రజలకు కావాల్సినవి ఇవి కాదన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌ను ఎంటర్‌టైన్‌మెంట్‌లాగా మార్చారని పేర్కొన్నారు. ఈ స్వభావం మార్చాలంటే ప్రజల కోసం అంకితభావంతో పోరాడుతున్న వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

రాష్ట్ర హక్కులపై నోరు మెదపని జగన్, చంద్రబాబు

రాష్ట్రం హక్కులకు సంబంధించిన కీలకమైన సమస్యల గురించి జగన్, చంద్రబాబు నోరుమెదపడం లేదన్నారు. ప్రత్యేక హోదా పోరాడి సాధిస్తామని చెప్పకుండా జగన్ సాగదీస్తున్నారని విమర్శించారు. ఈ ఐదేళ్లలో ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఊకదంపుడు మాటలతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే ప్రణాళికలు ప్రజలను ముంచేస్తాయే తప్ప ఉద్ధరించేవి కాదన్నారు. అధికారంలోకి వస్తే హోదా ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేయగా, హోదా ఇవ్వబోమని బిజెపి చెప్పిందన్నారు. జగన్, చంద్రబాబు ప్రణాళికలను, వారి మాయ మాటలను తిరస్కరించి ఇండియా బ్లాక్‌లో ఉన్న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందన్నారు. విశాఖ ఉక్కుపై రాష్ట్రమంతా ఆందోళన జరుగుతున్నా దీనిని కాపాడతామనే మాట ఆ రెండు పార్టీలు చెప్పడం లేదన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు రెండు పార్టీలు కూడా ఆమోదం తెలుపుతూ అండగా ఉంటామని ఓట్లు అడుగుతూ కార్మికులను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి ప్రాజెక్టులపై వైసిపి తన మ్యానిఫెస్టోలో అసలు పొందుపరచలేదన్నారు. రానున్న ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తానని చెబుతున్న వైసిపి.. నిర్వాసితుల సంగతేంటని నిలదీశారు. పరిహారం ఇవ్వకుండా నిర్వాసితులను ఇద్దరూ గోదావరిలో ముంచేస్తారా అని ప్రశ్నించారు. దేవీపట్నం మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలను టిడిపి ప్రభుత్వం నీళ్లు వదిలేసి తరిమేస్తే, వైసిపి వరదల్లో ముంచేసిందన్నారు. రాజధాని వాసులను టిడిపి త్రిశంకు స్వర్గంలోకి తీసుకెళ్తే రాజధానే లేకుండా చేసిన ఘనత వైసిపిదని విమర్శించారు. రాజధానికి 33 వేల ఎకరాలు అవసరం లేదని, తక్షణమే 5-6 వేల ఎకరాల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని తాము గతంలో చెప్పామన్నారు. ఇది జరిగి ఉంటే రాజధాని మార్చే అవకాశం ఉండేది కాదన్నారు. రష్యా, చైనా, సింగపూర్, జర్మనీ నమూనాలు అంటూ ఐదేళ్ల పాటు తిరిగి చివరకు సినీ దర్శకుడు రాజమౌళితో ప్రజలకు టిడిపి త్రిడి సెట్టింగులు చూపించిందన్నారు. విశాఖపట్నం రాజధాని అంటున్న వైసిపి రిషికొండకు బోడిగుండు కొట్టి రూ.500 కోట్లతో గెస్ట్‌హౌస్ నిర్మించింది తప్ప విశాఖలో ఎలాంటి అభివృద్ధి సాధించలేదన్నారు. ఇద్దరు కలిసి రాజధాని వాసులను నాశనం చేసి రైతులను వీధిపాలు చేసి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తీసుకొచ్చారని చెప్పారు. ల్యాండ్ పూలింగ్‌తో రైతులను చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని తాము చెప్పామని తెలిపారు. ప్రస్తుతం రైతులు భూములు కోల్పోయారని, అక్కడ పంటలు లేవని, వారికి ప్లాట్లు రాలేదని అన్నారు.

ఇండియా వేదికే ప్రత్యామ్నాయం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. విశాఖ సభలో కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి సంతోష్, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.వెంకటవర్మరాజు, సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, సిపిఐ విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల పాల్గొన్నారు.

పాత హామీలే నెరవేర్చనప్పుడు కొత్త మేనిఫెస్టో ఎందుకు?

గత మేనిఫెస్టోనే జగన్ అమలు చేయలేకపోయారని, శనివారం మళ్లీ మ్యానిఫెస్టో విడుదల చేయడం ప్రజలను ఏమార్చడానికేనని షర్మిల విమర్శించారు. ఉక్కునగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి మేనిఫెస్టో విడుదల సమయంలో జగన్ ప్రత్యేక హోదా విషయంపై ఒక్క మాటా మాట్లాడలేదన్నారు. పోలవరం కోసం ఒక్క ఉద్యమం కూడా ఎందుకు చెయ్యలేదని ప్రశ్నించారు. ప్రతి సంక్రాంతికీ జాబ్ కేలండర్ అని ప్రకటించి, ఐదు సంక్రాంతులు వెళ్లినా జాబ్ కేలండర్ ప్రకటించకుండా నిరుద్యోగ యువతను మోసగించారన్నారు. వైసిపి కార్యకర్తలను వలంటీర్లుగా పెట్టి ఏదో గొప్ప పని చేశామన్నట్టు చెప్పుకుంటున్నారని విమర్శించారు.

కర్నూలులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న డి గౌస్‌దేశాయ్

కృష్ణాజిల్లా గన్నవరంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, మచిలీపట్నం కాంగ్రెస్ అభ్యర్థి గొల్లు కృష్ణ

అరాచక పాలనకు ఓటుతో బుద్ధిచెబుదాం

- సిపిఎం ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

సిపిఎం అభ్యర్థులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బిజెపి, వైసిపి, టిడిపి అరాచక పాలనను ప్రజలకు వివరించారు. తమను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని తెలిపారు. బిజెపి అరాచక పాలనకు మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేన, వైసిపిలకు ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

నెల్లూరు 11వ డివిజన్‌లో అభ్యర్థి మూలం రమేష్ చేపట్టిన ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి పాల్గొన్నారు. కులం, మతం, జాతి, ప్రాంతం, భాషతో నిమిత్తం లేకుండా ప్రజలందరికీ సమాన అవకాశాలు దక్కాలని మేధావులు రాజ్యాంగాన్ని రూపొందించారని, అలాంటి రాజ్యాంగానికి కేంద్రంలోని బిజెపి సర్కారు తూట్లు పొడుస్తోందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, కార్మిక, కర్షక ప్రయోజనాలు దెబ్బతినేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపిని, దానితో జతకట్టిన టిడిపి, జనసేన, నిరంకుశ వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న మూలం రమేష్‌ను గెలిపించాలని కోరారు.

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులో మంగళగిరి నియోజకవర్గం అభ్యర్థి జొన్నా శివశంకరరావు విస్తృతంగా ప్రచారం చేశారు. నియోజకవర్గంలో టిడిపి, వైసిపి తరుపున ధనవంతులు పోటీ చేస్తున్నారని, వారు గెలిచాక స్థానిక సమస్యలను పట్టించుకోరని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుండి స్థానిక ఎమ్మెల్యే హైలెవెల్ ఛానల్ సమస్యను పరిష్కరించలేక పోయారని గుర్తు చేశారు. తమను గెలిపిస్తే చిలువురు రైల్వే గేట్ వద్ద అండర్ గ్రౌండ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని, బస్సు సౌకర్యం పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో సిపిఎం రాష్ట్ర నాయకులు కె ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నెల్లూరు 11వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మూలం రమేష్, రమాదేవి

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న బాబూరావు

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ 58వ డివిజన్‌లోని అజిత్‌సింగ్ నగర్, వడ్డెర కాలనీ, పి అండ్ టి కాలనీ, ఇందిరానాయక్ నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ నియోజవర్గం అభ్యర్థి సిహెచ్.బాబూరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి, గతంలో అధికారంలో ఉన్న టిడిపి పార్టీల మేనిఫెస్టోలు, ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. మరోసారి ప్రజలను మోసగించడానికి కొత్త హామీలతో ఈ పార్టీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదో ఈ పార్టీలు ప్రజలకు సంజాయిషీ చెప్పాలని డిమాండ్ చేశారు.

కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని కొత్తపల్లి, కె.సీతారామపురం, నరసింహపాలెం, కొయ్యూరు, బొమ్మలూరు, మల్లవల్లి, బిళ్ళనపల్లిలో సిపిఎం గన్నవరం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మచిలీపట్నం ఎంపి అభ్యర్థి గొల్లు కృష్ణ ప్రచారం నిర్వహించారు.

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలోని జర్న, గొయిపాక పంచాయతీల్లోనూ, సీతంపేట మండలం పూతికవలస, డొంబంగివలస, సల్బంపాడు, నెల్లిగండి, ఈతమానుగూడ, సావిడివలస, గురండి, పుట్టిగాం గ్రామాల్లోనూ కురుపాం అభ్యర్థి మండంగి రమణ ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గిరిజన హక్కులను రక్షించుకునేందుకు ఎంపి, ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేస్తున్న అప్పలనర్సను, తనను ఆదరించాలని కోరారు.

కర్నూలు నగరంలోని నందూరి ప్రసాదరావునగర్, పూలే అంబేద్కర్ నగర్, సమత నగర్, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి నగర్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో పాణ్యం అభ్యర్థి డి గౌస్ దేశాయ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత 15 ఏళ్లుగా పేదలు నివసించే కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయని తెలిపారు. పూలే అంబేద్కర్ కాలనీలో రోడ్లు, విద్యుత్ దీపాలు, మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదన్నారు. పేదలు మురుగు కూపాల మధ్య జీవనం సాగించాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించిందన్నారు. తనను గెలిపిస్తే పేదలందరికీ సొంత ఇంటిని నిర్మిస్తానని, మౌలిక సదుపాయాలతో కాలనీలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు ప్రచారం చేశారు. రంపచోడవరంలో అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావుల విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజా నాట్య మండలి కళాకారులు రంపచోడవరం అంబేద్కర్ సెంటర్, ఆర్‌టిసి కాంప్లెక్స్ సెంటర్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సెంటర్, బొర్నగూడెం గ్రామాల్లో నృత్యాలు, పాటలతో చేపట్టిన ప్రచారం ఆకట్టుకుంది. అరకులోయ మండలం సుంకరమెట్టలో అప్పలనర్స గెలుపు కోరుతూ జరిగిన ప్రచార కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పాల్గొన్నారు. పాడేరు మండలంలోని వంట్లమామిడి, గుర్రగరువు, ఓనూరు, నందిగరువు, డల్లాపల్లి, తప్పిపుట్టు, సంగోడి గ్రామాల్లో అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స ప్రచారం నిర్వహించారు. విశాఖ తోకాడలోని సమైక్య అపార్ట్‌మెంట్‌లో గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించాలని కోరుతూ వార్వా, నివాస్ సంఘాల ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

- కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం

విజయనగరం జిల్లా కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి, అరకు పార్లమెంటు నియోజకవర్గానికి సిపిఎం తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ కోరారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణతో కిషోర్‌చంద్ర దేవ్ ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎం గెలుపుకు అన్ని విధాలా మద్దతిస్తానని తెలిపారు. దేశంలో లౌకిక ప్రత్యామ్నాయాన్ని నిలబెట్టిన వామపక్షాలకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నానన్నారు. అరకు పార్లమెంట్, కురుపాం, అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిపిఎం అభ్యర్థులు పాచిపెంట అప్పల నర్స, మండంగి రమణలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తమ మద్దతుదార్లకు విజ్ఞప్తి చేశారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్ భారతి

జగన్ చెప్పిందే చేస్తాడు...

- పులివెందుల్లో ఇంటింటి ప్రచారంలో వైఎస్ భారతి

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చేస్తాడని, టిడిపి అధినేత చంద్రబాబు చెప్పి మోసం చేస్తాడని సిఎం జగన్ భార్య వైఎస్ భారతి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు మండలం ఇనగలూరులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డిని, అవినాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గతంలోనూ చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన హామీలన్నీ మోసపూరితమైనవని విమర్శించారు. జగన్ పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని, మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపిని గెలిపించాల కోరారు. కార్యక్రమంలో వైఎస్ అవినాష్‌రెడ్డి భార్య సమత, అభిషేక్‌రెడ్డి భార్య కృష్ణచైతన్య పాల్గొన్నారు.

న్యాయం కోసం పోరాటం

- వైఎస్.షర్మిల భర్త అనీల్‌కుమార్

ప్రజాశక్తి-కడప

న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని వైఎస్ షర్మిల భర్త బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. కడప రాజారెడ్డివీధి చర్చిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవుడిపై విశ్వాసం ఉంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

చంద్రబాబువి బాధ్యతా రాహిత్య హామీలు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి మ్యానిఫెస్టో ప్రజలకు ఏం చేస్తామో అదే చెప్పామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. చంద్రబాబువి అన్నీ బాధ్యతా రాహిత్య హామీలని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ సిఎం జగన్‌పై దాడికి ఉసిగొల్పుతున్నారని అన్నారు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోను అధికారంలోకి రాగానే వెబ్‌సైట్ నుంచి తొలగించి ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా చంద్రబాబు అబద్ధపు హామీలు ఇస్తున్నారని అన్నారు.

కౌలు రైతులకు న్యాయం చేయాలి

- ఎపి కౌలురైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులకు న్యాయం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతు భరోసా పొందడానికి భూ యజమానులకు లేని నిబంధనలను కౌలు రైతేలకు విధించారని, రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులుండగా.. కేవలం లక్ష మందికే రైతు భరోసా అందించారని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కౌలు రైతులకు భరోసా అందేలా చట్టంలో సవరణలు చేసి, గ్రామ సభల ద్వారా పంట సాగుహక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులను ఆదుకోవటానికి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కౌలు రైతులకు న్యాయం జరిగేలా వారందరికీ కార్డులు, రైతుభరోసా, పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. సచివాలయ పరధిలో అధికారుల ద్వారా గ్రామ సభలు నిర్వహించి కార్డులు అందించాలన్నారు.

వడదెబ్బకు మహిళ మృతి

ప్రజాశక్తి - నందిగామ

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురం గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి కటారపు విఠల్‌రావు సతీమణి కళావతి (48) వడదెబ్బతో ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కళావతి గత రెండు నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వారం రోజులుగా కాస్తున్న ఎండలకు తట్టుకోలేక మృతి చెందారు. మతురాలికి భర్త విఠల్‌రావు, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కళావతి మృతదేహాన్ని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, రాఘవాపురం సర్పంచ్ పెసరమల్లి సురేష్, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

అందరికీ ఆరోగ్య భద్రత

- ఐఎంఎ హాలు ప్రారంభంలో
- జాతీయ అధ్యక్షులు అశోకన్
- ఆరోగ్య ప్రణాళిక ప్రమాణ పత్రం విడుదల

ప్రజాశక్తి-విజయనగరం కోట

అందరికీ వైద్యంతోనే ఆరోగ్య భద్రత సాధ్యమవుతుందని ఐఎంఎ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్‌వి అశోకన్ అన్నారు. విజయనగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం సమీపంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ ఆశా సుబ్బారావు ఐఎంఎ హాలును ఆదివారం ఆయన ప్రారంభించారు. ముందుగా ఐఎంఎ రూపొందించిన ఆరోగ్య ప్రణాళిక పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం అశోకన్ మాట్లాడుతూ.. ఐఎంఎ పోరాటం తరువాత రాజస్థాన్‌లో ఆరోగ్య భద్రత హక్కు సాధ్యమవుతుందని నమ్ముతున్నామని అన్నారు. సరైన వైద్యంతో పాటు రక్షిత తాగునీరు, పరిసరాల పరిశుభ్రత అవసరమని తెలిపారు. ప్రజలందరికీ ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యానికి తగిన కనీస వైద్య ప్యాకేజీకి సాధికారత కల్పించాలని కోరారు. సార్వజనీన ఆరోగ్య రక్షణకు ప్రాథమికంగా ప్రభుత్వ రంగం ద్వారా హామీ ఇస్తూ ప్రయివేటు రంగం నుండి వ్యూహాత్మకంగా వైద్య సేవలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. సొంత చెల్లింపులతో చేసుకొనే ఆరోగ్య బీమా వల్ల అరకొర సేవలు మాత్రమే లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వ రెవెన్యూ ఆదాయం ఆరోగ్య నిధులకు మూలంగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆరోగ్యానికి సగటున జిడిపిలో 1.1 శాతం నుండి 1.6 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నాయన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత తక్కువని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యానికి విడివిడిగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేకంగా వైద్య ఆరోగ్యాలకు 2.5శాతం నిధులు తక్షణం కేటాయించాలని డిమాండ్ చేశారు. దీన్ని క్రమంగా 5.5 శాతానికి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సామాన్యుడు వైద్యానికి 63 శాతం ఖర్చు చేస్తున్నారని, దీనివల్ల సరాసరి 5.5 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువకు చేరుతున్నారని అన్నారు. మందులపై 18 శాతం జిఎస్‌టిని తక్షణం తొలగించి ప్రజలకు ఆర్థిక వెసులుబాటును కల్పించాలని కోరారు. డాక్టర్లపై దాడులకు రక్షణగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 11/2008 చట్టాన్ని తీసుకొచ్చారని, దానికి అనుగుణంగానే కేంద్రంలో కూడా ఇటువంటి చట్టాలు తీసుకొస్తే డాక్టర్లపై దాడులను నియంత్రించవచ్చని అన్నారు. ప్రయివేట్ ఆస్పత్రుల నియంత్రణకు అక్రిడిటేషన్ విధానం మంచిదన్నారు. కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఫణిందర్, రాష్ట్ర ఐఎంఎ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవీంద్రనాథ్, రాష్ట్ర ఐఎంఎ మాజీ అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ, 2025- 26 సంవత్సరానికి ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.నందకిశోర్, ఐఎం ఛారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ విఎస్ ప్రసాద్, ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి గోపాల్‌రావు, ఛారిటబుల్ ట్రస్ట్ ఐఎఎ సెక్రెటరీ డాక్టర్ వి. మృత్యుంజయరావు, డాక్టర్ కె.త్రినాథరావు, ఐఎంఎ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపిలోకి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల మాజీ ఎమ్మెల్యే, వైసిపి నేత చీరాల గోవర్ధన్‌రెడ్డి ఆదివారం టిడిపిలో చేరారు. టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో తాడేపల్లిలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గోవర్ధన్‌రెడ్డి ఈ మధ్యకాలంలో బాపట్ల శాసనసభ్యులు రఘుపతిని వ్యతిరేకిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే.

విశాఖ పోర్టుకు క్రూయిజ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ టెర్మినల్‌కు మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ క్రూయిజ్ నౌక వచ్చింది. లక్సరీ విభాగానికి చెందిన 'ది వరల్డ్' క్రూయిజ్ నౌక ఆదివారం విశాఖ తూర్పు తీరానికి విచ్చేసింది. తూర్పు తీరంలో అంతర్జాతీయ క్రూయిజ్ నౌకలకు విశాఖపట్నం క్రూయిజ్ టెర్మినల్‌ను గమ్యస్థానంగా మార్చుతామనే తమ విధానానికి ఇది నిదర్శనమని పోర్టు అధికారులు వెల్లడించారు. విశాఖలోని టెర్మినల్‌ను రూ.96 కోట్లతో క్రూయిజ్ షిప్పుల రాకపోకలకు అనువుగా నిర్మించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అద్భుతమైన అతిథ్యానికి మారుపేరైన 'ది వరల్డ్' నౌకలో ప్రపంచ నలుమూలల నుంచీ పర్యాటకులు విశాఖకు వచ్చారు. వీరంతా విశాఖ చుట్టుపక్కల ఉన్న ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలను, ప్రకృతి రమణీయతను చూసేందుకు ఉత్సాహం చూపారు. పర్యాటకులకు క్రూయిజ్ టెర్మినల్‌లో సాదర స్వాగతం పలికినట్టు విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు వెల్లడించారు.

పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం

- గ్రామాల్లో డంప్‌లు
- ఎన్నికల నేపథ్యంలో భారీగా పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. పోటీలో నిలిచే అభ్యర్థులు వేలకు వేలు మద్యం కేసులను గ్రామాల్లో పెద్దయెత్తున డంప్ చేస్తున్నారు. రాష్ట్రంలోని మద్యం షాపుల నుంచే కాకుండా అదనంగా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా మద్యాన్ని అక్రమంగా తరలించి నిల్వలు చేస్తున్నారు. అబ్కారీశాఖ నేతృత్వంలో నడిచే షాపుల్లో అమ్మకాలు సాగించే సరుకు సరిపోక ఆయా రాజకీయ పార్టీలు ఇరుగు, పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని యథేచ్ఛగా రాష్ట్రానికి తరలిస్తున్నట్లు ఇటీవల ఎస్ఇబి, పోలీసులు, ప్రత్యేక టీమ్‌లు జరిపిన దాడుల్లో వెలుగులోకి వచ్చింది. పిఠాపురంలో శుక్రవారం సెబ్, పోలీస్ అధికారులు దాడి చేసి సుమారు రూ.80 లక్షలు విలువ చేసే మద్యం నిల్వలను పట్టుకున్నారు. అలాగే తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.20.82 కోట్ల విలువైన 6,62,402.65 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అభ్యర్థులు డంప్ చేసుకున్న నిల్వల్లో, పట్టుబడిన మద్యంలో కొంత శాతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న మద్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత చేసిన దాడుల్లో సర్వేపల్లి, పిఠాపురం నియోజకవర్గాల్లో మద్యం భారీ డంప్‌లను ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గన్నవరం మండలంలోని మెట్లపల్లిలోని మామిడి తోటల్లో నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లు (మద్యం), జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాలకు తెలంగాణ నుంచి మద్యం దిగుమతి అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో పక్కనే ఉన్న తమిళనాడు, గోవా నుంచి కూడా మద్యం రాష్ట్రానికి పెద్దయెత్తున దిగుమతి అవుతున్నట్లు సమాచారం. సెబ్, పోలీసులు సంయుక్తంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తున్నప్పటికీ వారి కళ్లు గప్పి పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం పెద్దయెత్తున దిగుమతి చేసుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

రాష్ట్రంలోనూ పెరిగిన మద్యం అమ్మకాలు

రాష్ట్రంలో మద్యం అమ్మకాలు కూడా భారీగా పెరిగా యి. గతేడాది మార్చి కంటే ఈ ఏడాది మార్చిలో అమ్మకాలు పెరిగాయి. ఎన్నికల సీజన్ కావడంతో అధికారికంగా ఒక్క నెలలోనే దాదాపు 10 శాతం అమ్మకాలు పెరిగాయి.

కేటగిరి	మార్చి 2023	మార్చి 2024	పెరుగుదల శాతం
ఐఎమ్ఎఫ్ఎల్ (లిక్కర్) కేసుల్లో	27,63,924	29,13,463	5.41
బీరు (కేసుల్లో)	9,78,331	10,54,886	7.83
మొత్తం విలువ	**రూ.2,357.71 కోట్లు**	**రూ. 2590.31 కోట్లు**	**9.87**

మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

MOTILAL OSWAL HOME LOANS

సిఐఎన్ నెంబర్ : U65923MH2013PLC248741

కార్పొరేట్ ఆఫీసు: మోతిలాల్ ఓస్వాల్ టవర్, రహీమ్‌తుల్లా సయాని రోడ్డు, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. ఇ మెయిల్: hfquery@motilaloswal.com

బ్రాంచ్ ఆఫీసు: అరుండేల్‌పేట, 15/3, 1వ అంతస్తు, ఆధార్‌కార్డ్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్ పైన, గుంటూరు-522002, ఆంధ్రప్రదేశ్.
సంప్రదించు నెం: బొప్పూరి నాగరాజు-7304997399 & పివిఆర్ సుబ్రమణ్యం-9372705039.

ఇ-వేలం కమ్ విక్రయం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 మరియు 9 నియమాలతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తు(ల) అమ్మకం కొరకు 15 రోజుల ఇ-వేలం విక్రయ నోటీసు.
సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తులు ఏవైతే, మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది) యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి **మోతీలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** (గతంలో అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)/ సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బకాయిని రియలైజేషన్ తేదీ వరకు ఇందు దిగువ పేర్కొన్న బకాయిలు మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర వ్యయాలను రికవరీచేయుట కొరకు, ఇందు దిగువ పేర్కొన్న తేదీ మరియు సమయంన **"ఎక్కడ ఉందో అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏమైనా ఉంటేఅలాగే"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. రిజర్వు ధర, ధరావత్తు (ఇఎండి) మరియు ధరావత్తు డిపాజిట్‌చేయుటకు చివరి తేది ఇందు దిగువ కూడా పేర్కొనబడినవి:

రుణగ్రహీత(లు)/ హామీదారు(లు)/ రుణ ఖాతా	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్థిరాస్తి యొక్క వివరణ	రిజర్వు ధర, ఇఎమ్‌డి మరియు ఇఎమ్‌డి సమర్పణకు చివరి తేది	ఇ-వేలం తేది మరియు సమయం
LAN: LXGUN00118-190072828 బ్రాంచ్ : గుంటూరు రుణగ్రహీత: గంగన్న గుంట రేణుక సహ-రుణగ్రహీత: ప్రవీణ్ కుమార్ గోపు హామీదారు:	20-04-2021/ రూ.21,29,489/- (రూపాయలు ఇరవైఒక లక్షల ఇరవైతొమ్మిది వేల నాలుగువందల ఎనభై తొమ్మిది మాత్రమే)	ఫ్లాట్ నెం 402, 3వ అంతస్తు, తిరుమల హెూమ్స్, డి.నెం.21-5-45/9, సర్వే నెం.51/బి 75, 76/డి, అసెస్‌మెంట్ నెం.10240 15361, నరసరావు పేట్, లివింగ్ గాడ్ చర్చి దగ్గర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522601	రిజర్వు ధర: రూ.16,50,000/- (పదహారు లక్షల యాభైవేలు మాత్రమే) ఇఎమ్‌డి : రూ.1,65,000/- (రూపాయలు ఒకలక్షల అరవైఐదు వేలు మాత్రమే) ఇఎమ్‌డి డిపాజిట్ చివరి తేది: 19-05-2024	20-05-2024, సమయం: ఉ.11.00 గం.ల నుండి 11.30 గం.ల వరకు (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపులతో)

ఇ-వేలం షరతులు మరియు నియమాలు :
1. వేలం బిడ్ పత్రం యొక్క తదుపరి నియమాలు మరియు షరతుల ప్రకారం మరియు దానిలో ప్రవేశపెట్టిన విధానం ప్రకారం నిర్వహించబడుతుంది. బిడ్డరుదారులు బిడ్ పత్రాలు, ఇ-వేలంలో పెట్టబడు సెక్యూర్డ్ అసెట్ వివరాలు మరియు బిడ్‌ఫారం ఏదైతే ఆన్‌లైన్ దాఖలుచేయబడునో దాని కొరకు బిడ్డరుదారులు వెబ్‌పోర్టల్: https://BestAuctionDeal.com ను సందర్శించగలరు. ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్, **మెసర్స్ గ్లోబ్‌టెక్ ఇన్ఫోసిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్** ద్వారా వెళ్లవచ్చు. ఆసక్తిగల కొనుగోలుదారులు అదే పోర్టల్‌లో వేలం నిబంధనలు మరియు షరతులు మరియు ప్రక్రియ ద్వారా వెళ్లవచ్చు మరియు **బొప్పూరి నాగరాజు-7304997399 & పివిఆర్ సుబ్రమణ్యం-9372705039** సంప్రదించవచ్చు. పైన పేర్కొన్న వివరాలు వెబ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి మరియు వారి సెంట్రలైజ్డ్ హెల్ప్‌లైన్ డెస్క్: **+91 98100 89933, +91 1244470855, ఇ-మెయిల్ ఐడి : Care@BestAuctionDeal.com** వారిని సంప్రదించండి.

ప్రదేశం: గుంటూరు
తేది: 29-04-2024

సం/-
అధీకృత అధికారి,
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)

*అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.

Registered Office:- DCB Bank Ltd., 6th Floor, Tower A, Peninsula Business Park, Senapati Bapat Marg, Lower Parel, Mumbai – 400013
Retail Asset Collection Department: - DCB Bank Ltd, 8-2-120/84, 2nd Floor, Jyothi Majestic, Banjara Hills, Hyderabad-Telangana – 500 034

DCB BANK

SARFAESI చట్టం 2002 క్రింద ఇ-వేలం అమ్మకం నోటీసు
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద స్థిరాస్తి యొక్క అమ్మకం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) ను ప్రతిపాదిస్తూ డిసిబి బ్యాంక్ చార్జ్‌చేసిన స్థిరాస్తుల విక్రయం కొరకు బహిరంగ ఇ-వేలం నోటీసు సాధారణ ప్రజలకు మరియు రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు ప్రత్యేకంగా హామీదారులకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న ఆస్తి డిసిబి బ్యాంక్ లిమిటెడ్, తాకట్టుపెట్టబడినది, బ్యాంక్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధన క్రింద లాంచనప్రాయంగా స్వాధీనపరుచుకున్నారు. దిగువపేర్కొన్న బకాయిలు మరియు తదుపరి వడ్డీ, చార్జీలు మరియు వ్యయాలు ఇతరత్రములు తిరిగిరాబట్టుకొనుటకు ఆస్థి "ఏది ఎక్కడ ఉందో" మరియు "ఆ పద్దతి ప్రకారం" "ఏది ఎక్కడ ఉందో ఆ విధంగా" దిగువ పేర్కొన్న ఇ- వేలం ద్వారా ఆస్తి అమ్మబడును.

క్ర. సం.	సెక్యూర్డ్ డెబ్ట్ వివరాలు	రిజర్వు దర (రూ.)	ఇ వేలం తేది మరియు సమయం	బయానా (రూ.)	తనిఖీ తేది మరియు సమయం	స్వాధీనతా విధానం
1.	Rs.27,90,973.95/- (As of 15.06.2023)	Rs. 28,20,000/-	From 11:30 am on 31.05.2024	Rs. 2,82,000/-	23.05.2024 (11 am to 4 pm)	భౌతికం

రుణగ్రహీత పేరు మరియు వివరాలు : 1. అప్పారావు పిల్ల (రుణగ్రహీత), 2. పిల్ల రామలక్ష్మి (సహ రుణగ్రహత) 3. పిల్ల అప్పలస్వామి (సహ రుణగ్రహీత), 4. పిల్ల సన్యాయమ్మ (సహ రుణగ్రహీత)
స్థిరాస్తి వివరాలు: కృష్ణాజిల్లా, ఎస్.ఆర్.ఓ. విజయవాడ పరిధిలోని కొత్తపేట, పోతినవారి వీధి, రామాలయం వీధి లోపల ఉన్న మొత్తం ఆ ఆర్.సి.సి. రూఫ్డ్ భవనం నిర్మాణ విస్తీర్ణం 71.0 చ.గ.లు. మరియు పాసేజ్ కొరకు 4.1 చ.గ.లు. మరియు మొత్తం విస్తీర్ణం 75.1 చ.గ.లు. 2 అంశములతో కలిగి ఉన్న మున్సిపల్ వార్డు నం.3, ప్రస్తుత వార్డు నం.38, రెవెన్యూ వార్డు నం.1, బ్లాక్ నం.11, ఎన్.టి.ఎస్.నం.662, పాత మూల్యాంకనం నం.1721, తదుపరి మూల్యాంకనం నం.1721, కొత్త మూల్యాంకనం నం.21537, పాత డో.నం.2/33, కొత్త డో.నం.9-11-3 మరియు ఉన్న హద్దులు : షెడ్యూల్ : అంశం నం.1 : 71.0 చ.గ.లు. కొరకు భవనం : తూర్పు : మున్సిపల్ రోడ్డు, దక్షిణం : తమ్మిన అచ్చుమ్మ మరియు ఇతరుల మున్సిపల్ రోడ్డు ఆస్తులు, పడమర : తమ్మిన ఎన్.వి.డి హైమవతి ఆస్తి, ఉత్తరం : 2వ అంశంకు చెందిన పాసేజ్. అంశం నం.2 : 1వ అంశం పాసేజ్ కొరకు 1/2 అవిభక్త వాటా విస్తీర్ణం 4.1 చ.గ.లు. బయట 8.2 చ.గ.లు. : తూర్పు : మున్సిపల్ రోడ్డు, దక్షిణం : అంశం నం.1, పడమర : తమ్మిన ఎన్.వి.డి.హైమవతి ఆస్తి, ఉత్తరం : పోతిన గోపాలరావు ఆస్తి.

బయానా దాఖలుకు తేది మరియు సమయం 29 మే, 2024న సా 6 గం.లకు ముందుగా లెటర్ తోపాటుగా కెవైసి పాన్ కార్డు యొక్క, బయానా యొక్క ప్రూఫ్, ఇ మెయిల్ ఐడి : karun.marisetty@dcbbank.com మరియు పి. మురళీకృష్ణ -8008123434
ఆశక్తి ఉన్న కొనుగోలుదారు/బిడ్డరు అవసరం మేరకు డిడి/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజియస్ ద్వారా వారి పేరుతోటి, డిసిబి బ్యాంక్ లిమిటెడ్ పేరుతో బయానాను డిపాజిట్ చేయగలరు. అకౌంట్ పేరు: DCB BANK LOAN REPAYMENT, అకౌంట్ నెం:90020900000170., ఐఎఫ్ఎస్‌సి కోడ్ : DCBL0000037, లోవర్‌పారెల్.
ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిభందనలు క్రింద వివరించబడినాయి

1. ఇ-వేలం అనేది "ఆన్ లైన్" లో "ఏది ఎక్కడ ఉన్నదో" "అది అక్కడ అలాగే" జరుపబడును. వేలం అనేది బ్యాంక్ వారు ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ ద్వారా మెసెర్స్.4 క్లోసర్ ఇండియా (కాంటాక్టు నెం ..... వద్ద వెబ్ పోర్టల్ https://www.bankauctions.in ద్వారా జరుపబడును. ఇ-వేలం టెండర్ డాక్యుమెంటులో ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లేరేషన్, సాధారణ నియమాలు మరియు నిబంధనలు కలిగి వేలం మరియు అమ్మకం వెబ్‌సైట్ https://www.bankauctions.in ద్వారా అందుబాటులో ఉంటాయి.
2. అధీకృత అధికారి యొక్క వివరణ మేరకు, ఆస్తులకు సంబందించి ఎటువంటి గొడవలు లేవు. ఏదైతే ఆసక్తి ఉన్న బిడ్డరు వారు సొంత పరిధిని ఉపయోగించి ఆస్తికి సంబందించిన ఎలాంటి గొడవలు ఉన్నాయో బిడ్ దాఖలుకు ముందుగానే ఆస్తులకు సంబందించిన వేలం మరియు గొడవలు/హక్కులు/బకాయిలు/ ఆస్తి ని పాడుచేసే విభాగాలును మీరు తెలుసుకొనగలరు, ఇ-వేలం యొక్క ప్రకటన తెలియపరచలేదు మరియు ఎటువంటి కమిట్‌మెంట్‌కు ఆధారపడలేదు మరియు బ్యాంకు వారు తరుపు నుంచి కూడా. ఆస్తికి సంబందించి అన్ని ఉన్న మరియు లేని భవిష్యత్‌కు సంబందించిన గొడవలు బ్యాంకు వారికి తెలిసినవి మరియు తెలియనివి అమ్మబడును. అధీకృత అదికారికి మరియు / సెక్యూర్డ్ క్రెడిటార్‌కు మూడవ వ్యక్తి ద్వారా వచ్చిన గొడవలు/హక్కులు/బకాయిలకు ఎటువంటి సంబందం లేదు.
3. బిడ్ గనుక సత్ఫలితం ఇవ్వకపోతే ఎటువంటి వడ్డీ లేకుండానే బయానా తిరిగి ఇవ్వబడుతుంది. దిగువ సంతకాదారుడుకు అన్ని ఆఫర్లను ఆమోదించే మరియు తిరస్కరించే హక్కు కలిగి ఉంటుంది మరియు వేలం యొక్క అమ్మకం ఎటువంటి కారణం తెలుపకుండానే పోస్ట్ పోన్ చేయవలసి ఉంటుంది. ఆఫర్ కనుక ఆమోదించబడితే కొనుగోలుదారు 25 శాతం (బయానా కాకుండా) ను అమ్మకం ధరను వేలం రోజునే డిపాసిట్ చేయాలి మరియు లేదా కొనుగోలుదారు డిపాజిట్ చేయని యెడల బయానాను బహిష్కరించవలసి ఉంటది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. కొనుగోలు ధర యొక్క మిగతా ధర అమ్మకం అనేది పూర్తయిన 15 రోజుల తర్వాత కట్టవలసి ఉంటుంది మరియు ఉన్న సమయములో మీరు కట్టకపోతే బయానాను బహిష్కరించవలసి ఉంటుంది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. ఇతర స్టాట్యూటరీ బకాయిలు/పన్నులు/స్టాంప్ డ్యూటీ/ రిజిస్ట్రేషన్ ఫీజు/ ఇతర బదిలీ ఫీజులు కొనుగోలుదారు కట్టవలసి ఉంటుంది.
4. అమ్మకం అనేది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 కు యొక్క నియమాలు మరియు నిభందనలకు లోబడి ఉంటుంది

తేది: 29.04.2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

ఆప్ ప్రచార గీతంపై ఇసి అభ్యంతరం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఆప్ వాడుతున్న సాంగ్‌లోని నినాదం పట్ల ఎన్నికల కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పాటలో మార్పులు చేయాలని ఆప్‌ని ఆదేశించింది. పాటలో మార్పులు చేసిన తర్వాత మళ్లీ తమ ఆమోదం తీసుకోవాలని కోరింది. ఎన్నికల ప్రచార ప్రకటనలో 'జైల్ కె జవాబ్ మే హమ్ ఓట్ సే దేంగె' అన్న నినాదం వచ్చినప్పుడు.. కేజ్రీవాల్ జైల్లో ఉన్న చిత్రాన్ని ప్రదర్శిస్తున్న సమూహం అంతా కలిసి న్యాయవ్యవస్థను దూషించినట్లుగా ఉందని,ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని ఇసి పేర్కొంది. కాగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల వెనుక బిజెపి కుట్ర ఉందని ఆప్ విమర్శించింది. ఒక ప్రచార గీతంపై నిషేధం విధించడం బహుశా ఎన్నికల చరిత్రలో ఇదే మొదటిసారని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిషి అన్నారు. సిబిఐ, ఈడీలపై నిందలు వేస్తే ఎన్నికల కమిషన్ తమ ప్రచార పాటపై నిషేధం విధించడమేంటని ఆమె ప్రశ్నించారు. ఈడీ, సిబిఐలు తమని అక్రమ అరెస్టులు చేస్తున్నప్పుడు ఎన్నికల కమిషన్ ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు.

అమేథీ నుంచి స్మృతి ఇరానీ మళ్లీ పోటి

లక్నో : కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఉత్తరప్రదేశ్ అమేథీ లోక్‌సభ స్థానానికి ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసేముందు ఆమె ఆయోధ్యలోని రామ్‌లల్లాను దర్శించుకున్నారు. ఆ తర్వాత నియోజకవర్గానికి వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అమేథీలో మే 20వ తేదీన ఐదో దశలో ఓటింగ్ జరగనుంది. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం నాడు (ఏప్రిల్ 26) ప్రారంభమైంది. మే 3 నామినేషన్‌లకు చివరి తేది. ఇదిలా ఉండగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఇప్పటివరకు అమేథీలో పోటీ చేసేందుకు అభ్యర్థిని ప్రకటించలేదు. అమేథీ నియోజకవర్గం కాంగ్రెస్‌కి కంచుకోటగా ఉండేది. కానీ 2019లో అమేథీ స్థానంలో పోటీ చేసిన రాహుల్ గాంధీని స్మృతి ఇరానీ ఓడించారు. ఈ ఎన్నికల్లో ఇక్కడ గెలవాలని గట్టిగా ప్రయత్నిస్తోంది. మళ్లీ ఇక్కడి నుంచి రాహుల్‌నే బరిలో నిలిపేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ రాయబరేలి స్థానానికి కూడా ఇప్పటివరకూ అభ్యర్థిని ప్రకటించలేదు.

- ఆప్, కాంగ్రెస్ మధ్య సీట్ల అవగాహన
- గతానికి భిన్నంగా ఢిల్లీలో ద్విముఖ పోటీ
- బెడిసికొట్టిన బిజెపి కక్ష సాధింపు చర్యలు
- 2019 ఎన్నికల్లో వచ్చినన్ని సీట్లు అసాధ్యం



హస్తిన పోరు హాట్‌హాట్

కేజ్రీవాల్ అరెస్టుతో వేడెక్కిన రాజకీయాలు

ప్రజాశక్తి- న్యూఢిల్లీ ప్రతినిధి

దేశ రాజధాని ఢిల్లీ జాతీయ రాజకీయాలకు కేంద్ర బిందువు. జాతీయ పార్టీలతోపాటు స్థానిక ప్రాంతీయ పార్టీలు సైతం ఇక్కడ పట్టు సాధించాయి. అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం ఢిల్లీలో ఏడు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ ఆరో విడత మే 25న ఎన్నికలు జరగనున్నాయి. మద్యం కుంభకోణం ఆరోపణలపై ఆప్ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఇ.డి. అరెస్ట్ చేసి జైలులో పెట్టింది. మోడీ సర్కారు రాజకీయ కక్షతో కేజ్రీవాల్‌ను సరిగా లోక్‌సభ ఎన్నికల ముందు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయించిందని ఆప్‌తో పాటు ఇండియా బ్లాక్ పార్టీలు నిరసన తెలుపుతున్నాయి. కేజ్రీవాల్, జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ అక్రమ అరెస్టులకు నిరసనగా ఇటీవల ఇండియా బ్లాక్ పార్టీలు ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. మరోవైపు ఆప్ ఆందోళనలకు దిగింది. ఈ పరిణామాలతో మే 25న ఎన్నికలున్నప్పటికీ ముందుగానే ఢిల్లీలో రాజకీయ వేడి రాజుకుంది. కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ ఆప్ అభ్యర్థుల గెలుపు కోసం శనివారం ఢిల్లీలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈస్ట్ ఢిల్లీలోని కళ్యాణ్‌పురిలో రోడ్‌షో నిర్వహించడంతో ఒక్కసారిగా హస్తినలో ఎన్నికల కాక రెట్టింపైంది. కాగా ఇక్కడ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రజాక్షేత్రంలో లేకుండా ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టిన తరువాత రాజకీయాలు మలుపు తీసుకున్నాయి. బిజెపికి ఎదురుగాలి వీస్తోంది. ఇండియా ఫోరంలో భాగంగా కాంగ్రెస్, ఆప్ కలిసి ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. బిజెపి ఒంటరిగా పోటీ చేస్తోంది. ఇక్కడ ద్విముఖ పోరు నెలకొంది. గత రెండు ఎన్నికల్లో ఏడుకు ఏడు స్థానాలను గెలిచిన బిజెపి, మూడోసారి కూడా క్లీన్ స్వీప్ చేయడానికి బిజెపి సర్వశక్తులూ ఒడ్డుతుండగగా, మరోవైపు బిజెపికి అడ్డుకట్ట వేసి ఏడింటిలోనూ విజయకేతనం ఎగురువేయాలని ఇండియా ఫోరం గట్టిగా పయత్నిస్తుంది.

గత ప్రాభవం బిజెపికి అసాధ్యం

ఢిల్లీలో న్యూఢిల్లీ, తూర్పు ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, ఈశాన్య ఢిల్లీ, చాందినీ చౌక్, దక్షిణ ఢిల్లీ, వాయువ్య ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. 2019 ఎన్నికల్లో మొత్తం ఏడు సీట్లనూ బిజెపి గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో బిజెపి 56.6 శాతం ఓట్లు సాధించింది. కాంగ్రెస్ పార్టీ 22.5 శాతం, ఆప్ 18.1 శాతం, బిఎస్పి 1.1 శాతం ఓట్లు పొందాయి. అంతకు ముందు 2014 లోక్‌సభ ఎన్నికలలో కూడా బిజెపి ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా ఫోరంగా రంగంలోకి దిగిన ఆప్, కాంగ్రెస్ ప్రజాదరణను చూరగొంటున్నాయి. బిజెపికి గతంలోని ఫలితాలు రావడం సాధ్యం కాదని సందేహిస్తున్న బిజెపి, ప్రతీకార చర్యలకు పాల్పడింది. సిఎం అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేస్తూ అరెస్టు చేసి జైలులో పెట్టిందని అర్థమవుతోంది.

ఐదుగురు బిజెపి అభ్యర్థులు ఖరారు

ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాల్లో బిజెపి ఒంటరిగా పోటీ చేయనుంది. ఐదుగురి పేర్లను ప్రకటించింది. న్యూఢిల్లీ నుంచి బన్సూరి స్వరాజ్, చాందినీ చౌక్ నుంచి ప్రవీణ్ ఖండేల్వాల్, దక్షిణ ఢిల్లీ నుంచి రాంవీర్ సింగ్ బిధూరి, ఈశాన్య ఢిల్లీ నుంచి మనోజ్ తివారీ, పశ్చిమ ఢిల్లీ నుంచి కమల్ జిత్ సెహ్రావత్, తూర్పు ఢిల్లీ నుంచి హర్ష్ మల్హోత్రా, వాయువ్య ఢిల్లీ నుంచి యోగేంద్ర చందోలియాలను బిజెపి పోటీకి దింపింది. కాగా బిజెపి పలువురు సిట్టింగ్‌లను తొలగించింది. ఏడుగురు ఎంపిల్లో ఆరుగురుకి టిక్కెట్లు నిరాకరించింది. ఒక్క సిట్టింగ్ ఎంపిక మనోజ్ తివారీకి మాత్రమే మరోసారి టికెట్ దక్కింది. తూర్పు ఢిల్లీ ఎంపి గౌతమ్ గంభీర్, నార్త్ వెస్ట్ ఎంపి హన్స్ రాజ్ హన్స్, మాజీ మంత్రి, చాందినీ చౌక్ ఎంపి హర్షవర్ధన్, కేంద్ర మంత్రి, న్యూఢిల్లీ ఎంపి మీనాక్షి లేఖి, వెస్ట్ ఢిల్లీ ఎంపి ప్రవేశ్ సాహిబ్ సింగ్, సౌత్ ఢిల్లీ ఎంపి రమేష్ బిధూరిలకు ఈసారి బిజెపి టిక్కెట్లు నిరాకరించింది.

ఎల్‌జి ఆధిపత్యంపైనే...

ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వంపై లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) అజమాయిషీ చెలాయించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ప్రతి చిన్న అంశంలో ఎల్‌జి జోక్యం సమాఖ్య సూత్రాలకే నష్టం చేస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్నిక విషయంలో కూడా ఎల్‌జి జోక్యం చేసుకోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎల్‌జి నామినేట్ చేసిన కౌన్సిలర్స్ ను సుప్రీం తొలగించింది. ఇలా సుప్రీంకోర్టు అక్షింతలు వేసే ఘటనలు అనేకం ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలపై ఎల్‌జికి నిర్ణయాత్మక అధికారం కట్టబెడుతూ కేంద్రం తెచ్చిన వివాదాస్పద చట్టం ఎన్నికల ప్రచారంలో ఇండియా ఫోరంకు అస్త్రంగా మారింది.

ఆప్, కాంగ్రెస్ అవగాహన

ఈ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్‌తో సీట్ల పంపకం ఒప్పందం చేసుకుంది ప్రతిపక్ష ఇండియా ఫోరంలో భాగమైన ఈ రెండు పార్టీలు దేశ రాజధానిలో 4:3 సీట్ల షేరింగ్ ఫార్ములాకు అంగీకరించాయి. ఇందులో ఆప్ నాలుగు స్థానాల్లో పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనుంది. న్యూఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, తూర్పు ఢిల్లీ స్థానాల్లో ఆప్, చాందినీ చౌక్, ఈశాన్య ఢిల్లీ, వాయువ్య ఢిల్లీ స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తున్నాయి. ఆప్ తూర్పు ఢిల్లీకి కుల్దీప్ కుమార్, న్యూఢిల్లీకి సోమనాథ్ భారతి, దక్షిణ ఢిల్లీకి సహిరామ్ పెహల్వాన్, పశ్చిమ ఢిల్లీకి మహాబల్ మిశ్రాను బరిలో దింపింది. కాంగ్రెస్ పార్టీ చాందినీ చౌక్ నుండి జె.పి. అగర్వాల్, ఈశాన్య ఢిల్లీ నుండి కన్హయ్య కుమార్, వాయువ్య ఢిల్లీ నుంచి ఉదిత్ రాజ్ పోటీ చేస్తున్నారు.

జైలు నుంచి విసి ద్వారా ఎన్నికల ప్రచారానికి అనుమతించాలి

- ఢిల్లీ హైకోర్టులో పిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టులో తమాషా అయిన ప్రజాహిత వ్యాజ్యం (పిల్) పడింది. అరెస్టయి జైళ్లలో ఉన్న రాజకీయ నాయకులను 2024- సార్వత్రిక ఎన్నికల్లో వీడియో కాన్ఫరెన్స్ (విసి) ద్వారా ప్రచారం నిర్వహించేందుకు అనుమతించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ కోర్టులో పిల్ దాఖలైంది. న్యాయవాది ఇమ్రాన్ అహ్మద్ ద్వారా న్యాయ విద్యనభ్యసిస్తున్న చివరి సంవత్సరం లా విద్యార్థి అమర్జీత్ గుప్తా ఈ వ్యాజ్యం వేశారు. జైలు నుంచి విసి ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, వ్యవస్థను నెలకొల్పేలా ఇసిని ఆదేశించాలని పిల్‌లో కోరారు. ఇదిలా ఉండగా రాజకీయ కక్షల కారణంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జైలులో ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నించినా వారికి బెయిల్ రాలేదు. ఈ నేపథ్యంలోనే పిల్ దాఖలైనట్లు తెలుస్తోంది. కాగా రాజకీయాల్లో ఉంటూ నిజంగా తీవ్ర నేరాలు చేసి జైలుకెళ్లిన వారికి సైతం వి.సి. ద్వారా ప్రచారం నిర్వహించే వెసులుబాటు కల్పిస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, చట్టాల ఉల్లంఘన అవుతుందన్న అభ్యంతరం వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు.

దేశం వీడిన దేవెగౌడ మనుమడు

బెంగళూరు : భారత మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నికల సమయాన దేశం విడిచి పారిపోయారు. ఇప్పుడు కర్ణాటకలో ఈ అంశమే హాట్ టాపిక్‌గా మారింది. గతంలో దేవెగౌడ పలు మార్లు గెలిచిన, కంచుకోట అయిన హసన్ లోక్‌సభ స్థానం నుంచి రేవణ్ణ ఈసారి పోటీకి దిగారు. అయితే ఇటీవల ఆయనపై అసభ్యకర వీడియోలు ప్రచారంలోకొచ్చాయి. దీంతో ఈ వీడియోలపై కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ప్రభుత్వం దర్యాప్తు కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ని (సిట్) ఏర్పాటు చేయనున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రేవణ్ణ ఆదివారం ఉదయం బెంగళూరు నుంచి జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు బయల్దేరి వెళ్లడం గమనార్హం. మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ముందు ప్రజ్వల్‌కి చెందిన అసభ్యకర వీడియోలు హసన్ జిల్లాలో సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చాయి. మహిళపై లైంగిక వేధింపుల కోణంపై కూడా సిట్ దర్యాప్తు చేస్తుందని సిఎం చెప్పారు. కాగా రేవణ్ణను అప్రదిష్టపాల్జేయడానికి నవీన్ గౌడతో కలిసి మరికొందరు వీడియో క్లిప్‌లను వ్యాప్తి చేశారని జెడిఎస్, బిజెపి ఎలక్షన్ ఏజెంట్ పూర్ణచంద్ర గౌడ ఆరోపించారు. వీడియోలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రేవణ్ణపై మార్ఫ్ చేసిన వీడియోలను సృష్టించి అతనికి ఓటు వేయొద్దని ప్రచారం చేస్తున్నట్లు పూర్ణచంద్ర గౌడ పేర్కొన్నాడు. మరోవైపు ఈ అంశంపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. హసన్ నియోజకవర్గం దేవెగౌడ కుటుంబానికి కంచుకోట లాంటిది. రాజకీయంగా పుట్టస్వామి కుటుంబంపై వీరిదే ఆధిపత్యం. 1994, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టస్వామి హుళెనరసిపుర శాసనసభ స్థానం నుంచి పోటీ చేసినప్పటికీ.. దేవెగౌడ పెద్ద కుమారుడు హెచ్.డి రేవణ్ణ చేతిలో పరాజయం పాలయ్యారు. 2008, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టస్వామి కోడలు ఎస్.జి అనుపమకూ ఓటమి తప్పలేదు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టస్వామి మనవడు శ్రేయస్ పటేల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా.. 3,152 ఓట్ల తేడాతో రేవణ్ణ చేతిలో ఓడిపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇరు కుటుంబాలకు చెందిన వారే మళ్లీ పోటీపడుతున్నారు.

మణిపూర్‌లో రీపోలింగ్

ఇంఫాల్ : మణిపూర్‌లో మరోసారి రీపోలింగ్ జరగనుంది. ఔటర్ మణిపూర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఆరు పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 30వ తేదీన రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. రెండో విడతలో భాగంగా ఈ నెల 26న జరిగిన పోలింగ్ సందర్భంగా ఈ ఆరు పోలింగ్ కేంద్రాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఉఖ్రుల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని నాలుగు పోలింగ్ స్టేషన్‌లు, ఉఖ్రుల్‌లోని చింగై అసెంబ్లీ సీటు, సేనాపతిలోని కరోంగ్‌లలో ఒక్కో స్థానంలో ఏప్రిల్ 30న రీపోలింగ్ నిర్వహిస్తామని, రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ఝా తెలిపారు. కాగా మొదటి విడత ఎన్నికల్లో ఇన్నర్ మణిపూర్ లోకసభ పోలింగ్‌లో కూడా రీపోలింగ్ జరిగింది. ఎన్నికల సందర్భంగా కాల్పులు, పోలింగ్ కేంద్రాలపై దాడులు జరగడంతో 11 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 22న రీపోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

కలం బాణాలు

ఇండియా బ్లాక్ గెలిస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులు : మోడీ

ప్రభుత్వాలు
కూల్చేసిన మీరే
అస్థిరమంటూ మళ్ళీ
బురద జల్లుతారే?

జనతా సర్కారునుంచి
విపిసింగ్,దేవగౌడ
అన్నీ చూసింది జనత
ఎపుడో మార్చేను చరిత!

వైసిపి మ్యానిఫెస్టో - టిడిపి సూపర్ - 6

వైసీపీ టీడీపీ
ప్రణాళికల పోటీ
బిజెపి బాటలోన
విధేయతే చాటీ!

వెల్ఫేర్ హైటెక్ విజనుల
హడావుడి లొ ఏపీ!
దీర్ఘకాల సమస్యలకు
పరిష్కారం ఏదీ?



కూటమికి బిఎస్‌పి పోటు

మోడీపై పోరులోన
కానరాని మాయావతి
లౌకిక శిబిరం వీడెను
కరిగిపోగ గతఖ్యాతి

ప్రజాస్వామ్య రక్షణలో
బిఎస్‌పి పాత్ర
మళ్ళీ మొదలయ్యేది
ఎపుడో బహుజనమిత్ర

- తె.ర

సిఎం రమేష్‌కు స్థానికేతర భయం

- ఆకట్టుకునేందుకు కొత్తకొత్త యత్నాలు
- చేసిన పనుల్లేక.. చెప్పుకోలేక అవస్థలు
- పలుకుబడి ఉందని గొప్పలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి లోక్‌సభ బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ ఎన్నికల ప్రచారంలో కొత్త వ్యూహాలు అనుసరిస్తున్నారు. తన పార్టీకి బలం లేకపోవడంతో పాటు స్థానికేతర భయం వెంటాడుతుండటంతో ఆకట్టుకొనే పనిలో కొత్తకొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. కడపకు చెందిన ఆయనకు టిడిపి ప్రధాన నాయకత్వంతో మినహా కూటమి కార్యకర్తలతో సరైన సంబంధాల్లేవు. టిడిపి అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన రమేష్ కూటమిలో టిడిపి ఓటింగ్‌పైనే ఆధారపడి పనిచేస్తున్నారు. వైసిపి లోక్‌సభ ఎంపీ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు స్థానికుడు కావడంతో అతని కంటే తానే గొప్పవాడిననే ప్రదర్శన సిఎం రమేష్ చేస్తున్నారు. బిజెపి ప్రభుత్వ పెద్దల పరిచయాలతో ఏ పనులైనా చేయగలనని చెప్పుకుంటూ వారితో తనకున్న అనుబంధాన్ని చెప్పుకొనేందుకు కేంద్ర మంత్రులను అనకాపల్లికి రాబడుతున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే తన నామినేషన్ సందర్భంగా అనకాపల్లి సభకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను రమేష్ రప్పించారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రధానితో సభ జరిపే ప్రయత్నం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో ఓటర్లను పసిగట్టి ప్రలోభపెట్టేందుకు తన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను రంగంలోకి దించారు. ఈ వ్యవహారాల్లో కూటమి పార్టీలను కూడా నమ్మకుండా ఓటర్లను ఆకట్టుకొనే పని వీరికి అప్పగించారు. స్థానికేతరుడు కావడంతో ఏ రాజకీయ, కుటుంబ సంబంధాలు, బంధుత్వాలు, పరిచయాలూ ఆయనకు లేవు. ప్రధాని, కేంద్ర మంత్రులను రాబట్టి, తన వ్యక్తిగత పలుకుబడిని పెంచుకుంటే ఓటింగ్ పెరుగుతుందన్న ఆలోచనలో ఆయన వున్నారు. బిజెపికి సొంతంగా పోటీచేసే రాజకీయ బలం అనకాపల్లిలో లేదు. గత ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి డాక్టర్ గండి వెంకట సత్యనారాయణరావుకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. బిజెపికి 1.07 శాతం ఓట్లురాగా, నోటాకు 2.82 శాతం ఓట్లు వచ్చాయి. అత్యంత బలహీనంగా బిజెపి ఇక్కడ వున్నప్పటికీ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సూచన ప్రకారం ఈ నియోజకవర్గం నుంచి పోటీకి రమేష్ సిద్ధపడ్డారు. వ్యాపారవేత్తయిన రమేష్ జిల్లాలో ప్రజల సమస్యలకు పరిష్కారం చెప్పడంలేదు. గెలవడం కోసం కూటమి అభ్యర్థులు కొన్ని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రమేష్‌ను గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపగలరంటూ అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడి నిందలపాలయ్యారు. ఇప్పటి వరకూ ప్రధాని పరిచయాలతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఎందుకు రాబట్టలేదు ? విభజన చట్ట హామీలను ఎందుకు అమలుచేయించలేదు ? అన్న ప్రశ్నలకు రమేష్ వద్ద సమాధానాల్లేవు. పోలవరం ఎడమ కాలువ పనులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఎప్పటిలోగా పూర్తిచేయిస్తారన్న సందేహాలకు ఆయన నుంచి జవాబుల్లేవు. ప్రధానితో అనకాపల్లి సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించే ప్రకటన చేయించినప్పుడు రమేష్ పలుకుబడికి వున్న ప్రామాణికత తెలుస్తుందని పలువురు చెప్పుకుంటున్నారు.

నేటితో ముగియనున్న ఉపసంహరణ గడువు

- రెబల్స్, ఇండిపెండెంట్స్‌ను బుజ్జగిస్తున్న పార్టీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్లు వేసిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో గడువు ముగుస్తుంది. దీంతో నియోజకవర్గాల్లో ఇండిపెండెంట్లు, చిన్నాచితక పార్టీల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులను రంగంలోంచి తప్పుకుని తమకు సహకరించాలంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుయాయులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలకు సంబంధించి 2,705 నామినేషన్లు, 25 పార్లమెంటరీ నియోజకవర్గాలకు సంబంధించి 503 నామినేషన్లను ఎన్నికల కమిషన్ ఆమోదించింది. తిరుపతి, గుంటూరు వంటి చోట్ల అత్యధికంగా నామినేషన్లు దాఖలైన సంగతి పాఠకులకు విధితమే. ఈ దఫా ఎన్‌డిఎ కూటమి, వైసిపి, ఇండియా బ్లాక్‌తో పాటు పలు పార్టీల అభ్యర్థులు రంగంలో ఉండటంతో పలు నియోజకవర్గాల్లో తీవ్ర పోటీ నెలకొంది. కొన్నిచోట్ల సామ, ధాన భేద దండోపాయాలు ఉపయోగించి వారిని పోటీ నుంచి తప్పుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. వీలైనంత వరకు రెబల్స్, ఇండిపెండెంట్లను రంగంలో లేకుండా చేసేందుకు ఆయా పార్టీల అధినేతలు, కీలక నేతలు చర్చలు జరపడం, భరోసానివ్వడంతో కొంత మంది ఉపసంహరించుకునేందుకు ఒప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 29న ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఎన్నికల కమిషన్ బరిలో ఉండే అభ్యర్థులకు గుర్తులను కేటాయించనుంది.

గుడివాడలో నాని కహానీ

- రాష్ట్రంలో అత్యంత ఖరీదైన నియోజకవర్గాల్లో ఒకటి
- త్రిముఖ పోరు తప్పదా?

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లాలో అత్యంత కీలక నియోజకవర్గాల్లో గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం ఒకటిగా ఉంది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), టిడిపి అభ్యర్థిగా ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాము, సిపిఎం, సిపిఐ, ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా వడ్డాది గోవిందరావు (రాజేష్) పోటీలో ఉన్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోరు నెలకొంది.

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు సొంత నియోజకవర్గం గుడివాడ. ఈ నియోజకవర్గంలోని గుడివాడ పట్టణంతోపాటు గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో 2 లక్షల 786 మంది ఓటర్లున్నారు. ఆక్వా ఉత్పత్తుల ద్వారా అత్యంత తలసరి ఆదాయం సమకూరుతున్న మండలంగా నందివాడ ఉంది. ఈ నియోజకవర్గాన్ని మాజీ మంత్రి కొడాలి నాని తనకు పెట్టని కోటగా మార్చుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్‌పై మాటలు తూటాలు పేలుస్తూ నిత్యం వార్తల్లో ఉండే నానిని ఎలాగైనా ఓడించాలని టిడిపి అధిష్టానం ఎన్ఆర్ఐ వెనిగండ్ల రామును రంగంలోకి దించింది. ఎన్నికల తేదీ దగ్గరపడుతుండటంతో ఈ నియోజకవర్గంలో ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే టిడిపి అధినేత చంద్రబాబు 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో భారీ సభ నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' భారీ బహిరంగ సభ నిర్వహించారు.

అధికారంలో ఉండి నెగ్గేనా?

కొడాలి నాని

2004, 2009 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా, 2014, 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా కొడాలి నాని పోటీ చేసి నాలుగు సార్లూ వరుసగా విజయాలు సాధించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో మొదటి మూడేళ్లు పౌరసరఫరాలశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. నాని విజయం సాధించిన నాలుగు ఎన్నికల్లో మూడుసార్లు ఆయన విపక్ష పార్టీ అభ్యర్థిగానే రంగంలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. గెలుపు కోసం శ్రమిస్తున్నారు. అధికార పార్టీలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి గురించి అంతగా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. మంత్రిగా ఉన్న సమయంలోనూ నియోజకవర్గంలో రైతులు ధాన్యం సేకరణ సమస్యలు ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. విద్యుత్ ఛార్జీల భారాలు గుడివాడలోని వ్యవసాయ అనుబంధ సూక్ష్మ పరిశ్రమలను దెబ్బతీశాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అత్యంత ఖరీదైన నియోజకవర్గం

ఎన్నికల్లో అంతటా డబ్బు ప్రవాహం సర్వసాధారణంగా మారింది. రాష్ట్రంలో అత్యంత ఖరీదైన నియోజకవర్గాల్లో ఒకటిగా గుడివాడ ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. నగదు పంపిణీ కొన్ని ప్రాంతాల్లో సక్రమంగా చేయలేదని 2014 ఎన్నికల్లో టిడిపి కార్యాలయం వద్ద కొందరు ఓటర్లు ఆందోళన నిర్వహించడం ఇక్కడ డబ్బు ప్రభావం ఎంతగా ఉంటుందో చెబుతోంది. ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా డబ్బు పంచగలిగిన వారినే ప్రతిపక్ష పార్టీ రంగంలో దించిందనే చర్చ సాగుతోంది. పోటీ చేసే ప్రధాన అభ్యర్థులు గతంలో ఒక్కో ఓటుకు రూ.2 వేలు పంపిణీ చేశారని, ఈ ఎన్నికల్లో మరింత ఎక్కువగా డబ్బు ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


వెనిగండ్ల రాము

జోష్ ఏదీ?

- మ్యానిఫెస్టోపై వైసిపి శ్రేణుల్లో అంతర్మథనం

ప్రజాశక్తి
అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 సాధారణ ఎన్నికల కోసం ప్రకటించిన మ్యానిఫెస్టో వైసిపి శ్రేణులను తీవ్రంగా నిరుత్సాహ పరిచింది. 2019 నవరత్నాల పేరుతో ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లిన జగన్‌మోహన్‌రెడ్డి ఇపుడు అవే పథకాలను కొనసాగిస్తామని చెప్పడం తప్ప కొత్తదనం ఎక్కడా ప్రతిబింబించకపోవడం వైసిపిలో చర్చనీయాంశంగా మారింది. నాడు ప్రకటించిన మ్యానిఫెస్టోలో కీలకమైన ఉద్యోగుల సిపిఎస్ రద్దు, ప్రతియేటా జాబ్ క్యాలెండర్, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు నిర్వాసితులకు మెరుగైన పునరావాస ప్యాకేజీ, మద్యపాన నిషేధం, కేంద్రం నుండి ప్రత్యేక హోదాను సాధించడం, రైల్వే జోన్ వంటి కీలకాంశాల్లో చేతులెత్తేసిన వైసిపి ప్రభుత్వం ఇపుడు అవే నవరత్నాలను మళ్లీ అమలు చేస్తామంటూ చేసిన ప్రకటన పట్ల ప్రజల్లో కూడా నిరాశను నింపింది. ప్రత్యర్థి తెలుగుదేశం కూటమి చాలా కాలం కిందటే ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను మరిపించేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించే మ్యానిఫెస్టో వుంటుందని అంతా ఆశించారు. అయితే సూపర్ సిక్స్‌ను మరిపించడం కాదుకదా వాటికంటే తక్కువ మొత్తాన్ని ప్రకటించారు. సూపర్ సిక్స్ పథకంలో పెన్షన్‌ను రూ.4 వేలకు, రైతు భరోసా రూ.20 వేలకు పెంచడం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్‌లను ఉచితంగా ఇవ్వడం, మహిళలకు ఉచిత ఆర్‌టిసి ప్రయాణం, మూడు వేల నిరుద్యోగ భృతి వంటి అంశాలు ఉన్నాయి. ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌ల పథకాలతో కాంగ్రెస్ పార్టీ పొరుగున వున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అనూహ్యమైన విజయాలు సాధించిన అంశాలు కళ్లెదుట వున్నా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనీసం ఇలాంటి పథకాలనైనా ప్రకటిస్తారని ఆశించారు.

డ్వాక్రా మహిళలు నిరుత్సాహం

డ్వాక్రాలకు మెరుగైన పథకాన్ని తీసుకొస్తారని, అలాగే రైతు రుణమాఫీపై ప్రకటన వుంటుందని వైసిపి అభ్యర్థులతోపాటు పార్టీ శ్రేణులు అంతా అనుకున్నారు. ఆ రెండు ప్రకటనలు లేకపోవడంతో నిరుత్సాహం చెందారు. 2019లో పెన్షన్‌ను జగన్‌మోహన్‌రెడ్డి మొదట రూ.2 వేలు అనగానే, చంద్రబాబు రూ.3 వేల ప్రకటన చేశారు. నాడు జగన్ కూడా వెంటనే తమ ప్రభుత్వం రాగానే మూడు వేలు ఇస్తామనే ప్రకటన చేయడంతో ప్రజలు ముందు వాగ్దానం చేసిన జగన్‌నే ఆదరించారని, ఇపుడు వారికి ధీటుగా ప్రకటన లేకపోవడం తమకు నష్టం చేస్తుందని వైసిపి శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి కొట్లాటల్లో ధర్మవరం

- సత్యకుమార్‌కు స్థానిక నేతల సహాయ నిరాకరణ
- టిడిపి బలంపైనే నమ్మకం

సత్యకుమార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాలోని ధర్మవరం అసెంబ్లి నియోజకవర్గంలో కమలం వాడిపోతుంది. అక్కడ బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అయితే ఆయనకు స్థానిక నాయకులు సహకారం కరువైంది. దీనికితోడు ఆయన స్థానికేతరుడు అని, నియోజకవర్గంపై అవగాహన పూర్తిగా లేదని పలువురు చర్చించుకుంటున్నారు. పట్టుకోసం ఆయన నానా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. పూర్తిగా తెలుగుదేశం పార్టీ నాయకులపై ఆధారపడి నెట్టుకొచ్చేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వాస్తవానికి ధర్మవరం నియోజకవర్గంలో బిజెపి బలం నామమాత్రమే. 2019 ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేస్తే వెయ్యిలోపు ఓట్లు మాత్రమే బిజెపికి ఇక్కడ వచ్చాయి. ఈ ఎన్నికల్లోనూ బిజెపి ఆ స్థానాన్ని అడగటం వెనుక టిడిపి నుంచి బిజెపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే జి సూర్యనారాయణ బలం చూసే. ఆయన 2014లో ఎమ్మెల్యేగా ఉన్నారు. 2019లోనూ టిడిపి తరపున పోటీ చేసి ఓటమి చెందారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఆయన బిజెపిలో చేరారు. ఈసారి బిజెపి తరపున ఆయనకే టికెట్టు అని మొదట ప్రచారం జరిగింది. ఈ మేరకు ఆయన కూడా అభ్యర్థి ప్రకటనకు ముందే బిజెపి తరపున ప్రచారాన్ని ప్రారంభించారు. చివరి నిమిషంలో మార్పు జరిగి సత్యకుమార్‌కు టికెట్టు ఇచ్చారు. భంగపడిన సూర్యనారాయణ అసంతృప్తితో ఉన్నారు. ఒక దశలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తారన్న ప్రచారమూ జరిగింది. అయితే సత్యకుమార్‌కు ఆయన సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. టిడిపి తరపున టికెట్టు ఆశించిన పరిటాల శ్రీరామ్ మద్దతుదారులు పెద్దయెత్తున నిరసనలు సైతం చేపట్టారు. చివరకు సత్యకుమార్‌కు సహకరిస్తామని ప్రకటించారు. అప్పుడప్పుడు శ్రీరామ్ ప్రచారాల్లో పాల్గొంటున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఇక్కడ బిజెపికి మద్దతు నిలువడం కష్టసాధ్యమైనదిగానే ఉందని రాజకీయవర్గాల్లో చర్చ. ఎందుకంటే పరిటాల శ్రీరామ్ తల్లి పరిటాల సునీత రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. అక్కడ కూడా శ్రీరామ్ దృష్టి సారించాల్సి ఉంది. రాప్తాడులో వైసిపి అభ్యర్థి తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డితో సునీతకు గట్టిపోటీనే ఎదురవుతోంది. ఇక జనసేన నాయకుడు మధుసూదన్‌రెడ్డి కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ధర్మవరంలో ఏమాత్రం బలం లేని బిజెపికి పూర్తి స్థాయి సహకారం, తోడ్పాటు అందటం ఇబ్బందికరంగానే ఉండనుంది. ఇలా సొంత పార్టీ నాయకుల నుంచి.. ఇటు మిత్రపక్షం నుంచి పూర్తి స్థాయి సహకారం లేకపోవడంతో ధర్మవరంలో బిజెపికి ఎదురుగాలే వీస్తోంది. ఇక్కడ వైసిపి అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముందు నుంచి జనంలో ఉంటూ వస్తున్నందున ఆయన నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో పట్టుంది. ఇప్పటికే ఆయన రెండు, మూడు విడతల ప్రచారాన్ని పూర్తి చేశారు. సత్యకుమార్ ఇప్పటికీ ఒక దశ ప్రచారం కూడా పూర్తవలేదు. నియోజకవర్గంపై అవగాహన కల్పించుకునే పనిలోనే ఉన్నారు.

భారీగా బంగారం పట్టివేత

- రూ.6.24 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఆదివారం పలు జిల్లాల్లో వాహన తనిఖీలు చేపట్టి భారీగా బంగారం, డబ్బు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల వద్ద 66 కిలోల బంగారాన్ని ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాదు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న బిబిసి లాజిస్టిక్ వాహనాన్ని తనిఖీ చేయగా బంగారు, వెండి ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలోని ఎంఎంరోడ్డు గీతా మార్కెట్ సర్కిల్ వద్ద సుమారు రూ.50 లక్షల విలువ చేసే 785.446 గ్రాముల బంగారాన్ని పట్టుకున్నట్లు ట్రైనింగ్ డిఎస్‌పి వి.దీరజ్ తెలిపారు.

ఎన్నికల్లో ఎన్ఆర్ఐలు

- కొందరు ప్రత్యక్ష పోటీ
- ప్రచార బాధ్యతల్లో మరికొందరు
- ప్రధాన పార్టీలకు ప్రవాసాంధ్రుల మద్దతు

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలూ తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. అధికార వైసిపి తిరిగి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జట్టుగా వస్తున్నాం.. ఈ ఎన్నికల్లో ఓట్లు చీలనీయకుండా మేమే అధికారంలోకి వస్తామంటూ టిడిపి, జనసేన, బిజెపి నేతలు చెబుతున్నారు. అయితే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనేది సస్పెన్స్‌గా మారింది. సంక్షేమ జపాన్ని వైసిపి అధినేత వైఎస్ జగన్ వల్లెవేస్తున్నారు. మేము అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తామని, ఉద్యోగాలు ఇస్తామంటూ చంద్రబాబు కూడా హామీలు గుప్పించేస్తున్నారు. తాను పోటీచేసే స్థానంలో సహా జనసేన పోటీచేస్తున్న 21 నియోజకవర్గాల్లో రెబల్స్, వ్యతిరేకత మూటగట్టుకున్న పవన్‌కల్యాణ్ సైతం గెలిచేస్తామంటూ బీరాలు పలుకుతున్నారు. క్షేత్రస్థాయి రాజకీయాలు మరోలా ఉంటున్నాయి. గ్రామాల్లో పెత్తందారులు, ఆయా పార్టీల్లో కీలక స్థానాల్లో ఉన్నవారు సైతం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవటంతో ప్రతిరోజూ ఉదయం అల్పాహారం దగ్గర నుంచి మధ్యాహ్నం భోజనం, రాత్రికి డిన్నర్ సైతం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ మరో గమ్మత్తు ఏమిటంటే గ్రామాల్లో చదువుకుని విదేశాల్లో స్థిరపడిన వారైన ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) ఈ ఎన్నికల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఎన్ఆర్ఐలు చెబితే ఓట్లు పడతాయనే భావనలో వైసిపి, కూటమి (టిడిపి, జనసేన, బిజెపి) వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. చదువు, ఉద్యోగంతోపాటు కుల, మత, ప్రాంతం అంశాలను ప్రభావితం చేసేలా ఎన్ఆర్ఐలను ప్రోత్సహిస్తున్నారు. వైసిపి, కూటమి తరపున ఆరునెలల నుంచి ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఏర్పాట్లు జరిగాయి. ఎన్నికల్లో ఎలా పనిచేయాలి, అభ్యర్థుల విజయం కోసం ఎలా కృషి చేయాలి, ఓటర్లను ఎలా ప్రభావితం చేయాలనే అంశాలపై ప్రధానంగా కేంద్రీకరించాయి. సొంత నియోజకవర్గం, లేదా బలహీనంగా ఉన్న రిజర్వ్‌డ్ నియోజకవర్గం, లేదా కీలక నియోజకవర్గాల్లో పనిచేసేలా ప్రతిఒక్కరికీ మూడు ఆప్షన్లను టిడిపి కూటమి ఇచ్చింది. అవసరం ఉన్న, సామాజిక బలం కోసం, అభ్యర్థుల అవసరాల మేరకు ఆయా నియోజకవర్గాలను వైసిపి కేటాయించి పనిచేయాలని నిర్ధేశించింది. ఏదేమైనా ఆయా పార్టీలకు అనుబంధంగా వివిధ దేశాల్లో పనిచేస్తున్న ఎన్ఆర్ఐలు ఈ ఎన్నికల్లో తమవంతుగా కృషిని ఇప్పటికే కొనసాగిస్తున్నారు.

వైసిపి ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యాన కూడా ఎన్నికల ప్రచారంలో ఎన్ఆర్ఐలు విస్తృతంగానే కృషి చేస్తున్నారు. ఎన్ఆర్ఐ వైసిపి ద్వారా తమ ప్రాంతాల్లో ప్రభావితం చేసేలా కృషి చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారు. ఆ దిశగా ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో వైసిపికి అనుకూలంగా పనిచేస్తున్నారు. ఏ దేశంలో పనిచేస్తున్నా ఈ ఎన్నికల్లో మాత్రం వచ్చి వైసిపికి అనుకూలంగా పనిచేయాలని కోరుతున్నారు. నియోజకవర్గాల ఎంపిక వారికే అవకాశం ఇచ్చారు. పట్టున్న ప్రాంతాల్లోనే పనిచేయాలని సూచించారు. వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సజ్జల భార్గవరెడ్డి, ఆయన బృందం కూటమి ఎత్తుగడులను సోషల్ మీడియా ద్వారా తిప్పికొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నెల 23న విశాఖపట్నంలో వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు, ఎన్ఆర్ఐ వింగ్‌తో సిఎం వైఎస్ జగన్ ముఖాముఖీ గానూ, మరికొందరితో అదే వేదికపైనా ఆన్‌లైన్ ద్వారా ముచ్చటించారు. ఏదేమైనా ఈ ఎన్నికల్లో ఎన్ఆర్ఐలు ఎంతమంది ఓటర్లను ప్రభావితం చేస్తారో వేచి చూడాల్సిందే.

\- నివాస్

వ్యూహాలకు పదును

ఈ నెల 16న టిడిపి ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యాన టిడిపి జాతీయ కార్యాలయంలో ఎన్‌రీచ్ ఎపి మీట్ నిర్వహించింది. ఎన్ఆర్ఐ టిడిపి విభాగం అధ్యక్షులు వేమూరి రవికుమార్ ఆధ్వర్యాన జరిగిన సమావేశానికి గల్ఫ్ ప్రాంత కమిటీ అధ్యక్షులు రవి రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు గెలుపే లక్ష్యంగా పనిచేయాలంటూ రవికుమార్ పిలుపునిచ్చారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు సుమారు 1,500 మంది ఎన్ఆర్ఐలు 125 దేశాల నుండి సమావేశానికి హాజరయ్యారు. ఎన్ఆర్ఐ టిడిపి అమెరికా విభాగం నేత కోమటి జయరామ్ ఇదే సమావేశంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్నే లేపాయి. ఓటర్లు వెదవలనీ, డబ్బిస్తే వాళ్లే ఓట్లేస్తారనీ, లేకపోతే వాళ్ల ఆర్థిక, కుటుంబ అవసరాలు ఏమిటో తెలుసుకుని సాయం చేస్తే ఓట్లు పడతాయంటూ వ్యాఖ్యానించారు. ఒక్కో ఎన్ఆర్ఐకు రూ.రెండు లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చుపెట్టడం పెద్ద కష్టమేమీ కాదని, ఒక్కో ఎన్ఆర్ఐ పది వైసిపి కుటుంబాలను మార్చాలని కోరారు. ఎన్ఆర్ఐ వింగ్ కీలక నేత చప్పిడి రాజశేఖర్ సమన్వయం చేశారు.

"తెలుగు నాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రయినేజీ స్కీము లేక
డేంజరుగా మారుతోంది."

– గజ్జెల మల్లారెడ్డి

ఆ చేతుల చేత ...

చెమట ధారలు కురిసీ కురిసీ మొలకెత్తిన
శ్రమైక జీవన సొగసు చేతులవి..
ఎక్కడ ఏ పని ముస్తాబై మెరిసినా
దాని వెనక ఆ చేతుల స్వేద విన్యాసమే సమస్తం!
ప్రయాణం నరకమైన గుంతల రోడ్లు
ఆ చేతులు తాకగానే ముఖాలకు జలతారు
పులుముకొని పయనానికి సిద్ధమవుతాయి
వాహనాలను గుండెల మీదుగా సంధించిన
బాణాల్లా రివ్వున సాగనంపుతాయి
అందమైన బహుళ అంతస్తుల భవంతులు
ఆ చేతి వేళ్ళలోంచే రూపుదిద్దుకుంటాయి
ప్రతి గదీ ప్రతి వస్తువూ వెనుక
కష్టం, సృజన ఆ చేతులదే!
ఎక్కడైనా సరే పదిచేతులు ఏకమై పరిశ్రమించాయంటే
అక్కడొక స్వర్గం వచ్చి వాలాల్సిందే!
తెల్లారి లేచేసరికి రోడ్డు పక్కనున్న
మురుగుకాల్వ దుర్గంధం పోయి
గలగలా మాట్లాడుతుందంటే రాత్రంతా ఆ చేతులు
నిరంతరంగా యుద్ధం చేయడమే కారణం!
ఎక్కడ ఘర్మజలం ప్రవహిస్తుందో అక్కడ
ఆ చేతులు చిగుర్లు తొడిగి మొక్కయి మానయి
శ్రమశక్తితో ధరణీ మండలాన్ని ధన్యం చేస్తుంది
ఆ చేతుల చలువ వల్లే
మానవుడి జీవిత చక్రం ఆగిపోకుండా
సర్వకాల సర్వావస్థల్లోనూ
నిరాఘాటంగా తిరుగుతూనే వుంటుంది!

– భీమవరపు పురుషోత్తమ్
99498 00253

దారి తప్పిన సెలయేరు

వేయికాళ్లతో నగవులెత్తే
రోకలిబండిలాంటి రైలు అప్పర్ బెర్త్ మీద
ఓ ఆరు వసంతాల బాలుడు
సెల్ ఫోన్‌లో సర్వైవల్ గేమ్ ఆడుతున్నాడు..!

ఆటలో మునిగి తేలుతూ ..
'ఇదిగో వీడొస్తున్నాడు బాంబు వెయ్యి
అదిగో వాడ్ని షూట్ చెయ్
ఆ కత్తితో వాడ్ని పొడువం'టూ అరుస్తున్నాడు
నెత్తుటి భాషతో ..!

పెరటి తోటలో
పూవుల్లా పరిమళించాల్సిన పిల్లలు
పచ్చని నేల మీద
ప్రాణవీచికల్లా పొరాడాల్సిన పిల్లలు
దేశ ధ్వజస్తంభం మీద
భావి దీపాలై ప్రకాశించాల్సిన పిల్లలు
యివాళేమిటిలా ..
హింసను ఎదనిండా పులుముకొని
నెత్తుటివాగులో కొట్టుకుపోతున్నారు!

కరుణ, జాలి పూయాల్సింది పోయి
వారి పసి మనసుల పలకల మీద
నిర్దయ హింస అనే పదాల్ని దిద్దిస్తున్నదెవరు?
పూలమీదా, సీతాకోకలమీదా
కరకుతనాన్ని కత్తుల్లా విసురుతున్నదెవరు?

వాళ్లివాళ.. దారి తప్పుతున్న సెలయేళ్లు
కనిపించని మంటల్లో
తగలబడుతున్న పూలతోటలు
వాళ్ల పసి మనసుల మీద
పేరుకుపోయిన నీలిమరకల్నీ
నెత్తుటి చారికల్నీ నిప్పుతో కడిగీ
మంచిగంధం పూతపూసే మనుషులు కావాలిప్పుడు!

– సిరికి స్వామినాయుడు
94940 10330

ఎండా కాలం

1
బయట ఎండలు సరేసరి
మరి మండే ధరలు మాటేమిటి?
అగ్నికి ఆజ్యం పోసినట్టు
నోరెండిన నారు సంగతేమిటి?
వలస కూలీల పరిస్థితి –
బతుకు తెరువు కోసం
కరువుతో కలిసి నడిచినట్టుంది
ఎండిన చెరువులు, నెర్రలిచ్చిన నేలలు
రైతాంగం వెంట వస్తున్నట్టున్నాయి!

2
ఇక రోజువారీ వేతనదారుల
కష్టాలు ఎవరికి ఎరుక
కరకు కళ్ళను పెట్టుకున్న
ఇరుకు మనసుకు ఎలా తెలుస్తుంది!
అడిగే నోరును నొక్కుతూ –
ఆకలిని తీర్చే నాగలిని
నడిరోడ్డున నిలబెట్టడమేమిటి?
బువ్వను చూసి హేళన చేసే
పాలనకు విలువుంటుదా?
భూమిని తవ్వి అమ్ముకొనే
అధికారం వెన్ను నిలుస్తుందా?

3
ప్రతి ఏడాది –
ఎండ చెప్పిన మాటలు వట్టివి కావు
తన గట్టి పట్టును చూపించే చేతలు
దీటుగా స్పందించకుంటే
ఘాటు ఫలితాన్ని తట్టుకోవడం కష్టం!
తను తేబోయే ముప్పుకు
తనే ముందుగా ఉప్పు అందిస్తుంది.
మేల్కొనకపోతే ఎవరికి చేటు!

4
నేటి దాహార్తిని తీర్చాలంటే
నీటి పెన్నిధిని కాపాడుకోవాలి.
బతుకుబండి నడవాలంటే
పర్యావరణాన్ని అనుసరించాలి.

చురచురా చూసినంత మాత్రాన
ఎండ గారి సహజత్వం చల్లారదు
నైరుతి ఋతుపవనాల పిలుపులే
రెక్కలు కట్టుకొని ఎగిరెగిరి రావాలి

జ్వలించే సూరీడే లేకుంటే
వెన్నెల వెలుగు వస్తుందా!
చినుకుపూలు కురవందే
పచ్చదనం పల్లవిస్తుందా!
ఈ చరాచర జగత్తుకు
అసలైన అర్థముంటుందా!

– బి.గోవర్ధనరావు
94419 68930

మన నేలకు మనం కృతజ్ఞతగా నిలబడాలి

ప్రముఖ రచయిత మల్లిపురం జగదీశ్‌తో ముఖాముఖి

అడవి నుంచి అతడిని 'అక్షరం' బయటకు తీసుకొచ్చింది. 'ఫలం' దొరికాక ముందుకు వెళ్ళిపోలేదు. తానొచ్చిన జాడల్ని దారులుగా మారాలని కోరుకుంటున్నాడు. కొండ దిగిన కాలుకి అంటుకొన్న బురదను జ్ఞాపకంగా, గుచ్చుకొన్న ముళ్ళను అనుభవంగా తలుస్తూ సాహిత్య సృజన చేస్తున్న రచయిత మల్లిపురం జగదీశ్ ఇటీవల తన గిరిజన జీవితాన్ని స్వగతంగా చేస్తూ అడవి పూలదారిలో 'మన్నెం ముచ్చట్లు'గా తీసుకొచ్చిన సందర్భంగా ఆయనతో జరిపిన ముఖాముఖి.



'మన్నెం ముచ్చట్లు' ఎంతమేరకు ఆదివాసీ జీవితాలను ప్రతిబింబింప చేసిందనుకొంటున్నారు?

ఇది మా వూరు పి.ఆమిటి (పార్వతీపురం మన్యం) చుట్టూ అల్లుకున్న నా అనుభవాల దొంతర. ఆదివాసీ జీవితాల్లోని కొన్ని పార్శ్వాలు మాత్రమే ఈ పుస్తకం తడిమింది. ఇంకా స్పృశించాల్సిన అంశాలు చాలా మిగిలే వున్నాయి.

మీ ఇతర రచనలకి, 'మన్నెం ముచ్చట్లు'కి ఉన్న ప్రత్యేకత?

ఇతర రచనలు కథారూపంలోనో, కవితా రూపంలోనో ఇమిడి వుంటాయి. మన్నెం ముచ్చట్లలా కాదు. ఏ ఫార్మెట్‌కీ ఇమడనివి. ఒక జ్ఞాపకాల దొంతర. అంతే! అక్కడక్కడా చైతన్యస్రవంతి పద్ధతిలా అనిపిస్తూ సాగుతుంది. మరికొన్ని చోట్ల ఒక అస్థిరమైన నెరేషన్‌లా అనిపిస్తుంది. మరోచోట కలలో మాట్లాడుతున్నట్టుంటుంది. ఇలా చెప్పడంలో నా ఉద్దేశ్యం ఏమిటంటే... ఆదివాసీ జీవితం ఏ ఒక్క నిర్వచనానికో అందనిది అని చెప్పడం.

'తుపాన్ గాడు', 'నేను' ఇద్దరు వేరువేరా? లేక మీలోని పార్శ్వాలా?

ఈ పుస్తకం ముందుమాటలో సంపాదకుడు ఎ.కె. ప్రభాకర్ తుపాన్‌ని "రచయిత ఆల్టర్ ఇగో" అన్నారు. అది నిజమే. వాడి గొంతులో నేను మాట్లాడుతుంటానిందులో. తుపాన్ గాడు నా బాల్య స్నేహితుడు. వాడొక వలసపిట్ట. ఎప్పుడో మా వూరొదిలి పెట్టి బతుకు పోరులో నలుగుతున్నవాడు. నా కథల్లో ఒక పాత్రగా చాలా చోట్ల కనీ కనిపించనట్లు మాట్లాడుతూ వుంటాడు. 'మన్నెం ముచ్చట్ల'లో మాత్రం పూర్తిస్థాయిలో ప్రత్యక్షంగా మాట్లాడుతుంటాడు. 'నేను', 'తుపాన్ గాడు' రెండూ రెండు పాత్రలు.

మీ బాల్యం, మీ పిల్లల బాల్యానికి మధ్యన గిరిజన ప్రాంతాల్లో చోటు చేసుకొన్న మార్పులు?

ఆ రెంటి మధ్య తేడా దాదాపు మూడు దశాబ్దాల కాలం. ఈ కాలంలో మార్పులు లేవంటే ఎలా? చాలా మార్పులొచ్చాయి. ముఖ్యమైనవి విద్య, వ్యాపారం, మతం, రాజకీయం. విద్య ఇప్పుడు చాలా వరకు అందుబాటులోకి వచ్చింది. నాణ్యతలో తేడాలుండొచ్చు కానీ విప్లవాత్మకమైన తేడా అయితే స్పష్టంగా ఉంది. అప్పటి బాల్యపు అవసరాలు వేరు. ఇప్పటి బాల్యపు అవసరాలు వేరు. సౌకర్యాల విషయమూ అంతే. ఆనాటి మా వూళ్ళు ఈనాటి మా వూళ్ళు ఒక్కటి కాదు.

వ్యాపారం అయితే ఆ రోజు వారపొడ్డీవాళ్ళు, సొండీలు, షావుకార్లు మాత్రమే ఇక్కడికొచ్చి వ్యాపారమని చెప్పి ఆదివాసీ పంటల్నీ, భూముల్నీ కొల్లగొట్టి తిరుగుబాటుకి కారణమయ్యేరు. ఈ రోజు వాళ్ళ సంఖ్య రెట్టింపయ్యింది. మైదాన ప్రాంత గిరిజనేతరులు కొత్త కొత్త దారుల్లో అడవుల్లోకి అడుగుపెడుతున్నారు. వ్యాపార రూపం మారిపోయింది. దోపిడీ స్వరూపమూ మారిపోయింది. అడవి మార్కెట్‌కి మరింత దగ్గరయ్యింది. ఇంకోలా చెప్పాలంటే అడవీ మార్కెట్‌గా మారిపోయింది. గిరిజన సంక్షేమ పథకాల్ని గిరిజనేతర కాంట్రాక్టర్ల ద్వారా చేయిస్తూ తిరుగుబాటుని అందంగా అణిచివేస్తోంది రాజ్యం.

మతమైతే... ఈ రోజూ రేపు రాజకీయ నిర్ణయాధికారం చేసినా ఆశ్చర్యపోనక్కరలేదు. అంతలా ఆదివాసీ సంస్కృతిని మాపేసి ఆదివాసుల్ని వశం చేసుకున్నది.

ఈరోజు మా వూళ్ళకు రోడ్లొచ్చాయి. టీవీలొచ్చాయి. సెల్ ఫోన్లొచ్చాయి. పబ్జీ గేములొచ్చాయి. ఇంటర్నెట్ వచ్చింది. కొత్త నాయకులొచ్చారు. కొత్త కొత్త పథకాలొచ్చాయి. సంక్షేమ కార్యక్రమాలొచ్చాయి. వాటికోసం ఎదురుచూసే ఒక కొత్తతరం తయారయ్యింది గ్రామాల్లో. చదువు పూర్తి చేసిన ఆదివాసీ తరం ఆఫీసుల ముందు అప్లికేషన్ల దొంతరలా నిలబడి వుంది. కొత్త ఉపాధిని అర్థం చేసుకోడానికి వలసబాట పట్టింది. చదువుకు తగ్గ ఉద్యోగం లేక సర్టిఫికేట్లు చేత బట్టుకుని పథకాల కోసం ఎదురు చూస్తోంది.

మరోవైపు... ఆ రోజుల్ని తలపించే గ్రామాలు ఇప్పటికీ ఉన్నాయి. డోలీల్లో ప్రాణాలొదులుతున్న మా అక్కచెల్లెళ్ళు, ప్రాణాలొదిలితే పదుల కిలోమీటర్ల మేర శవాన్ని మోసుకుపోయే దారులు, ఒక్క మాత్ర కోసం సెల్ ఫోన్ వెలుగుల్లో గెడ్డ దాటాల్సిన వూళ్ళూ ఉన్నాయి. ఇదొక పారడాక్సికల్ వాస్తవం.

జీవన ప్రమాణాలు పెరగకపోవడంలో మొత్తం యంత్రాంగం లోపమే ఉంటుందా? ఆదివాసుల వైపు నుంచి ఏమీ ఉండదంటారా?

నా 'తాండ్రచుట్ట' కథలో ప్రధాన పాత్ర 'బూగన్న' ఒక మాటంటాడు. "నాకేది సుకమో నువ్వు సెప్పకూడదు. నా సుకం గురిండి నీనే మాట్లాడాల"ని. ఇదెందుకు ఉదహరించేనంటే... యంత్రాంగం పథకాలు రచన చేసినపుడు ఈ మాటని గుర్తుంచుకోవాలని. ఆదివాసుల కోసం ఇది చేసాం, అది చేసాం అని పాలకులు అభివృద్ధి సూచీల్ని వారే రాసుకుని వారే మురిసిపోతుంటారు. కానీ ఆదివాసులకేమి కావాలో ఒక్క ప్రశ్నైనా అడగరు. ఒక బేంక్ మేనేజర్ ఇచ్చే 'లోను' కన్నా షావుకారిచ్చే చేబదులుకే ఆకర్షితుడవుతున్నాడు ఆదివాసీ ఇప్పటికీ. తేడా ఎక్కడుందో తెలుసా? నేస్తరికం! అవసర సమయానికి అందుబాటు! ఈ పేరుతోనే ఆస్తుల్నీ, శ్రమనీ, సంపదనీ వదులుకున్నాడేమోగాని, ఆత్మాభిమానాన్ని మాత్రం వదులుకోలేదు ఆదివాసీ. అలాగని పథకాల దుర్వినియోగం జరగడం లేదని చెప్పను. అటు యంత్రాంగమూ, ఇటు ఆదివాసీ సమన్వయంతో పని చేస్తే ఫలితం వుంటుంది.



గిరిజన ఫలాలు అనుభవిస్తూ తిరిగి ఆ సమాజానికి అండగా నిలబడకుండా పోతున్న 'అస్మదీయుల' విధానంపై మీ స్పందన?

ఇది బాధ్యతకి సంబంధించిన ప్రశ్న. ఏ నేల నిన్నిలా నిలబెట్టిందో, ఏ శ్రమ ఫలితం మనల్నిలా బతకనిస్తున్నదో దానిపట్ల కృతజ్ఞతతో లేకపోతే ఎట్లా? ఇది ఆదివాసీ సమాజానికి మాత్రమే సంబంధించినది కాదు. ఇది అందరికీ వర్తిస్తుంది.

గిరిజనేతరులు చేసిన రచనలకి గిరిజనుడిగా మీరు చేస్తున్న రచనలకి మధ్య సారూప్య – వ్యత్యాసాలు ఉంటాయా?

సహానుభూతికి, స్వీయానుభూతికి మధ్య ఉన్న తేడా అది. ఇతరులు రాసిన ఆదివాసీ రచనకీ నా రచనకి సారూప్యత ఉండొచ్చు కానీ వ్యత్యాసం కూడా స్పష్టంగా కనిపెట్టగలడు పాఠకుడు. అనుభవించి రాసిన రాతకి, సమాచార సేకరణ రచనకీ తేడా వుంటుంది. నేనూ కొన్నిచోట్ల అవుట్ సైడర్‌గానే కనపడతాను. జీలుగు కల్లు తాగి, కంకపట్టి కొండ తువ్విన చేతుల్తో రాసిన రాత ఖచ్చితంగా ప్రత్యేకంగానే వుంటుంది.

ITDA, GCC వంటి సంస్థలు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నాయి. ఓ గిరిజనుడిగా వారి శ్రమ ఎంతవరకు ప్రతిఫలిస్తుంది?

ఈ రెండు సంస్థలూ ఉద్యమాల ఫలితంగా ఏర్పడ్డాయి. ఇవి చాలావరకు ఆదివాసుల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులకు కారణమయ్యేయి. ఆశ్రమ పాఠశాలలు, జీసీసీ చౌక దుకాణాలు... చెక్ డాములు, జీడి తోటలూ... రహదారులూ, రవాణా సౌకర్యాలూ... ఇవన్నీ ఆదివాసీ జీవితాల్లో మార్పులకు కారణమయినవే. కానీ, ఈ రోజు వాటి లక్ష్యాలు మార్చుకోవాల్సి ఉంది. వాటిని బలోపేతం చెయ్యాలనే నేటి ఉద్యమ నినాదమే రుజువు అవి నిధుల సమస్యతో కొట్టిమిట్టాడుతున్నాయనడానికి. అవి స్వతంత్రంగా నిలబడగలిగి మునుపటిలా ఉద్యోగ ఉపాధి కల్పన చేపట్టగలిగితే వాటి శ్రమ ఫలించినట్టవుతుంది.

కొన్ని తెగలు కొండ దిగి రాలేదు. కొన్ని సేవలు 'కొండ'ను ఎక్కలేదు. మీరు గమనించిన కారణాలు?

అన్ని సేవలూ అందరికీ సమానంగా అందాలి. అది ప్రజాస్వామ్యం. స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న ఈ రోజుల్లో... డోలీ మోతలు కానరావడం దురదృష్టకరం. కొండ చూపుడు వేలి మీద ఇండెలిబుల్ ముద్రతో కుర్చీ ఎక్కిన నువ్వు సేవలందించడానికి కొండెక్కనంటే ఎలా?

అక్షరాస్యత వేరు. విద్యా సాధికారత వేరు. గిరిజన యువత సాధికారత వైపు అనుకొన్న స్థాయిలో రాణించకపోవడానికి ఓ ఉపాధ్యాయుడిగా మీరు గుర్తించిన కారణాలు?

విద్య సగటు మానవ జీవితావసరాల్ని తీర్చగలిగేదై ఉండాలి. మానవ జీవితావసరాల్లో ఆదివాసీ జీవితావసరాలు వేరు. ఆదివాసీ ప్రజల కోసం ప్రత్యేక ప్రణాళికలున్నట్టే ఆదివాసీ పిల్లల కోసం ప్రత్యేక పాఠ్య పుస్తకాలు, సిలబస్ వుండాలి. ఉదాహరణకు సగటు మామూలు విద్యార్థికి తెలుగు మాతృభాష కాబట్టి అది ఫస్ట్ లాంగ్వేజ్ అవుతుంది. అదే ఆదివాసీ విద్యార్థికి తెలుగు సెకెండ్ లాంగ్వేజ్. తన స్థానిక మాతృభాష వేరు కాబట్టి. పాఠశాలలోకి చేరేసరికి వాడు తెలుగు నేర్చుకోవడానికి సాధారణ సమయం కంటే ఎక్కువ పడుతుంది. అంటే మామూలు విద్యార్థి కంటే వెనకబడిపోతాడు. స్కూలింగ్ పూర్తయ్యే సమయానికి ఆదివాసీ విద్యార్థి అక్షరాస్యత వద్దకు చేరుకుంటే సాధారణ విద్యార్థి సాధికారత వైపు దూసుకుపోతాడు.

కొన్ని తెగల్లో 'తొలి ప్రభుత్వ ఉద్యోగి' అన్న ఖాతా తెరవలేదు. గిరిజనుల్లో కూడా వర్గీకరణ వాదన రాబోతుందా?

రావాలి. ఆదివాసీ తెగల్లో కూడా ఆర్థిక అసమానతలకు అసలు కారణం హయరార్కీయే. ఈ వర్గీకరణవాదం లేకపోవడం వల్లనే ఇతర కులాల్ని గిరిజన కులాల్లో కలిపి అందాల్సిన వారికి అందకుండా, ఉన్నవాటిని పలచన చేసే కుట్రలూ జరుగుతున్నాయి.

సంభాషణ : సారిపల్లి నాగరాజు, మదన మోహన్ రెడ్డి,
పరిశోధక విద్యార్థులు,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 80083 70326.

'ఒకసారి సరి చూసుకోండి...'

డెబ్బయ్యో దశకంలో ఓ బాపు కార్టూన్... ఒక రచయిత్రి కోపంగా పోస్ట్‌మాన్‌పై విరుసుకు పడుతూంటుంది... అతను బిక్కమొహం వేసుకుని "మీ కథల్ని పత్రికల వాళ్లు తిరగ్గొడితే, నా తప్పేంటి అమ్మా?" అని అంటుంటాడు.

రచయితకి వచ్చిన ప్రతి ఊహా రచనగా రూపొందదు. అలాగే ప్రతి రచనా ప్రచురణకు నోచుకోదు. కొన్ని రచనల్ని పత్రికలు తిప్పి పంపుతూ వుంటాయి. వాటికి ప్రచురణార్హత లేకపోవడమే దీనికి కారణం. ఇందుకోసమే రచనతో పాటు స్టాంపులు అంటించిన సొంత చిరునామా రాసిన కవర్లని పంపమని పత్రికలు రచయితలకి సూచిస్తూ వుంటాయి.

ఇలా పత్రికలు కొన్ని రచనల్ని తిప్పి పంపడానికి కారణాలు అనేకం. ఒక రచనలోని వస్తువు సంపాదకునికి నచ్చకపోవడమో, అంశం నచ్చినా శైలీ లోపమో లేదా అల్ప శిల్ప స్థాయో కారణం కావొచ్చు. రచనలోని అంశం పత్రిక పాలసీకి విరుద్ధంగా వుంటే సహజంగానే ప్రచురించరు. అలాగే తమ పత్రిక ప్రమాణాలను ఆ రచన అందుకోలేనప్పుడు ప్రచురణకు స్వీకరించలేరు. కొన్ని సందర్భాల్లో సైద్ధాంతిక సమస్య కూడా కారణం కావొచ్చు. చాలా సందర్భాల్లో పత్రికలు 'స్థాయి' తక్కువ వున్న రచనల్ని తిప్పి పంపుతూ వుంటాయి. ఒక్కోసారి దీనికి విరుద్ధమైన ఉదంతాలు కూడా వుండొచ్చు.

ప్రఖ్యాత రచయిత శ్రీ భమిడిపాటి రామగోపాలం తన ఆత్మకథ 'ఆరామ గోపాలం'లో ఒక సంఘటనను ఉదహరించారు. ఆయన కొన్నాళ్లు ఆంధ్రజ్యోతి వారపత్రికలో పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారికి సహాయకుడిగా వున్నారు. ఆ రోజుల్లో ప్రఖ్యాత రచయిత త్రిపుర ఒక కథని పంపారు. జ్యోతి వారు ఆ కథని తిప్పి పంపుతూ "ఈ పత్రిక 'స్థాయి'ని మించి వున్న కారణంగా ప్రచురించలేకపోతున్నందుకు చింతిస్తున్నాం" అన్న కామెంటు పెట్టారట.

సాధారణంగా వర్ధమాన రచయితల రచనలు పత్రికల నుంచి ఎక్కువగా తిరిగి వస్తూ వుంటాయనే భావన వుంది. ఇందులో నిజం లేకపోలేదు. అయితే కొందరు ప్రసిద్ధ రచయితల రచనలూ తిరిగొచ్చిన సందర్భాలు అనేకం. "ఐ టూ హేవ్ రిజెక్షన్ స్లిప్స్" అన్న మాట ఎవరో సామాన్య రచయితది కాదు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ రచయిత ఆర్కే నారాయణ్ చెప్పిన మాట ఇది. కొత్త రచయితలు ఈ తిరుగుటపాల్ని చూసి, తమ రచనలు ప్రచురణ కాకపోవడం చూసి, డీలా పడిపోకూడదు. ఇంకా సాధన చెయ్యాలనే సందేశం వీటిలో చూసుకోవాలి. మరోసారి రచనను జాగ్రత్తగా పరిశీలించి లోపాల్ని కనుక్కోవాలి. సీనియర్ల సలహాలను స్వీకరించాలి. సంస్కరించుకుని మరో పత్రికకి పంపాలి.

'లోకో భిన్న రుచిః' అన్నట్టు ఒక పత్రిక వారు తిప్పి పంపిన కథ మరో పత్రికలో బహుమతి పొందిన సందర్భాలూ వున్నాయి. అప్పుడప్పుడు రచన పత్రికల వారికి నచ్చీ, వేరే కారణాల వల్ల వేయలేని పరిస్థితులు వుంటే, ఆ రచన పట్ల లేదా రచయిత మీద గౌరవంతోనో పత్రికల వారే పోస్టేజి భరించి అలాంటి రచనల్ని రచయితకి తిప్పి పంపిన సందర్భాలూ వుంటాయి. ఇలాంటి ఘటన నా స్వానుభవంలో వుంది. ఒక ప్రముఖ వారపత్రిక నా కథని భద్రంగా తిప్పి పంపింది, తిరుగుటపా పెట్టకపోయినా.ఒక ప్రసిద్ధి వారపత్రిక రచన అందగానే రచయితకి ఓ ప్రింటెడ్ కార్డు పంపేది. ఆ కార్డు ఆకుపచ్చ రంగులో వుంటే, దాన్ని చూడగానే ఆ రచన ప్రచురణకు స్వీకరించినట్టు తెలిసిపోయేది. అదే నారింజ రంగులో వుంటే సెలెక్టు కాలేదని అర్థం. ఇప్పుడు పత్రికలు "ఈ–మెయిళ్ల" ద్వారా రచనల్ని స్వీకరించిందీ లేనిదీ తెలియజేస్తున్నాయి. అయితే పత్రికల నుంచి 'మేఘ' సందేశాలు ఖచ్చితంగా వస్తున్నట్టు కనిపించదు. కరోనా అనంతరం పత్రికా రంగంలో వచ్చిన మార్పులు, సిబ్బంది తగ్గిపోవడం తదితర కారణాల వల్ల ఈ విషయాన్ని పత్రికలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇప్పుడు డిజిటల్ పత్రికలు ఎక్కువయ్యాయి. ఇవి వచ్చిన రచనల్ని వచ్చినట్టు వేసుకుంటున్నాయని చాలామంది భావన. వీటి దృష్టిలో రచనలు అంటే స్పేస్ ఫిల్లర్లు. అంచాత రచనలు తిరిగి రావడం అన్నది తగ్గిపోయింది.

తిరిగొచ్చే రచనల్ని వస్తువుగా తీసుకుని ఈ వ్యాస రచయిత 'పెంపుడు పావురాళ్లు' అన్న కవితాత్మక శీర్షికతో ఓ కథని రాశాడు. ఓహ్... అది తిరిగి రాలేదు. ఒక దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురణ అయ్యింది. పెంపుడు పావురాళ్లు పగలంతా ఎక్కడ తిరిగినా సాయంత్రానికి బుద్ధిగా తిరిగొచ్చేస్తాయి కదా!

ప్రచురణార్హతే ఒక రచన విలువను నిర్ణయించే గీటురాయి. ప్రచురణే రచనకు రాజముద్ర! రచన పట్ల సంపాదకుని దృష్టికోణం వేరుగా వుంటుంది. రోగి నాడిని చూసి ఆరోగ్య స్థితిని నిర్ణయించే వైద్యుడిలా రచన 'స్థితి'ని ఎడిటర్జీ నిర్ణయిస్తాడు. మనం ఫోనులో నెంబరును తప్పుగా కొట్టినప్పుడు "మీరు డయల్ చేసిన నెంబర్‌ని ఒకసారి సరి చూసుకోండి" అన్న వాయిస్ మెసేజ్ వస్తుంది. రచయితలకు తిరిగొచ్చే రచనలు ఇచ్చే సందేశం కూడా సరిగా ఇదే!

– ఎస్. హనుమంతరావు, 88978 15656

'మట్టి మనిషి' విలువను చాటిన నాటకం

నాటకంలో ఒక సన్నివేశం

మట్టికీ మనిషికీ, మరీ ముఖ్యంగా మట్టికీ – రైతుకీ ఉన్న అనుబంధం అందరికీ తెలిపిందే!

వాసిరెడ్డి సీతాదేవి గారి సుప్రసిద్ధ నవల మట్టి మనిషిని సీనియర్ కథా నాటక రచయిత వల్లూరి శివప్రసాద్ నాటకీకరించగా, గత బుధవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిభా ఎన్సెంబుల్ థియేటర్ వారు ప్రదర్శించారు. ఒక అర్ధ శతాబ్ది క్రితం ఒక వార పత్రికలో ధారావాహికగా వచ్చి, 2000లో పుస్తకంగా వచ్చి 14 భారతీయ భాషల్లోకి అనువాదం అయిన నవల ఇది. విశేష పాఠకాదరణ, పలు ముద్రణలు పొందిన నవల మట్టి మనిషి. తెలుగు నవలా చరిత్రలోనే ఒక విశిష్ట స్థానం గల నవల ఇది.

ఐదవ తరగతి వరకే చదువుకున్న సీతాదేవి హిందీలో సాహిత్యరత్న వరకు చదువుకొని బాలభవన్ డైరెక్టర్‌గా సెన్సార్ బోర్డు మెంబర్‌గా, ఐదుసార్లు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు పొందిన ఉత్తమ రచయిత్రిగా పేరుప్రఖ్యాతులు పొందారు. తన 'మరీచిక' నవలను ప్రభుత్వం నిషేధిస్తే, కోర్టు ద్వారా ఆ నిషేధాన్ని ఎత్తి వేయించిన గొప్ప ధైర్యవంతురాలైన రచయిత్రి ఆమె.

ఇంతకుముందు ఏ మాధ్యమంలోనైనా ఈ నవలను దృశ్య కావ్యంగా చూపించడానికి ప్రయత్నించారో లేదో కానీ అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. వాసిరెడ్డి సీతాదేవి మెమోరియల్ ట్రస్ట్, శివప్రసాద్, దర్శకురాలు నస్రిన్ ఇషాక్ ల పూనికతో ఇదిప్పుడు రంగస్థలం మీద మొదటిసారిగా ప్రదర్శించబడింది. గతంలో మైదానం, పాకుడు రాళ్లు నవలలను ఉర్దూ, హిందీ భాషల్లో రంగస్థల ప్రదర్శనలను కళాత్మకంగా తీర్చిదిద్దిన ఈ దర్శకురాలు మళ్లీ తనదైన శైలిలో ఈ నవలను సాకారం చేశారు.

ఒక బృహత్ నవలను వీలైనంత ఎక్కువగా రంగస్థలంపై చూపించాలని నాటక అనువాదకర్త, దర్శకురాలు భావించడంతో దాదాపు 2 గంటల 45 నిమిషాల పాటు అతి వేగంగా నాటకం నడుస్తుంది. రంగస్థలాన్ని ఒక 'ఎలివేటెడ్ స్టేజ్' (అది పొలం గట్టు లేదా నడకదారిగా భావించవచ్చు) దాని కింద ప్రధాన రంగస్థలం వేదికగా రంగాలంకరణతో సన్నివేశాలు జరుగుతాయి. పాత్రల దుస్తులు, మేకప్, లైటింగ్, సంగీతం చాలా మినిమల్‌గా ఉంచారు దర్శకురాలు.

ఒక గంట పాటు నాటకం లేదా ఒక నాటికనే ప్రేక్షకులు చూడటానికి కరువౌతున్న రోజుల్లో రెండున్నర గంటల నాటకం చూస్తారా? అన్న సందేహం అవసరం లేదు. సమగ్రమైన విలువలతో కూడిన ప్రయోగ ప్రదర్శనలను చిన్నబుచ్చి నిరాదరించిన సందర్భాలు లేవు. నిర్మాతలు సహకరిస్తే, నవలలో ఉన్న ప్రాణం పటుత్వం, విస్తృతి ప్రేక్షకుడు అనుభవిస్తే ప్రశంసిస్తాడు. ఒక సినిమా హాలు

ప్రపంచీకరణకు ముందు, ఆ సమయంలో, అటు తరువాత భూమితో మనిషి అవసరాలు ఎలాగ ఎంతగా పెరిగాయో ఎన్ని రకాలుగా నేల ఒక వినియోగ వాణిజ్య సాధనంగా రూపం మార్చుకుంటూ వస్తున్నదో మనకు తెలుసు.

అన్నం పెట్టే పంట భూమి నుంచి ఒక వినోద వ్యాపార అవసరంగా మార్పులు చెందుతూ సినీ మహళ్లుగా షాదీ ఖానాలుగా నగలు వస్త్ర సమస్త అవసరాలు తీర్చే వాణిజ్య ప్రపంచంగా అవి మారిపోయి జనజీవన విధానం, అభిరుచులు, అల్ట్రా మోడర్న్ పోకడలకు ఆకరమైన తీరును చూస్తూనే ఉన్నాం.

ఒక పల్లె రైతు కుటుంబంలో సామాన్య రైతు సాంబయ్య భూస్వామి కావాలనే కోరికతో మానవ సంబంధాల కంటే తన వ్యవసాయ భూమిని ఎకరాలు ఎకరాలుగా విస్తరింప చేసుకోవడంలో భార్యని, కొడుకును, బంధుత్వాలను పెద్దగా పట్టించుకోడు. ఒక పెద్ద వ్యవసాయ కుటుంబంతో వియ్యమందుకోవడం తను సాధించిన ఘనకార్యంగా భావిస్తాడు, అదీ భూములు కొనుగోలులో తనకు సహకరించిన ఒక దళారి సహాయంతో. ఇక్కడ వరకు కథ ఇలా నడిస్తే ... రెండవ ప్రధాన భాగం కొడుకు వెంకటపతి, కోడలు వరూధిని వైవాహిక జీవితంలో వచ్చే మార్పులు. చివరగా సర్వం కోల్పోయిన వెంకటపతి తండ్రికి, గ్రామస్తులకు మొహం చూపించలేక పట్నంలో చదువుకుంటున్న తన కొడుకును మళ్ళీ తండ్రి దగ్గరకే వ్యవసాయం చేసుకు బతకమని పంపడంతో ముగుస్తుంది, నాటకం.

అది ఒక మట్టి మనిషి జీవితంలో చోటు చేసుకున్న పెను విషాదం. ప్రేక్షకుడి కళ్ళను చెమ్మగిల చేసి హృదయాన్ని భారం చేస్తుంది. నిజానికి ఈ నవలకు మరింత న్యాయం జరగడానికి ప్రతి సీనుతో ప్రేక్షకుడు అనుసంధానం కావడానికి, నాటక నడక కొంత వేగం తగ్గించుకోవడానికి, వరూధిని ఆ కుటుంబంలో ప్రవేశించి అన్ని విధాలా ఆమె పతనమై మందుకు బానిసై ఈలోకం నుంచి నిర్గమించే వరకు రెండవ భాగంగా కొంత విరామం ఇచ్చిన తర్వాత నడిపిస్తే ఒక కన్యాశుల్కం, ఒక పడమటి గాలి వలె ఇప్పుడు ఈ మట్టి మనిషి చరిత్రగా నిలిచిపోతుంది.

యజమానురాలు కావడంతో మొదలుపెట్టి ఆ వ్యాపారాన్ని విస్తరించుకుంటూ పైపైకి ఎదిగే క్రమంలో వరూధిని జీవితంలో నైతిక విలువలను వదిలేసి పతనం దిశగా ప్రయాణం మొదలై వంచనకు గురై సర్వం కోల్పోతుంది. తాగుడుకు పూర్తిగా బానిసై ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి పరాజితురాలిగా మృత్యువుకు తనను తాను అర్పించుకుంటుంది.

చదువుకున్న భార్య చేతిలో కీలుబొమ్మై, భార్య అలవాటు చేసిన మందుకు బానిసై, వ్యక్తిత్వం అనే వెన్నెముక లేనివాడై, నిస్సహాయ నిర్వీర్యుడై, కొడుకును అతడి తాతకు అప్పగించి తన జీవితానికి తెరదించుకోవాలనుకుంటాడు వెంకటపతి. తాత మార్గదర్శకత్వంలో అనువంశికంగా వస్తున్న వ్యవసాయాన్ని ఆ మనుమడు తన లేత భుజాల పైకి తీసుకోవడంతో నాటకం ముగుస్తుంది.

ఇది మొదటి ప్రదర్శన కావడం, 35 మందికి పైబడిన నటీనటవర్గంతో, రిహార్సల్స్‌కు తగినంత సమయం దొరకకపోవడం వలన, అత్యధిక భాగం నటీనటులు పూర్తిగా ఔత్సాహికకులే కావడం వలన పూర్తిస్థాయి పరిపక్వ హావభావ నటనా విన్యాసానికి అఘాతం కలిగి ఉండవచ్చు. అందువల్ల ప్రేక్షకులు పూర్తిస్థాయి రసానందానుభూతిని పొందడంలో అవి అవాంతరాలుగా నిలిచాయి.

ఏమైనా ఇటీవల కాలంలో చెప్పుకోదగ్గ ప్రయోగాలు కరువౌతున్న సమయంలో ఈ నాటకం ఒక అచ్చ తెనుగు రైతు కథను ఎలాంటి వక్రీకరణలు లేకుండా, రచయిత్రి సీతాదేవి రాసిన దానిని ఇన్నాళ్లకు రంగస్థల అనువాదం చేసి ఇప్పటి తరం ముందు అప్పటి జ్ఞాపకాలని తాజా చేసింది అని చెప్పుకోవచ్చు. ఇందుకు నిదర్శనం.. రసరంజని వారి నియమం ప్రకారమే ఈ టిక్కెట్టు నాటకాన్ని 500 మందికి పైగా ఉభయ రాష్ట్రాలోని అభిరుచి గల ప్రేక్షకులు తిలకించి, ఈ ప్రదర్శనను విజయవంతం చేయడం. ఈ నాటకం అన్ని ముఖ్య నగరాల్లోనూ ప్రదర్శితం అవుతుందని ఆశిద్దాం.

– మల్లేశ్వరరావు ఆకుల
798187 2655

నియంతృత్వాన్ని ఓడించండి

- భరతమాత బిడ్డగా మీకు విజ్ఞప్తి చేస్తున్నా: అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత

న్యూఢిల్లీ: నియంతృత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని భరత మాత బిడ్డగా మీకు విజ్ఞప్తిచేస్తున్నానని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత ఢిల్లీ ప్రజలనుద్దేశించి అన్నారు. ఆదివారం పశ్చిమ ఢిల్లీ నియోజక వర్గంలో ఆప్ అభ్యర్థి మహాబల్ మిశ్రాకు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన భర్తను ఎవరూ పడగొట్టలేరు, ఆయన ఓ "సింహం" లాంటివారు అని ఆమె పేర్కొన్నారు. కొత్త పాఠశాలల ఏర్పాటు, ఉచిత విద్యుత్ అందించడం, మొహల్లా క్లినిక్‌లు ప్రారంభించినందుకే కేజ్రీవాల్‌ను వారు(బిజెపివారు) జైలులో పెట్టారని అన్నారు. "మీ ముఖ్యమంత్రి సింహం లాంటివారు. ఆయన్ను ఎవరూ పడగొట్టలేరు. ఆయన భారతమాత పుత్రుడు. నియంతృత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని భారతమాత బిడ్డగా నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. " అని సునీత కేజ్రీవాల్ అన్నారు. తప్పుడు కేసులో కేజ్రీవాల్‌ను బిజెపి జైలులో పెట్టించడంతో , ఆయన భార్య ఆప్ ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహిస్తూ రోడ్‌షోలో పాల్గొంటున్నారు. దక్షిణ ఢిల్లీ, న్యూఢిల్లీ నియోజకవర్గాలతో పాటు గుజరాత్, హర్యానా, పంజాబ్‌లలో కూడా సునీతా కేజ్రీవాల్ ఆప్ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోన్న బిజెపి

- శరద్‌పవార్

ముంబయి : బిజెపి నియంతృత్వంతో వ్యవహరిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోందని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ విమర్శించారు. ఆదివారం బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో భాగమైన పూణెలోని సస్వాద్ తహసీల్‌లో నిర్వహించిన ప్రచారంలో శరద్ పవార్ మాట్లాడారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు గతంలో ఎన్నికల కంటే భిన్నంగా ఉన్నాయని చెప్పారు. "ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ని కటకటాల వెనక్కి నెట్టారు. వారు (బిజెపి) నియంతృత్వ మార్గంలో నడుస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు. మన దేశాన్ని రక్షించుకోవడానికి మనం వారిని ఓడించాలి" అని పిలుపునిచ్చారు.

ఎన్‌సిపి (ఎస్‌పి) సిట్టింగ్ ఎంపి, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలెను బారామతి అభ్యర్థిగా ప్రకటించారు. ఆమె మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్‌తో పోటీ పడుతున్నారు. సుప్రియా సూలేకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు శరద్‌పవార్ విజ్ఞప్తి చేశారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడతామని తెలిపారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో నటుడి అరెస్టు

ముంబై : మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో నటుడు సాహిల్ ఖాన్‌ను ముంబై పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మధ్యంతర బెయిల్‌కు ముంబై కోర్ట్ నిరాకరించడంతో సాహిల్ పరారయ్యాడని పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల సహాయంతో 40 గంటలపాటు సాగిన ఆపరేషన్ తర్వాత అరెస్టు చేశామని వెల్లడించారు. ఆదివారం అతడిని ముంబైకి తరలించారు.

నా రూపాన్ని కాదు.. మార్కుల్ని చూడండి

- యుపి టెన్త్ టాపర్ ప్రాచీ నిగమ్

లక్నో : యుపిలో పదవ తరగతి బోర్డ్ పరీక్షల్లో 98.5 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన ప్రాచీ నిగమ్ ఆదివారం తనపై వస్తున్న ట్రోల్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రూపాన్ని కాదని, పరీక్షల్లో తాను సాధించిన మార్కుల్ని చూడాలని అన్నారు. "నా ముఖంపై అవాంఛిత రోమాలు ఉండటం వల్ల నన్ను ట్రోలింగ్ చేస్తున్నారు. నా రూపాన్ని కాదు.. మార్కుల్ని చూడండి" అని బదులిచ్చారు. "చాణక్యుడు కూడా వేధింపులకు గురయ్యారు. అవి అతనిపై ప్రభావం చూపలేకపోయాయి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన వారందరికీ ప్రాచీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మరక్షణలో బిజెపి

- రిజర్వేషన్లను రద్దు చేయబోమని పదేపదే వివరణ
- రాజ్యాంగాన్ని మార్చబోమంటూ వేడుకోలు
- ఒబిసి ఓటు బ్యాంకుకు గండి పడుతుందని ఆందోళన



అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ : మోడీ సర్కారు అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, రిజర్వేషన్లు ఉండబోవని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలతో బిజెపి ఆత్మరక్షణలో పడింది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని బిజెపి మార్చబోదని, రిజర్వేషన్లను రద్దు చేయబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇటీవలే చెప్పారు. పార్టీపై ముప్పేట దాడి పెరగడంతో ఆయనతోపాటు పలువురు బిజెపి నేతలు డిఫెన్స్‌లో పడి పదేపదే వివరణలు ఇచ్చుకుంటున్నారు. ఈ నెల 25న 'ది హిందూ' పత్రిక ప్రతినిధితో రాజ్‌నాథ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. 'రిజర్వేషన్లకు స్వస్తి చెప్పే ప్రసక్తే లేదు. రిజర్వేషన్లు అవసరమని నేను గట్టిగా నమ్ముతున్నాను. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చాల్సిన అవసరమున్నదని కూడా మేము ఎప్పుడూ భావించలేదు' అని తెలిపారు. ఈ నెల 23న మహారాష్ట్రలోని అకోలాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా రిజర్వేషన్లపై పెదవి విప్పాల్సి వచ్చింది. 'బిజెపి అధికారంలో ఉంటే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లు రద్దు కావు' అని చెప్పుకొచ్చారు.

రిజర్వేషన్లను రద్దు చేయడం కోసం రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి ఆలోచిస్తోందని ఇటీవల వార్తలు వచ్చాయి. దీనిపై పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగడంతో బిజెపి నాయకులు వరుసగా వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. బిజెపి ఈ ఆలోచన చేయడానికి కొన్ని బలమైన కారణాలే కన్పిస్తున్నాయి. కేవలం అగ్రవర్ణాల ఓట్లతోనే బిజెపి ప్రభుత్వం ఏర్పడలేదు. 2009 నుండి బిజెపి తన బలాన్ని పెంచుకోవడానికి ఒబిసి ఓట్లే కారణం. బిజెపి ఓట్లలో గణనీయమైన భాగాన్ని సొంతం చేసుకోవడంలో బిజెపి ఏ విధంగా విజయం సాధిస్తోందో సిఎస్‌డిఎస్ గణాంకాలు చెబుతున్నాయి.

ఓట్లు రాలవేమోనని...

2009 ఎన్నికల్లో ఒబిసి ఓట్లలో బిజెపి 17% వాటాను పొందింది. 2019 నాటికి అది 47%కి పెరిగింది. అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వేషన్లను బిజెపి రద్దు చేస్తే ఒబిసి ఓటు బ్యాంకుకు గండి పడుతుంది. అందుకే రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన ఏదీ లేదని బిజెపి నేతలు ముక్తాయింపు ఇస్తున్నారు.

వివాదానికి ఆద్యుడు ఆయనే

రాజ్యాంగాన్ని మార్చాలంటే 400కు పైగా స్థానాలు పొందాల్సి ఉంటుందని బిజెపి నేతలు నిన్న మొన్నటి వరకూ చెబుతూనే ఉన్నారు. ఇప్పుడు వారి నుంచి ఆ మాటే రావడం లేదు. అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను బిజెపి రద్దు చేస్తుందని విమర్శలు రావడం, దీనిపై ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి మద్దతుదారుల్లో నిరసన వ్యక్తం కావడమే దీనికి కారణం. అసలు ఈ వివాదానికంతటికీ కారణం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ వివేక్ దేవ్‌రాయ్. గత సంవత్సరం ఆగస్టు 14న ఆయన ఓ వార్తాపత్రికలో వ్యాసం రాస్తూ నూతన రాజ్యాంగం ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై వివాదం చెలరేగడంతో ప్రధాని ఆర్థిక సలహా మండలి వివరణ ఇచ్చుకుంది. రాజ్యాంగాన్ని మార్చాలన్నది ఆయన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పింది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

దేవ్‌రాయ్ బాటలో హెగ్డే

సాక్షాత్తూ మోడీ నియమించిన వ్యక్తే రాజ్యాంగాన్ని మార్చాలని సూచించడం వివాదాస్పదమైంది. అది కొనసాగుతుండగానే ఈ ఏడాది మార్చి 11న కర్ణాటకకు చెందిన బిజెపి ఎంపీ అనంతకుమార్ హెగ్డే ఓ ప్రకటన చేస్తూ రాజ్యాంగాన్ని మార్చడానికే 400 సీట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. హెగ్డే సంఘ్‌కు సన్నిహితుడు. అధికారి అయిన దేవ్‌రాయ్‌తో పాటు సంఘ్ వ్యక్తి హెగ్డే కూడా రాజ్యాంగాన్ని మార్చాలని అభిప్రాయపడిన నేపథ్యంలో అందుకు బిజెపి ఆమోదముద్ర ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు హెగ్డేకు బిజెపి టిక్కెట్ ఇవ్వలేదు. ఆయన ప్రసంగ వీడియో మాత్రం సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది.

వీరు కూడా...

కాంగ్రెస్ నుంచి ఇటీవలే బిజెపిలోకి ఫిరాయించిన జ్యోతి మీర్ధా ఈ నెల 2వ తేదీన ఓ బహిరంగ సభలో తేనెతుట్టెను మరోసారి కదిల్చారు. రాజ్యాంగంలో మార్పులు చేయాలంటే తమ పార్టీకి భారీ మెజారిటీ అవసరమని ఆమె చెప్పారు. మీర్ధాపై కాంగ్రెస్ విమర్శలు సంధించడంతో ఆమె మౌనం వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ నియోజకవర్గం నుండి రెండుసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన లల్లూ సింగ్ కూడా నూతన రాజ్యాంగంపై మాట్లాడారు. ఆయన అయోధ్య శాసనసభ నియోజకవర్గానికి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేశారు. రాజ్యాంగాన్ని మార్చాలన్నా లేదా నూతన రాజ్యాంగాన్ని రూపొందించాలన్నా మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమని లల్లూ సింగ్ అన్నారు. మిల్కీపూర్ శాసనసభ నియోజకవర్గంలో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. గత రెండు నెలల కాలంలో రాజ్యాంగంపై మాట్లాడిన నాయకుల్లో ఆయన మూడో వారు.

రాజ్యాంగంలో ఇప్పటికే అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, వాటిలో ఎలాంటి ప్రమాదము లేదని మీరట్ నుండి బిజెపి అభ్యర్థిగా పోటీచేస్తున్న అరుణ్ గోవిల్ ఈ నెల 15న చేసిన వ్యాఖ్యకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. మార్పు అనేది అభివృద్ధికి సూచిక అని, అది తప్పేమీ కాదని కూడా ఆయన చెప్పారు.

ఆది నుంచీ అదే వైఖరి

రాజ్యాంగం పైన, రిజర్వేషన్ల పైన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల ట్రాక్ రికార్డును ఓసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్లను సమీక్షించాల్సిన అవసరం ఉన్నదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ 2015లో 'పాంచజన్య' పత్రికలో రాసిన వ్యాసంలో అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో భారతీయత లేదని ఆర్‌ఎస్‌ఎస్ అధికార పత్రిక పాంచజన్య 1949లోనే ఆగ్రహం వ్యక్తం చేసింది.

బిజెపి, బిజెడి కలిసే ఉన్నాయి : రాహుల్‌గాంధీ

భువనేశ్వర్ : ఒడిశాలో విడివిడిగా పోటీ చేస్తున్నప్పటికీ బిజెపి, బిజెడి కలిసే ఉన్నాయని రాహుల్‌గాంధీ విమర్శించారు. కేంద్రపాడ లోక్‌సభ నియోజకవర్గంలోని సాలిపూర్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. మోడీ, నవీన్ పట్నాయక్ చేతులు కలిపారని, కొంతమంది బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చారని విమర్శించారు. రాష్ట్రాన్ని అదానీకి అప్పగించారని అన్నారు. రాష్ట్రంలో బిజెడి, బిజెపి భారీ కుంభకోణాలకు పాల్పడ్డాయని అన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులు ప్రజల ఆస్తులేనని, రూ.9 లక్షల కోట్ల ఖనిజ సంపదను దోచుకున్నారని విమర్శించారు. రూ.20 వేల కోట్ల మేర భూములు లాక్కున్నారని, రూ.15 వేల కోట్ల ప్లాంటేషన్ కుంభకోణం జరిగిందని చెప్పారు. పేదలు, రైతుల కోసం పనిచేసే కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు ప్రమాదకరం : మోడీ

బళ్లారి : కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు దేశానికి, కర్ణాటకకు ప్రమాదకరమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. కర్ణాటకలోని బళ్లారి, బెళగావి తదితర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాటాడారు. కాంగ్రెస్ రాజకీయ లబ్ధికోసం ఎంతకైనా తెగిస్తుందని, నిషేధానికి గురైన పిఎఫ్‌ఐ కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ యువరాజు రాజులు, మహారాజులను అవమానించారని, నవాబులు, నిజాంలు, సుల్తానుల అరాచకాలపై మౌనంగా ఉన్నారని అన్నారు.

ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని దేశ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించి పుస్తకాలను కాంగ్రెస్ రాయించిందని అన్నారు. ఇండియా బ్లాక్ గెలిస్తే, ప్రధానిగా ఒక్కొక్కరూ ఒక ఏడాది చొప్పున పరిపాలించే ఫార్ములాను రూపొందించిందని మరోసారి ఆరోపణలు గుప్పించారు. అటువంటి వ్యవస్థతో దేశానికి మంచిని ఆశించలేమన్నారు.

గాజాలో దారుణ మారణకాండపై ఆరని ఆగ్రహ జ్వాలలు

నిర్బంధాన్ని ఎదిరించి ముందుకు సాగుతున్న అమెరికాలోని యూనివర్సిటీ విద్యార్థులు



వాషింగ్టన్ : గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతపై అమెరికాలో రగిలిన ఆగ్రహ జ్వాలలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. పాలస్తీనాపై దురాక్రమణకు పాల్పడుతూ, దారుణ మారణకాండకు కారణమవైన యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు యూనివర్సిటీ నిధులను మళ్లించడాన్ని ఆపాలని, ఆయుధాలు, నిధుల సరఫరాకు తక్షణమే స్వస్తి పలకాలని కోరుతూ గత కొన్ని రోజులుగా అమెరికా అంతటా యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలతో అమెరికా అట్టుడుకుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ తీవ్రతరమవుతున్న ఈ ఉద్యమం రెండు ప్రధాన పాలకవర్గ పార్టీల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. క్యాంపస్‌లలో గుడారాలు వేసుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బైడెన్ ప్రభుత్వం పెద్దయెత్తున నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసింది. కొందరిని క్యాంపస్ నుంచి బహిష్కరించింది. పోలీసులను పెద్దయెత్తున మోహరించి నిరసన గుడారాలను బలవంతంగా తొలగించేందుకు యత్నించింది. విద్యార్థులపై పోలీసులు పిప్పర్ బాల్స్, టియర గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. ఇటువంటి వాటికి తాము భయపడేది లేదని, పాలస్తీనాపై దురాక్రమణను, ఊచకోతను ఆపాలన్న డిమాండ్‌పై తాము తగ్గేదే లే అని విద్యార్థులు స్పష్టం చేశారు. నిర్బంధాన్ని ఎదిరించి వీరోచితంగా పోరాడుతున్న అమెరికన్ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రపంచ నలుమూలల నుంచి మద్దతు లభిస్తోంది. అమెరికా విద్యార్థుల పోరాటానికి మద్దతుగా శుక్రవారం ఎమెన్ రాజధాని సనా స్క్వేర్‌లో భారీ మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో లక్షలాది మంది యెమెన్ ప్రజలు పాల్గొని ఇజ్రాయిల్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా నినదించారు. ఫ్రాన్స్‌లో కూడా వీరికి సంఘీభావంగా ప్రదర్శనలు జరిగాయి. ఆఫ్రికా, ఆసియా దేశాల నుంచి కూడా వీరి పోరాటాన్ని అభినందిస్తూ సందేశాలు వస్తున్నాయి.

ఈ ఆందోళనలకు ప్రధాన కేంద్రంగా ఉన్న కొలంబియా యూనివర్సిటీలో నిరసన శిబిరాలను ఖాళీ చేయించాలని చూసిన పోలీసులకు విద్యార్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. యేల్, న్యూయార్క్, మిచిగాన్, ఓహియో, హోస్టన్, సదరన్ కాలిఫోర్నియా, ఇలా అన్ని యూనివర్సిటీలు నిరసనలతో హోరెత్తుతున్నాయి. ఈ నిరసనల్లో పాల్గొన్నందుకు భారత సంతతికి చెందిన విద్యార్థిని శివలింగమ్‌ను యూనివర్సిటీ నుంచి యాజమాన్యం సస్పెండ్ చేసింది. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఆమె పాలస్తీనా ప్రజలకు తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. గాజాలో ఇజ్రాయిల్ దారుణ మారణకాండకు అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇద్దరూ బాధ్యులేనని నిరసనకారులు విమర్శిస్తున్నారు. వీరి మద్దతుతోనే నెతన్యాహు 25వేల మంది మహిళలు, పిల్లలతో సహా 34వేల మంది అమాయక పౌరుల ప్రాణాలు తీశాడని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అట్లాంటాలోని ఎమోరా యూనివర్శిటీలో శాంతియుతంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై యాజమాన్యం ఆదేశాలతో పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ దృశ్యాలు తన యుక్తవయసులో గ్వాటెమాలాలో జరిగిన అంతర్యుద్ధాన్ని గుర్తుకు తెస్తున్నాయని ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఎమిల్ కెమె తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులను పోలీసులు రబ్బరు బుల్లెట్లు, వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఇదంతా చూస్తుంటే తాము యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్నానా, లేక యుద్ధ ప్రాంతంలో ఉన్నామా అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. వీరికి మానవ హక్కుల గ్రూపులు, ప్రతిఘటనా బృందాలు, వామపక్ష, ప్రజాతంత్రవాదులు సంఘీభావంగా నిలిచారు.

గాజాలోని పాలస్తీనియన్లకు సంఘీభావంగా విద్యార్థులు ఈ నిరసనలు చేపడుతున్నారు. ఇజ్రాయిల్‌తో ముడిపడి ఉన్న అంశాలు, గాజాలో యుద్ధానికి ఆజ్యం పోసే ఆయుధాలకు యూనివర్శిటీలు ఫండ్స్ నిలిపివేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బ్లాక్‌రాక్, గూగుల్, అమెజాన్ క్లౌడ్ సర్వీస్, లాక్‌హీడ్ మార్టిన్, ఎయిర్‌బిఎన్‌బిలు నిధులను మళ్లిస్తున్నట్లు తెలిపాయి.

ఇద్దరు మహిళా ప్రొఫెసర్లపై పోలీసుల దాష్టీకానికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వారిలో ఒకరిని పోలీస్ అధికారులు నేలపై పడేసి చేతులు వెనక్కి కట్టేసిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

అట్లాంటా పోలీసులు, జార్జియా ట్రూపర్లు సంయుక్తంగా యూనవర్శిటీలో ఏర్పాటు చేసిన శిబిరాలను ధ్వంసం చేశారు. క్యాంపస్‌లో ప్రవేశించిన నిమిషాల వ్యవధిలోనే 28 మందిని అరెస్టు చేశారు.

పశ్చిమ బెంగాల్ దక్షిణ కోల్‌కతా ప్రచార ర్యాలీలో అభివాదం చేస్తున్న సిపిఎం అభ్యర్థి సైరా షా హలీమ్, చిత్రంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ తదితరులు

బెంగాల్‌లో సిపిఎం విస్తృత ప్రచారం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ దక్షిణ కోల్‌కతా సిపిఎం అభ్యర్థి సైరా షా హలీమ్‌కు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. జాదవ్‌పూర్‌లో సృజన్ భట్టాచార్యకు మద్దతుగా ర్యాలీ చేశారు. ఈ ర్యాలీల్లో ఎర్రజెండాలు, దివిటీలు పట్టుకుని యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ తదితరులు అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీలకు హాజరయ్యారు.

జాదవ్‌పూర్‌లో శ్రీజన్ భట్టాచార్యకు మద్దతుగా కాగడాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్యకర్తలు

హెరాయిన్ తరలిస్తున్న పాకిస్థానీయులను అదుపులోకి తీసుకున్న ఐసిజి అధికారులు

గుజరాత్ తీరంలో రూ.600 కోట్ల డ్రగ్స్ పట్టివేత

న్యూఢిల్లీ : దేశంలో మరో అతిపెద్ద డ్రగ్స్ రాకెట్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్), ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసిజి), నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) సంయుక్తంగా పట్టుకున్నాయి. ఎటిఎస్, ఐసిజి నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.600 కోట్ల విలువైన 86 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. 14 మంది పాకిస్థానీలను అరెస్టు చేశాయి. కొందరు గుర్తుతెలియని వ్యక్తులకు ఈ సరుకును అప్పగించి, అక్కడి నుంచి శ్రీలంకకు తరలించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించినట్లు ఎటిఎస్ అధికారులు తెలిపారు. తదుపరి విచారణ కోసం కేసును నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి)కి అప్పగించినట్లు డిజిపి వికాస్ సహాయ్ మీడియాకు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తులకు పాకిస్తాన్ ఫిషింగ్ బోట్ మాదక ద్రవ్యాలను అందజేస్తుందని ఎటిఎస్ నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో, ఎటిఎస్, ఐసిజి, ఎన్‌సిబి సంయుక్తంగా శుక్రవారం ఫోర్‌బందర్‌కు 180 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానిత పడవను అడ్డగించాయి. ఆ పడవలోని వారు హెరాయిన్ ప్యాకెట్లను సముద్రంలోకి విసిరేయడం ప్రారంభించారు. అనంతరం కాల్పులు జరపడంతో, ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పడవ కెప్టెన్ నజీర్ హుస్సేన్ కుడిచేతికి బుల్లెట్ గాయమైంది. బలూచిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్ మాఫియా హాజీ అస్లాం అలియాస్ బాబు బలోచ్ ఈ డ్రగ్స్‌ను పంపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఎటిఎస్ తెలిపింది. గత మూడేళ్లలో వివిధ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన 11వ ఆపరేషన్‌గా పేర్కొంది.

ఇటీవల గుజరాత్, రాజస్థాన్‌లో రహస్యంగా డ్రగ్ ల్యాబ్‌లు నడుపుతున్నట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో గుర్తించి, దాడులు నిర్వహించింది. ఈ ప్రాంతంలోని మూడు తయారీ కేంద్రాల నుంచి సుమారు రూ.300 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే గుజరాత్ తీరంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడటం గమనార్హం.

మణిపూర్‌లో మరోసారి కాల్పులు

ఇంఫాల్ : మణిపూర్‌లో ఆదివారం మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ఆదివారం ఉదయం కుకీ, మెయితీ గ్రూపులకు చెందిన వాలంటీర్ల మధ్య కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. కాంగ్‌పోక్పీ జిల్లా కౌత్రుక్ గ్రామంపై కొండపై నుంచి సాయుధ దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని చెప్పారు. కొన్ని బుల్లెట్లు గ్రామస్తుల ఇళ్లను నాశనం చేశాయన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా తయారయ్యే పంపి అని పిలిచే మోర్టార్ షెల్స్‌ను గ్రామంపై ప్రయోగిస్తున్నారని పోలీసులు చెప్పారు. ఈ కాల్పుల్లో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆ ప్రాంతంలో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ఈనెల 26న ఇంఫాల్ తూర్పు సరిహద్దులోని సినామ్ కోమ్ గ్రామంలో రెండు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో 33 ఏళ్ల గ్రామ వాలంటీర్ మరణించిన సంగతి తెలిసిందే.

ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ అర్విందర్‌సింగ్ రాజీనామా



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ యూనిట్ అధ్యక్షుడు అర్విందర్‌సింగ్ లవ్లీ తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరడం లేదని తెలిపారు. తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన రాజీనామా లేఖను పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీతో భాగస్వామ్యానికి తాను వ్యతిరేకమని చెప్పారు. ముగ్గురు లోక్‌సభ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఢిల్లీ కాంగ్రెస్ కమిటీ అభిప్రాయాలను పార్టీ హైకమాండ్ తిరస్కరించి, ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను కాంగ్రెస్ ఈశాన్య ఢిల్లీ అభ్యర్థి కన్హయ్య కుమార్ బహిరంగంగా ప్రశంసించడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ఢిల్లీ యూనిట్ అధ్యక్షుడిగా లవ్లీ 2023 ఆగస్టు నుంచి బాధ్యతల్లో ఉన్నారు.

ఇసి నోటీసులిచ్చినా..ఆగని విద్వేష జాఢ్యం

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారు. "మన్మోహన్ సింగ్ పొరపాటున ఈ ప్రసంగం చేయలేదు. తెలిసే అలా చేశారు. ఎందుకంటే 2009 ఏప్రిల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మైనారిటీలకు, ముఖ్యంగా ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. సచార్ కమిటీ నివేదిక ద్వారా తప్పుడు ప్రకటనలు చేశారు. దళితుల కంటే ముస్లింలు అధ్వానంగా ఉన్నారన్నారు. ముస్లింలను ఎస్‌సిలుగా ప్రకటించాలనీ, దీంతో దళితులకు ఇవ్వాల్సిన రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తున్నది" అని నడ్డా అన్నారు.

రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో జరిగిన ర్యాలీలో మోడీ తొలిసారిగా వ్యాఖ్యలు చేసిన మూడు రోజుల తర్వాత ఎన్నికల సంఘం బిజెపి, కాంగ్రెస్‌ల స్టార్ క్యాంపెయినర్ల మోడల్ ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) ఉల్లంఘనలకు వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షులు నడ్డా, మల్లికార్జున్ ఖర్గేలను ఉద్దేశించి లేఖలను పంపింది. ఆ లేఖలో ఉల్లంఘించిన వారి పేర్లను మాత్రం పేర్కొనలేదు.

ఈనెల 21న బాన్స్‌వారాలో.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ర్యాలీకి హాజరైన వారి తల్లులు, సోదరీమణుల సంపదను "చొరబాటుదారులు", "ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి" పంపిణీ చేస్తుందని ఒక వర్గం వారిని టార్గెట్ చేస్తూ మోడీ అన్నారు. ఆ తర్వాత జరిగిన ర్యాలీల్లోనూ ఆయన ఇలాంటి వ్యాఖ్యలే చేయటం గమనార్హం. ఈ ప్రసంగం దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు కారణమైంది. గ్లోబల్ ప్రెస్‌లో అపూర్వమైన ద్వేషపూరిత ప్రసంగంగా ఇది అభివర్ణించబడింది.

నడ్డా మాత్రమే కాదు.. అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, యోగి ఆదిత్యనాథ్ సహా బిజెపి ఇతర స్టార్ క్యాంపెయినర్లు విద్వేషాలను రెచ్చగొట్టడమే ఏకైక కార్యక్రమంగా పెట్టుకున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల యూపీలోని దాద్రీలో జరిగిన ర్యాలీలో రాజ్‌నాథ్ కూడా మన్మోహన్ ప్రసంగాన్ని ప్రస్తావించారని చెప్పారు. "2006లో, జాతీయ రక్షణ మండలి సమావేశంలో దేశ వనరులపై మొదటి హక్కు మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలదేనని అన్నారు. దేశ వనరులు ప్రతి ఒక్కరికీ చెందుతాయి. ప్రధాని ఈ విషయం చెప్పినప్పుడు వారు (ప్రతిపక్షాలు) హంగామా (రక్కస్) చేస్తున్నారు"అని ఆయన అన్నారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని బెమెతరలో జరిగిన ర్యాలీలో.. ముస్లిం వ్యక్తిగత చట్టాలను తీసుకువస్తామనీ, దేశాన్ని "షరియా చట్టం" ప్రకారం నడుపుతామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని అమిత్ షా ఆరోపించారు. "కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను జాగ్రత్తగా చదవండి. మళ్లీ వ్యక్తిగత చట్టాలు తీసుకువస్తామని ఆ పార్టీ చెప్పింది. ముస్లిం వ్యక్తిగత చట్టాలను తీసుకొచ్చి ఏం చేయాలనుకుంటున్నారు? షరియా చట్టం ప్రకారం ఈ దేశం నడుస్తుందా? మీరు ట్రిపుల్ తలాక్‌ను వెనక్కి తీసుకురాగలరా? కాంగ్రెస్ పార్టీ ముస్లిం లీగ్ అజెండాను తీసుకుంటున్నది. కానీ రాహుల్ బాబా మిమ్మల్ని ప్రజలు ఎన్నుకోరు. ట్రిపుల్ తలాక్‌ను వెనక్కి తీసుకురారు. సిఎఎ, ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370లను తాకలేరు" అని అమిత్ షా అన్నారు. అదే రోజు జరిగిన మరో ర్యాలీలోనూ ఆయన ఆ వాదనను మళ్లీ వినిపించటం గమనార్హం.

ఉత్తర ప్రదేశ్‌లోని ఇటావాలో శనివారం జరిగిన ర్యాలీలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)లు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా దేశాన్ని ఇస్లామీకరిస్తారని ఆదిత్యనాథ్ విషంగక్కారు. "వెనుకబడిన కులాలకు 27 శాతం రిజర్వేషన్లలో వారు ముస్లింలను చేర్చుతారు. మీరు దీన్ని అంగీకరిస్తారా? భారత్‌లో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండవచ్చా? మత ప్రాతిపదికన రిజర్వేషన్లను అంబేద్కర్ వ్యతిరేకించారు. ఇప్పుడు దేశాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రజలు తమకు నచ్చినవి తినకుండా ఆపకూడదని సూచించడం ద్వారా ఆవులను వధించడాన్ని సూచిస్తున్నదనీ, అది విశ్వాసాలతో ఆడుకోవటమేనని ఆయన అన్నారు. బిజెపి నాయకుల వ్యాఖ్యలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నదనీ, ఇది ఇలాగే కొనసాగితే ఎన్నికల్లో ఆ పార్టీకే నష్టమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

మీ కోసం

పచ్చి మిరపకాయలు కోసిన తరువాత చేతులు మంట పుడుతుంటే.. పంచదార కలిపిన నీటితో చేతులు కడుక్కోవాలి.

జీవన సౌరభం

గొప్పగా జీవించడం అంటే ఆడంబరంగా జీవించడం కాదు.. ఆనందంగా జీవించడం.

పొమ్మనలేక పొగ

పూర్వం మధుపాడ గ్రామంలో సత్తిబాబు, కామేశ్వరి దంపతులు నివసిస్తూ ఉండేవారు. వారికి నలుగురు సంతానం. కాయకష్టం చేసి రూక రూక సంపాదించి పిల్లల్ని పోషించేవారు. రెక్కాడితే గాని డొక్కాడని జీవితం వారిది.

సత్తిబాబు తెచ్చే సంపాదనతో ఎవరి దగ్గర చేయి చాపకుండా, అప్పు చేయకుండా కామేశ్వరి కుటుంబ పోషణ చేసేది. సత్తిబాబు దూరపు బంధువు లోభనాథం తల్లికి ఆరోగ్యం బాగోలేనందున మధుపాడలో ఉన్న ఆయుర్వేద వైద్యునికి చూపించే నిమిత్తం కుటుంబంతో సహా వచ్చాడు. సత్తిబాబు దంపతులు వారిని ఆప్యాయంగా పలకరించి ఆతిథ్యమిచ్చారు. లోభనాథం కుటుంబం వారికి నచ్చిన వంటకాలు చేయించుకుని తింటూ హాయిగా కాలక్షేపం చేశారు. అలా వారం గడిచింది చేతిలో డబ్బులు అయిపోవడంతో ఏమి చేయడానికి సత్తిబాబుకి తోచలేదు. ఇది గమనించిన కామేశ్వరి తన చెవి కమ్మలు ఇచ్చి 'ఇవి కుదువ పెట్టి డబ్బులు తీసుకు రండి' అని చెప్పింది.

భార్య మాట ప్రకారం షావుకారు ఇంటికి వెళ్ళబోతుండగా 'వచ్చే వారం మరో స్నేహితుని ఇంటికి వెళ్దాం. ఈ నెల అంతా ఇలా గడిపేద్దాం' అన్న లోభనాథం మాటలు సత్తిబాబు చెవిన పడ్డాయి. ఆ విషయం భార్యకు చెప్పాడు.

ఆ మాటలు విన్న కామేశ్వరికి గుండె గుభేల్ మంది. వారి పథకం అర్థమయ్యింది. 'మీరు వెళ్ళిపొండి అని చెప్పకుండా వాళ్ళంతట వాళ్లే వెళ్ళిపోయే పరిస్థితి కల్పించాలి అనుకుంది.

పచ్చి కట్టెలను పొయ్యిలో పెట్టి మంట రాజేసింది. ఇల్లంతా దట్టమైన పొగ అలముకుంది. దాంతో ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు లోభనాథం కుటుంబం. ఆ పొగ భరించలేక లోభనాథం తల్లి పిల్లలు వెళ్ళిపోదామని పేచీ పెట్టారు. గత్యంతరం లేక లోభనాథం తక్షణమే కుటుంబంతో మరో గ్రామానికి పయనమయ్యాడు. 'మొత్తానికి పొమ్మనలేక పొగ పెట్టావు' అన్నాడు సత్తిబాబు. 'పొగ పెడితేనే కదా కలుగులో ఎలుక బయటకు వచ్చేది' అంది కామేశ్వరి. నాటినుంచి ఈ సామెత వాడుకలోకి వచ్చింది.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445



సరైన నీడ ఏది?

పిల్లలూ, ప్రియా స్కేటింగ్ చేస్తుంది. పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో తన సరైన నీడను కనిపెట్టండి చూద్దాం.

జవాబు : 2

నేను గీసిన బొమ్మ

పి.శేఖర్,
5వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మేడ మీద మేలైన సాగు

చాలామంది తమ ఇంటి మిద్దెలను సాయంత్రపు చల్లగాలికో, వేసవి రాత్రి పడక సీనుకో, వడియాల ఆరవేతకో వేదికలుగా ఉపయోగిస్తారు. కొంతమంది వాటిని కూరగాయల సాగు కేంద్రాలుగా, పండ్ల చెట్ల పెంపకం స్థావరాలుగా మార్చేస్తున్నారు. గొప్ప ఫలితాలు సాధించి, మిద్దెతోటల విస్తరణకు పచ్చ తోరణాలు రెపరెపలాడిస్తున్నారు. భువనేశ్వర్‌లో నివసిస్తున్న జయంతి సాహూ ఆకుకూరలు, కూరగాయలను మాత్రమే కాదు; 17 రకాల పండ్లచెట్లనూ పెంచుతున్నారు. ఆయా కాలాలకు తగ్గట్టుగా ఫలాలనూ అందుకుంటున్నారు.

మొక్కలను పెంచటం ఒక ఆరోగ్యకరమైన వ్యాపకం. మానసికంగా, శారీరకంగా ఆనందాన్నిచ్చే దినచర్య. చిన్న చిన్న తొట్టెల్లో పూలమొక్కలను పెంచటం ఒకప్పటి పద్ధతి. అంతకన్నా కాస్త పెద్ద తొట్టెల్లో పండ్ల తోటలనే సాగు చేయొచ్చన్నది ఇప్పటి ఆచరణ. జయంతికి చిన్నప్పటినుంచి మొక్కలు పెంచటం అంటే ఇష్టం. తమ ఇంటి వద్ద కొంత భాగంలో తండ్రి కూరగాయల మొక్కలూ, పాదులూ పెంచేవాడు. వాటికి నీళ్లు పోయడం, ఎరువులు వేయడం వంటి పనులు జయంతి చేసేది. మొక్కలు మొగ్గలు తొడిగి, పూలుగా వికసించి, పిందెలుగా మారి, కాయలుగా ఎదుగుతూ ఉంటే– చూడటానికి చాలా ఆనందంగా ఉండేది. ఆ మొక్కల వరుసలోనే పూలమొక్కలు నాటాలని, అవి అందంగా వికసిస్తే చూడాలని తపన పడేది. ఆమె తండ్రి ఏమో కూరగాయల మొక్కల సాగుకే ప్రాధాన్యం ఇచ్చేవాడు. జయంతి కొంచెం పెద్దయ్యాక సొంతంగా గులాబి, ఇతర పూలమొక్కలను పెంచింది. అవి పూసి, అందంగా వికసించినప్పుడు ఇంటిల్లిపాదీ చాలా సంతోషించారు. ఇంటికి ఎవరైనా బంధుమిత్రులు వస్తే ఆమె తండ్రి ఆ పూలమొక్కలను చూపించి, 'ఇది మా అమ్మాయి తోట' అని ఆనందంగా చెప్పేవాడు. అప్పటి ఉత్సాహాన్ని జయంతి ఇప్పటికీ మరచిపోలేదు. పుట్టినింట మొగ్గ తొడిగిన ఇష్టమే ఇప్పుడు వందలాది మొక్కలను పెంచటానికి ప్రేరణగా ఉందని ఆమె చెబుతారు.

"1989లో నేను బిఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. ఆ కొద్దిరోజులకే వివాహం జరిగి, భువనేశ్వర్‌లోని అత్తారింటికి చేరాను. అక్కడా రకరకాల మొక్కలు పెంచటం ఒక అలవాటుగా కొనసాగించాను. ఒకసారి మేము పుష్ప, ఫల మొక్కల ప్రదర్శన చూట్టానికి వెళ్లాం. అక్కడ ఒక మాదిరి తొట్టెల్లో ఉన్న పండ్ల మొక్కలను చూసి, ఆశ్చర్యపోయాను. పొలాల్లో, నేలలో పెద్ద పెద్దగా ఉండే పండ్ల చెట్లను ఇలా కూడా సాగు చేయొచ్చని అప్పుడే ప్రత్యక్షంగా చూశాను. ఆ తరువాత మా మిద్దె మీదికి పండ్లమొక్కలు వచ్చి చేరాయి." అని చెప్పారు జయంతి.

ఇంటి మిద్దె మీద 350 చదరపు అడుగులతో సహా ఇంటి చుట్టూ ఎక్కడ వీలైతే అక్కడ రకరకాల మొక్కలు పెంచుతున్నారు జయంతి. మొత్తం 1500 చదరపు గజాల స్థలంలో ఆమె సాగు చేస్తున్నారు. అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు ఇంట్లోనే పండిస్తున్నారు. బజారుకు వెళ్లి కొనాల్సిన అవసరం లేదు. కాస్త ఎక్కువగా పండినప్పుడే ఆమెనే 'మా ఇంటి పంట' అంటూ బంధుమిత్రులకు అందిస్తున్నారు. వంగ, బెండ, దొండ, కాకర, సొరకాయ, బంగాళాదుంప, చిలగడ దుంప, క్యారెట్, బీట్‌రూట్, బచ్చలి, తోటకూర, పాలకూర, కరివేప ... ఇలా మార్కెట్లో ఏమేమి దొరుకుతాయో అవన్నీ జయంతి ఇంట్లోనే పండిస్తున్నారు.

ఇప్పుడు పండ్ల చెట్లు కూడా ఆ మిద్దెతోటను ఒక చిట్టడవిలా మార్చేశాయి. బొప్పాయి, నిమ్మ, దానిమ్మ, మామిడి, సపోటా, జామ, నారింజ, స్టార్ ఫ్రూట్, వాటర్ ఆపిల్, యాపిల్ బేర్ ... ఇలా 17 రకాల పండ్ల చెట్లు కొద్ది సంవత్సరాలుగా ఫలాలనిస్తున్నాయి. ఇప్పుడు ఆ ఇంటిని సందర్శించటం అంటే ఒక ఉద్యానవనాన్ని దర్శించటమే! అలా చూస్తూ చూస్తూ చెట్టునే పండిన ఏదొక తాజా ఫలాన్ని రుచి చూడొచ్చు కూడా! ఇప్పుడు ఇతర చెట్లతో పాటు మామిడి విరగగాచి ఉంది. ఇంకొద్ది రోజుల్లో కోతకు రావొచ్చు. ఆ రోజు కోసం జయంతి ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇంటిపంటతో ఆరోగ్యం, ఆనందం

ఇలా మనమే స్వయంగా సాగు చేసుకోవటం వల్ల చాలా ఆనందం ఉంది. సేంద్రియ ఎరువులతో పండించుకోవటం వల్ల చాలా ఆరోగ్యం కూడా. నిజానికి ఓపిక, తీరిక ఉంటే ఇది గొప్ప ఆహ్లాదాన్ని ఇచ్చే పని. మొక్కలను పసిపాపల్లా చూసుకోవాలి. అవి మనతో మాట్లాడుతున్నట్టే ఉంటుంది. మన కళ్ల ముందే ఎదిగిన మొక్కలు మనకు ఫలాలను ఇస్తుంటే చాలా సంతోషంగా ఉంటుంది. అలాంటి మానసిక తృప్తితోనే మిద్దెతోటను దాదాపు 30 ఏళ్ల నుంచి సాగుచేస్తున్నాను.

– జయంతి సాహూ

మిద్దె సాగుకు ఎనిమిది సూత్రాలు

మిద్దెలపై సాగు ఎలా చేయాలో జయంతి తన అనుభవంలో గ్రహించిన 8 విలువైన సూత్రాలను వివరించారు. అవి :

- మొక్కలకు నీరు పోయటం ఎంత అవసరమో, ఆ నీరు నిల్వ ఉండకుండా చేయటమూ అంతే ముఖ్యం. కాబట్టి, నీరు సక్రమంగా పంపిణీ అయ్యే వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.
- తొట్టెలకు ఎక్కువ ఖర్చు పెట్టొద్దు. నేను చేపల నిల్వకు ఉపయోగించే బాక్సులు పాతవి కొన్నాను. 20 ఏళ్ల నుంచి పాడవకుండా నాణ్యంగా ఉన్నాయి. ఆ తరహా వృథా తొట్టెలు మీకూ దొరకొచ్చు.
- అంటు కట్టిన మొక్కలను, వేగంగా కాపునకు వచ్చే మొక్కలను ఎంచుకోండి.
- మొక్క నాటటానికి వీలైన సారవంతమైన మట్టి తయారీ అన్నిటికన్నా ముఖ్యం. 30 శాతం సారవంతమైన మట్టి, 30 శాతం కంపోస్టు, 30 శాతం కోకోపిట్, 5 శాతం వేపపిండి, 5 శాతం బోన్‌మీల్ కలిపి, మట్టిని సిద్ధం చేయాలి.
- మొక్క పెరుగుతున్న క్రమంలో పోషకాలతో కూడిన ద్రవ ఎరువులు అందించాలి. కిలో ఆవాలు, పావు కిలో వేపపిండి ఐదు లీటర్ల నీటితో కలిపి, ఐదు రోజుల పాటు నీడలో ఉంచి, తరువాత ద్రవ ఎరువుగా వాడొచ్చు.
- తెగుళ్లను, హాని చేసే క్రిమికీటకాలను ఆదిలోనే గమనించాలి. తెగులు సోకిన ఆకులు తదితర భాగాలను వేరు చేసి, దూరంగా పారేయాలి. ప్రతి మొక్కనూ ప్రతి పూటా జాగ్రత్తగా గమనించి, తగిన సహకారం అందించాలి.
- పండ్ల మొక్కలు మంచి దిగుబడి ఇవ్వటానికి ఏడాదికి ఒకటి రెండు సార్లు కాపు లేని సమయంలో కొమ్మలను కత్తిరించాలి.
- రెండు మూడేళ్లకు ఒకసారి వేరు భాగంలో తవ్వి, మట్టి పొరని మార్చాలి. సారం పెంచే పోషకాలను అందివ్వాలి.

వెండితెరపై ఎర్రజెండా పాటలు







సినిమా చరిత్రలో కార్మికుల కథాంశంతో ఎన్నో చిత్రాలు వచ్చాయి. మన తెలుగులో అయితే ప్రముఖ హీరోలు కార్మిక నాయకులుగా, కార్మికులుగా పలు చిత్రాల్లో నటించి మెప్పించారు కూడా. కార్మికుల పాత్రల్లో అలరించిన కథానాయకులలో అలనాటి హీరోలు ఎన్‌టిఆర్, నాగేశ్వరరావు, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్‌బాబు తదితరులు ఉన్నారు. వారు పోషించిన పాత్రలు ప్రేక్షకుల మదిలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఈ పాత్రలకు తగ్గట్లు– పాటల రచయితలు వాళ్ల తరపున కలం ఎత్తితే, గాయకులు తమ గళాన్ని బలంగా వినిపించారు.

'శెభాష్ రాముడు' చిత్రంలో ఘంటసాల గళంతో 'జయమ్ము నిశ్చయమ్మురా.. జంకు గొంకు లేక నువ్వు సాగిపొమ్ము రా' అంటూ సాగే పాటలో ఎన్‌టిఆర్ కార్మికుల పక్షాన కదం తొక్కడం చూపించారు. ఈ పాటలో ఆయన రిక్షా కార్మికుడిగా కనిపిస్తారు. యమగోల సినిమాలోనూ అక్కడ కార్మిక సంఘం పెట్టి, హక్కులకై యమకింకరులందరినీ కదిలిస్తాడు. నాగేశ్వరరావు, శోభన్‌బాబు, తదితరులు కార్మికులుగా ఆయా పాత్రల్లో ఒదిగిపోయేవారు. మేడే సందర్భంగా ఆయా చిత్రాల్లో వచ్చిన గీతాలు ఎప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తాయి. అభ్యుదయ సినిమాల నిర్మాణం విరివిరిగా జరుగుతున్న కాలంలో కృష్ణ అనేక సాంఘిక చిత్రాల్లో కర్మాగార కార్మికుడిగా నటించారు. 'ఎన్‌కౌంటర్' చిత్రంలోనైతే నక్సలైట్‌గానూ నటించారు.

మేడే పాటలు

ఎర్రజెండా సినిమాలు అనగానే గుర్తొచ్చే పేర్లు మాదాల రంగారావు, ఆర్.నారాయణమూర్తి. వీళ్ల నమ్మిన సిద్ధాంతం కోసం తీసిన ప్రతి సినిమా కార్మిక, శ్రామిక, బడుగు, బలహీన వర్గాల పక్షమే నిలుస్తుంది. చివరికంటూ కార్మికులు, శ్రామికులు, రైతుల పక్షాన నిలిచే సినిమాలు అందించిన వారిలో వీరి తరువాతే ఎవరైనా! 'అన్యాయం.. అక్రమాలు.. దోపిడీలు.. దురంతాలు.. ఎన్నాళ్లని ఎన్నేళ్లని నిలదీసినదీ రోజే మేడే..' అంటూ కార్మిక దినోత్సవానికి సిసలైన అర్థం చెబుతూ సాగుతుంది 'ఎర్రమల్లెలు' చిత్రంలోని పాట. ఈ చిత్రంలో మురళీమోహన్ కూడా కీలక పాత్రలో కనిపిస్తారు.

విప్లవ పాటల నాయకుడు

వెండితెరపై మేడే అంటే వెంటనే గుర్తొచ్చే పేరు ఆర్.నారాయణ మూర్తి. ఆయన పాట, పాత్ర.. ఎప్పుడూ పీడితుల పక్షమే.. శ్రమ జీవుల హక్కుల కోసమే. నారాయణమూర్తి పాత్రకు వందేమాతరం శ్రీనివాస్ గళం తోడై కదం తొక్కిన పాటలెన్నో. 'ఎర్ర సైన్యం'లో 'బంజారే బంజో.. వోనారే బంజా' అటూ సాగే పాట ఆద్యంతం ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. 'ఒరేయ్ రిక్షా' సినిమాలో 'నా రక్తంతో నడుపుతాను రిక్షాను..' అంటూ సాగే పాటలో రిక్షా కార్మికుల బతుకువెతలను కళ్లకు కట్టినట్లు చూపించారు. 'చీమల దండు' చిత్రంలో 'ఎర్రజెండ ఎర్రజెండ ఎన్నీయాళ్లో.. ఎర్రెర్రనిదీ జెండెన్నీయల్లో' అంటూ సాగిన పాట అభిమానుల నాల్కలపై కొన్ని దశాబ్దాల పాటు నాట్యమాడింది. సామాన్య జనాన్ని ఉద్రూతలూగించిన పాటల్లో ఇదొకటి. 'సింగన్న' చిత్రంలో .. 'ఆయారే మేడే.. ఆయుధమై నేడే..' అంటూ సాగిన పాటలో కార్మికులను సంఘటిత శక్తిగా చాటిచెబుతుంది.

కార్మిక నాయక పాత్రల్లో ప్రముఖ నటులు

చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ కూడా కార్మిక పాత్రలు పోషించి, అభిమానులను అలరించారు. సింగరేణి కార్మికుడిగా బాలకృష్ణ నటించిన సినిమా 'నిప్పురవ్వ'. 'రండి కదలి రండి.. నిదుర లెండి.. కలిసి రండి' అంటూ ఆ చిత్రంలో సాగిన పాటలో కార్మిక నాయకుడిగా బాలకృష్ణ మెప్పించారు. మోహన్‌బాబు నటించిన 'శ్రీరాములయ్య' చిత్రంలోని 'భూమికీ పచ్చాని రంగేసినట్టే ఓయమ్మా లాలో.. ' అనే పాట ప్రతి కార్మిక దినోత్సవ వేడుకల్లో మార్మోగుతూనే ఉంటుంది. శ్రమను నమ్ముకున్న ప్రతి ఒక్కరి గుండె తడుతూనే ఉంటుంది. కేజే ఏసుదాస్ గళం నుంచి జాలు వారిన ఈ గీతం కర్షకుల కష్టం గురించి చెబుతూ సాగుతుంది. శ్రీహరి నటించిన 'కుబుసం' సినిమాలో పల్లె వృత్తుల వెతల్ని కళ్లకు కట్టేలా, గోరటి వెంకన్న అల్లిన పాట 'పల్లె కన్నీరు పెడుతుందో.. ఓ యమ్మలాలా.. ' అంటూ సాగే పాటలో వలస బతుకుల కష్టాలను చాటిచెప్పారు.

ఇలా ఎన్నో గీతాలు కార్మికుల జీవితాన్ని, పోరాటాన్ని వెండితెరపై ఆవిష్కరించాయి. శ్రామికుల హక్కులు తెలియజేస్తూ.. ప్రజలను చైతన్యం చేశాయి.

ఐపీఎల్

17వ సీజన్లో సిక్సర్ల తుఫాన్ కొనసాగుతోంది. విల్ జాక్స్ (100 నాటౌట్) శతక విధ్వంసంతో ఆదివారం మొతెరా మైదానం మోత మోగింది. 201 పరుగుల ఛేదనలో జాక్స్ 41 బంతుల్లోనే సెంచరీ సాధించగా.. విరాట్ కోహ్లి (70 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. కోహ్లి, జాక్స్ మెరుపులతో 201 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 16 ఓవర్లలోనే ఊదేసింది. ఈ సీజన్లో బెంగళూర్‌కు ఇది వరుసగా రెండో విజయం కావటం విశేషం.

బ్రేకుల్లేని జాక్స్

ఛేదనలో విల్ జాక్స్ అజేయ సెంచరీ
విరాట్ కోహ్లి అర్ధ శతక జోరు
గుజరాత్‌పై బెంగళూరు ఘన విజయం
గుజరాత్ 200/3, బెంగళూర్ 206/1

అహ్మదాబాద్ : విల్ జాక్స్ (100 నాటౌట్, 41 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్స్‌లు) అజేయ శతక సునామీలో గుజరాత్ టైటాన్స్ కొట్టుకుపోయింది. వరుస ఓవర్లలో తుఫాన్ సృష్టించిన విల్ జాక్స్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. విరాట్ కోహ్లి (70 నాటౌట్, 44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) సైతం రాణించటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 206 పరుగులు చేసింది. 9 వికెట్ల తేడాతో మరో 24 బంతులు ఉండగానే ఘన విజయం సాధించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు నమోదు చేసింది. సాయి సుదర్శన్ (84, 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), షారుక్ ఖాన్ (58, 30 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు.

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బ్యాటర్ విల్ జాక్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. గుజరాత్ టైటాన్స్‌కు పది మ్యాచుల్లో ఇది ఆరో ఓటమి కాగా.. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు పది మ్యాచుల్లో ఇది మూడో పరాజయం.

జాక్స్ తుఫాన్ : 201 పరుగుల ఛేదనలో 14 ఓవర్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 148/1తో నిలిచింది. విరాట్ కోహ్లి 69 పరుగుల వద్ద ఉండగా.. విల్ జాక్స్ 44 పరుగుల వ్యక్తిగత స్కోరుతో క్రీజులో నిలిచారు. ఈ దశలో అందరూ విరాట్ కోహ్లి సెంచరీ కోసమే ఎదురుచూశారు. కానీ విల్ జాక్స్ ఝూలు విదిల్చాడు. వరుస ఓవర్లలో మోహిత్ శర్మ, రషీద్ ఖాన్‌లను ఊచకోత కోశాడు. 4, 6, 6, 2, 6, 4తో మోహిత్ శర్మను జాక్స్ ఉతికారేశాడు. ఆ తర్వాత రషీద్ ఖాన్‌ను సైతం జాక్స్ దంచికొట్టాడు. 6, 6, 4, 6, 6తో విశ్వరూపం చూపించాడు. ఈ రెండు ఓవర్లలో 29 పరుగుల చొప్పున పిండుకున్న విల్ జాక్స్ 41 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. విల్ జాక్స్ ఊచకోత ఇన్నింగ్స్‌తో మరో 24 బంతులు మిగిలి ఉండగానే రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 201 పరుగుల లక్ష్యాన్ని ఊదేసింది. విరాట్ కోహ్లి (70 నాటౌట్), డుప్లెసిస్ (24) తొలి వికెట్‌కు 40 పరుగులు జోడించి శుభారంభం అందించగా.. ఆ తర్వాత కోహ్లితో కలిసి విల్ జాక్స్ బెంగళూర్ ఇన్నింగ్స్‌కు రాకెట్ స్పీడ్ జోడించాడు.

సాయి, షారుక్ రాణించగా.. : తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసింది. వృద్ధిమాన్ సాహా (5), శుభ్‌మన్ గిల్ (16) విఫలమయ్యారు. సాయి సుదర్శన్ (84), షారుక్ ఖాన్ (58) అర్ధ సెంచరీలతో టైటాన్స్ ఇన్నింగ్స్‌ను నడిపించారు. మిడిల్ ఓవర్లలో టైటాన్స్ స్కోరు వేగం కాస్త నెమ్మదించటంతో ఆ జట్టు ఆశించిన స్కోరు సాధించలేదు. డెవిడ్ మిల్లర్ (26 నాటౌట్) డెత్ ఓవర్లలో తనదైన విధ్వంసక ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. చేతిలో 7 వికెట్లు ఉన్నప్పటికీ గుజరాత్ టైటాన్స్ 200 పరుగులతోనే సరిపెట్టుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బౌలర్లలో స్వప్నిల్ సింగ్, మహ్మద్ సిరాజ్, గ్లెన్ మాక్స్‌వెల్ తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

సన్‌రైజర్స్ చిత్తు

- 213 పరుగుల ఛేదనలో చతికిల
- సూపర్ కింగ్స్ ఖాతాలో ఐదో విజయం
- చెన్నై 212/3, హైదరాబాద్ 134/10

చెన్నై : విధ్వంసక బ్యాటింగ్‌తో ఐపీఎల్ 17 సీజన్‌ను వేడెక్కించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండు మ్యాచుల్లో భారీ స్కోర్ల ఛేదనలో చతికిల పడింది. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్‌కింగ్స్ చేతిలో 78 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ట్రావిశ్ హెడ్ (13), అభిషేక్ శర్మ (15), అన్మోల్ ప్రీత్ (0), నితీశ్ కుమార్ (15), హెన్రిచ్ క్లాసెన్ (20), అబ్దుల్ సమద్ (18) అంచనాలకు తగినట్టు ఆడటంలో విఫలమయ్యారు. 18.5 ఓవర్లలో 134 పరుగులకు కుప్పకూలిన సన్‌రైజర్స్ సీజన్లో నాల్గో ఓటమి మూటగట్టుకుంది. అంతకుముందు, రుతురాజ్ గైక్వాడ్ (98, 54 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. డార్లీ మిచెల్ (52, 32 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) సైతం అర్ధ సెంచరీతో రాణించటంతో చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ అజింక్య రహానె (9) విఫలమైనా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (98), డార్లీ మిచెల్ (52) రెండో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 27 బంతుల్లోనే గైక్వాడ్ అర్ధ సెంచరీ సాధించగా.. డార్లీ మిచెల్ సైతం ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 29 బంతుల్లో ఫిఫ్టీ అందుకున్నాడు. శివం దూబె నాలుగు సిక్సర్లతో అలరించగా.. ఆఖర్లో ఎం.ఎస్ ధోని ఓ బౌండరీతో చెపాక్‌కు ఉర్రూతలూగించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68